స్థానికతపై దారెటు?

ఇంకా ఎటూ తేల్చని ఉన్నత విద్యా శాఖ
పదేళ్లు దాటిందని తెలంగాణలో ఏపీ కోటా రద్దు
అలాగే తెలంగాణ కోటా రద్దుకు ఏపీ నిర్ణయం
కానీ స్థానికత తేల్చకుండానే ఈఏపీసెట్ నోటిఫికేషన్
ప్రభుత్వ నిర్ణయం మేరకు అడ్మిషన్లు అని నిబంధన
పరీక్ష రాశాక సీటు ఇవ్వలేం అంటే ఎలా?

12

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 26-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 340 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.1:43 తదుపరి త్రయోదశి, నక్షత్రం: ధనిష్ఠ రా.2:30 తదుపరి శతభిషం, వర్జ్యం: ఉ.7:35-9:06, అమృతఘడియలు: సా.4:40-6:10, దుర్ముహూర్తం: ఉ.11:56-12:45, రాహుకాలం: మ.12.00-1:30, సూర్యోదయం: 6:18, సూర్యాస్తమయం: 6:23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్, డీజీపీ గుప్తా, మంత్రులు లోకేశ్, అనగాని. సదస్సులో పాల్గొన్న కలెక్టర్లు, ఎస్పీలు

మాట ఇచ్చినట్టే మంచి పాలన

విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం: సీఎం

ఏప్రిల్ తొలి వారంలో మెగా డీఎస్సీ

16,347 టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం


ఉద్యోగులకు గత ప్రభుత్వ బకాయి రూ.7,230 కోట్లు చెల్లింపు
ప్రతి అధికారి బాధ్యతగా, గౌరవభావంతో పథకాలు అందించాలి
వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్..15% వృద్ధితోనే స్వర్ణాంధ్ర-2047
తాగునీటి సమస్య తలెత్తరాదు.. 20 వేల కి.మీ. గుంతల పూడ్చివేత
గంజాయి, రౌడీయిజం కట్టడికి ఎస్పీలతో సమన్వయం
కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలోపెట్టి, పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తొమ్మిది నెలలుగా మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ మొదటివారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అవుతుందని తెలిపారు. మంగళవారం సచివాలయంలో జరిగిన మూడో విడత కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. "గత ప్రభుత్వం విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లింది. జరిగిన నష్టాన్ని అధిగమించి రాష్ట్రం అభివృద్ధి చెందేలా, ప్రజలకు సంక్షేమం అందించేలా చిత్తశుద్ధితో పనిచేయండి." అని కలెక్టర్లకు ఆయన సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజల కోసం, జిల్లా కోసం ఏం చేయాలనేది కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలని నిర్దేశించారు. "ప్రజలపై మీ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మీ పనితీరుతో వచ్చే ఫలితాలు వారిపై


మిగతా 13వ పేజీలో...

బెట్టింగ్‌కు చెక్

ప్రత్యేక చట్టం తెస్తాం: సీఎం
నేరాలను అదుపులో ఉంచాలి
ప్రభుత్వ విశ్వసనీయతను ప్రశ్నించే పరిస్థితి రాకూడదు
ఇతర నేరాలు తగ్గినా ఆర్థిక మోసాలు పెరిగాయి
గంజాయి సాగు తగ్గింది.. వినియోగం ఇంకా తగ్గాలి
నేరగాళ్ల తెలివికి వివేకా హత్య కేసు ఓ ఉదాహరణ
టెక్నాలజీని వాడుకోండి
పోలీసులకు సీఎం సూచన



జీఎస్టీపై సమీక్షలు చేసి బకాయిలు వసూలు చేయాలి. పన్ను ఎగవేతదారుల పట్ల కఠినంగా ఉండాలి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేస్తాం. మున్సిపల్ శాఖలో ఫిర్యాదులు రాకుండా ఉన్నప్పుడే బాగా పనిచేసినట్లు భావిస్తాం. శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దు. గంజాయి సరఫరా చేసే, రౌడీయిజం చేసేవారి పట్ల ఉక్కుపాదం మోపండి. శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్పీలతో కలెక్టర్లు కలిసి పనిచేయాలి. - సీఎం చంద్రబాబు



భూ సమస్యలపై కార్యాచరణ

ఏప్రిల్ నెలాఖరులోగా సిద్ధం చేయండి
ఏడాదిలోగా అన్నిటికీ పరిష్కారమే లక్ష్యం
ప్రభుత్వ జాబితాలో ప్రైవేటు భూములు..
వైసీపీ పాలనలో అరాచకానికిది పరాకాష్ఠ
రీ సర్వే చేస్తామని అక్రమాలు చేశారు
ఎన్నడూ లేనన్ని భూ సమస్యలు తెచ్చారు
పరిష్కార మార్గాలపై నెలలో తేల్చేద్దాం
ప్రతి ఊరిలో రికార్డుల పునఃపరిశీలన: సీఎం
రెవెన్యూశాఖ నివేదికపై అసంతృప్తి, ఆగ్రహం
రెవెన్యూ ఇంకా కంట్రోల్‌లోకి రాలేదని వ్యాఖ్య

12 13

టైమంటే టైమే!

సుదీర్ఘ చర్చలకు సెలవు
ఇప్పటివరకూ ఏం చేశారు?
ఇకపై ఏం చేయబోతున్నారు?
సుత్తి లేకుండా సూటిగా చెప్పండి
ఏసీ గదుల్లో కూర్చుంటే పనులు కావు
ప్రజల మధ్యకు వెళ్లి పనిచేయాలి
సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
కొత్త పంథాలో కలెక్టర్ల సదస్సు



న్యాయ నియామకాలపై ఏం చేద్దాం?

అఖిలపక్ష భేటీలో రాజ్యసభ చైర్మన్
ముందు మీ ప్రతిపాదనలు చెప్పండి
ఆ తర్వాతే మేం చెప్తాం: విపక్షాలు
సభలో కాకుండా చాంబర్లో చర్చ జరపడం ఏమిటి: టీఎంసీ
మళ్లీ ఎన్‌జేఏసీపై కేంద్రం దృష్టి?
జస్టిస్ వర్మ ఇంటికి త్రిసభ్య కమిటీ
30-35 నిమిషాలపాటు నివాస ప్రాంగణంలో పరిశీలన
అలహాబాద్ హైకోర్టు లాయర్ల నిరవధిక సమ్మె ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ప్రాంగణంలో నోట్ల కట్టల వ్యవహారం నేపథ్యంలో.. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మంగళవారం తన చాంబర్‌లో అఖిలపక్ష భేటీ జరిపారు. న్యాయ నియామకాల అంశంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఆయన ఈ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత మాట్లాడిన ధన్‌ఖడ్.. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) బిల్లును సుప్రీంకోర్టు 2015లో కొట్టివేయడంపై తన అభిప్రాయాలను మరోమారు ఘాటుగా వ్యక్తపరిచినట్లు సమాచారం. ఎన్‌జేఏసీ బిల్లు కొట్టివేతను

మిగతా 2వ పేజీలో...



టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలును తన కార్యాలయానికి పిలిపించుకొని వైసీపీ మద్యం స్కాంపై ఆరా తీస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

మద్యం స్కాంపై సమగ్ర దర్యాప్తు!

టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలుకు అమిత్ షా హామీ
లోక్‌సభలో లావు చేసిన ఆరోపణలపై కేంద్ర హోం మంత్రి దృష్టి
ఆయనను తన కార్యాలయానికి పిలిపించుకొని ఆరా
హోం మంత్రికి కీలక పత్రాలను అందజేసిన శ్రీకృష్ణదేవరాయలు
ఏపీతో పోలిస్తే ఢిల్లీ మద్యం స్కాం నీటి బొట్టంతేనని వెల్లడి

13

అవినాశ్ డైరెక్షన్ కృష్ణారెడ్డి యాక్షన్



వివేకా హత్య కేసును నీరుగార్చే కుట్ర!

సీబీఐ అధికారి రాంసింగ్‌పై తప్పుడు కేసు
కృష్ణారెడ్డిని ఆయన విచారించనేలేదు
బెదిరింపులు, చిత్రహింసలు కట్టుకథలే
సునీత దంపతులపైనా బోగస్ కేసు
రిటైర్డ్ అదనపు ఎస్పీ రాజేశ్వర్‌రెడ్డి, ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డిే ప్రధాన పాత్రధారులు
సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ అఫిడవిట్
సీసీ ఫుటేజీ సహా పలు ఆధారాలు సమర్పణ



న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును నీరుగార్చడానికే సీబీఐ అధికారి రాంసింగ్, వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కుమార్తె సునీతపై తప్పుడు కేసు బనాయించారని రాష్ట్రప్రభుత్వం స్పష్టంచేసింది. ఆ ముగ్గురూ తనను హింసించారని, బెదిరించారని వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి చెప్పినవన్నీ కట్టుకథలేనని తేల్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో అదనపు అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారి, ఆనాటి పులివెందుల సీఐ జి.రాజును విచారించిన తర్వాత.. పులివెందుల పోలీసు స్టేషన్లో సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించాక.. వివిధ సాంకేతిక అంశాలను విశ్లేషించి, దిగ్భ్రాంతికర విషయాలను సర్వోన్నత న్యాయస్థానానికి

మిగతా 12వ పేజీలో...

కాంట్రాక్టు వదులుకోండి

కాకినాడ ఆయిల్ బార్జి యజమానులకు రాష్ట్రస్థాయి నాయకుడి బెదిరింపులు

అస్మదీయ కాంట్రాక్టర్ కోసం ఇద్దరినీ హైదరాబాద్‌కు పిలిపించి వార్నింగ్
ప్రతిగా నెలకు 2 లక్షలు ఇచ్చేలా ఆఫర్
తిరస్కరించడంతో పీసీ పత్రాలకు మోకాలడ్డు
ఐవోసీకి బార్జిల అప్పగింతకు 21తో గడువు
కాంట్రాక్టు రద్దు చేస్తామంటూ ఐవోసీ లేఖ
లబోదిబోమంటున్న వ్యాపారులు



ఆయిల్ బార్జి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఆయన.. రాష్ట్రస్థాయి పదవిలో ఉన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా విశాఖలోని తూర్పు నౌకాదళ నౌకలకు డీజిల్ సరఫరా చేసే కాంట్రాక్టును తనకు కావాల్సిన ఓ కాంట్రాక్టర్‌కు ఇప్పించాలనుకున్నారు. అంతకు ముందు టెండర్లలో పాల్గొన్నా సదరు కాంట్రాక్టర్‌కు పని దక్కలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్‌తో కలిసి బెదిరింపులకు

మిగతా 14వ పేజీలో...



తిరుమలలోని పాపవినాశనం డ్యాంలో కయాక్ బోట్లలో తిరుగుతున్న సిబ్బంది

14

'పాపవినాశనం' డ్యాంలో బోటింగ్..!

ఆధ్యాత్మిక కేంద్రంలో పర్యాటకమా అంటూ విమర్శలు

నాడు బూతులు తిట్టి.. నేడు లోకేశ్‌తో భేటీ

14

మంత్రిని కలిసిన సిస్కో బృందంలో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు రవీంద్రరెడ్డి
గతంలో చంద్రబాబు, లోకేశ్, ఇతర టీడీపీ నేతలపై అసభ్య పోస్టులతో చెలరేగిన ఇప్పాల
అలాంటి వ్యక్తి మంత్రిని కలవడంపై రచ్చ..
సోషల్ మీడియాలో మండిపడ్డ కార్యకర్తలు
విషయం తెలుసుకొని సీరియస్ అయిన లోకేశ్
సిస్కో యాజమాన్యానికి మంత్రి ఓఎస్‌డీ లేఖ
ఏపీ ప్రాజెక్టుల్లో దూరం పెట్టాలని సూచన

'సోషల్' ఖాతాల వివరాలివ్వండి

అమెరికాలో గ్రీన్‌కార్డుదారులను ఆదేశించే యోచనలో డొనాల్డ్ ట్రంప్ సర్కారు
తాజా ప్రతిపాదనపై మే 5 వరకూ ప్రజాభిప్రాయ సేకరణ
భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని విమర్శలు
విదేశాలకు వెళ్లొస్తే.. సమాధానం చెప్పాల్సిందే
సుదీర్ఘ ప్రశ్నలకు సిద్ధంగా ఉండాలని భారతీయ గ్రీన్‌కార్డు, హెచ్-1బీ వీసాదారులకు అమెరికా హెచ్చరిక



2



2

ఏటీఎం నుంచి పీఎఫ్ సొమ్ము

జూన్ నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చు
యూపీఐ ద్వారా పీఎఫ్ ఖాతాలోని నిల్వను చూసుకునే అవకాశం
కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా

ముస్లింలకు మోదీ రంజాన్ తోఫా

పండగ రోజుల్లో దుస్తులు, ఆహార పదార్థాల కిట్ అందజేత
రంజాన్‌లో 32 లక్షల మంది ముస్లింలకు బహుమతి
బీజేపీ నూతన కార్యక్రమం
బిహార్ ఎన్నికల కోసమేనని విపక్షాల విమర్శ



మంగళవారం ఢిల్లీలో 'సౌగాత్ ఎ మోదీ' కిట్లను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

2



మిర్చి ధర భారీగా పతనం

12

తేజ రకం క్వింటాల్ రూ.9 వేల లోపే
వ్యాపారుల మాయాజాలం ఫలితం?
గుంటూరులో రైతుల ఆందోళన
4 గంటలకు పైగా హైవే దిగ్బంధం

కుక్కల తిండిలో కక్కుర్తి..!

» నాసిరకం ఆహారంతో ఆరు పోలీసు జాగిలాలు మృతి

» ఐదుగురు ఖాకీలపై హోంశాఖ చర్యలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాగిలాలకు పెట్టే తిండిలోనూ కక్కుర్తిపడి.. వాటికి నాసిరకం ఆహారం పెట్టి ఆరు కుక్కల మరణానికి కారణమైన పోలీసు అధికారిపై హోంశాఖ చర్యలకు ఉపక్రమించింది. ఆయనతో పాటు పోలీసుశాఖలో భాగమైన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ)లో మరో నలుగురిపైనా చర్యలు తీసుకుంటూ మంగళవారం జీవో జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరి పోలీసు బెటాలియన్‌లో ఐఎస్‌డబ్ల్యూ విభాగానికి చెందిన డీఎస్పీ శ్రీనివాసరావు నిబంధనలకు విరుద్ధంగా 35 కుక్కపిల్లలను కొనుగోలు చేశారు. శిక్షణ ఇచ్చే క్రమంలో డబ్బులు మిగుల్చుకోవడం కోసం వాటికి నాసిరకమైన ఆహారం పెట్టారు. దీంతో వాటికి జబ్బుచేసి నీరసించాయి. ఆరు కుక్కలు ప్రాణాలు కోల్పోయాయి. ఎవరికీ తెలియకుండా వాటి స్థానంలో వేరే కుక్కపిల్లల్ని తెచ్చిపెట్టారు. దీనిపై విచారణ జరిపిన పోలీసు శాఖ ప్రభుత్వానికి నష్టం కలిగించిన శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయడంతో హోంశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఇదే బెటాలియన్‌లో వాహనాలు తిప్పకుండానే ఏడాది పాటు డీజిల్ కొట్టించినట్లు చూపించి నిధులు కాజేసిన డీఎస్పీ కోటేశ్వరరావు, ఆర్ఐ సతీశ్ కుమార్, ఎస్ఐ కృష్ణపైనా చర్యలు తీసుకొంటూ జీవో జారీచేసింది. ఇలాంటి తప్పుల్ని కనిపెట్టకుండా అలసత్వం వహించిన నాన్ కేడర్ ఎస్పీ భాస్కర రెడ్డి (రిటైర్డ్) పైనా అభియోగాలు నమోదు చేసింది.

పైరేట్ల చెరలో ఏడుగురు భారతీయులు

» పశ్చిమ ఆఫ్రికా తీరంలో నౌకలోకి చొరబడి కిడ్నాప్

న్యూఢిల్లీ, మార్చి 25: పశ్చిమ ఆఫ్రికా తీరంలో ఏడుగురు భారతీయులను సముద్రపు దొంగలు(పైరేట్లు) కిడ్నాప్ చేశారు. కామెరూన్‌లోని డౌలాకు వెళ్లే మార్గంలో 'బిటుమెన్ రివర్' అనే నౌకలో నావికులుగా ఉన్న వీరిని సముద్రపు దొంగలు అదుపులోకి తీసుకున్నారు. పనామాకు చెందిన ఈ నౌకను రూబిస్ అసాల్ట్ అనే సంస్థ నిర్వహిస్తోంది. కిడ్నాప్ అయిన వారిలో తమిళనాడులోని తేనీకి చెందిన లక్ష్మణ్ ప్రదీప్ మురుగన్, కరూర్‌కు చెందిన సతీశ్ కుమార్ సెల్వరాజ్, కేరళకు చెందిన రాజేంద్రన్ భార్గవన్, బిహార్‌కు చెందిన సందీప్ కుమార్ సింగ్‌తోపాటు రొమేనియాలో ఉంటున్న ముగ్గురు భారతీయులు ఉన్నారు. భద్రతా నివేదికల ప్రకారం ముగ్గురు వ్యక్తులు నౌకలోకి ఎక్కి కాల్పులు జరిపారని తెలిసింది. అయితే సముద్రపు దొంగలు నౌక నుంచి దిగిపోయారని రూబిస్ అసాల్ట్ సంస్థ సెక్యూరిటీ ఆఫీసర్ వెల్లడించారు.

ప్రసాదంపై జీఎస్టీ ఉండదు: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 25: దేవాలయాల్లో, ఇతర ప్రార్థన మందిరాల్లో విక్రయించే ప్రసాదాలపై ఎలాంటి జీఎస్టీ ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆమె లోక్‌సభలో 'ఆర్థిక బిల్లు-2025'పై ప్రసంగించారు. ప్రసాదంపై జీఎస్టీ ఉండదని, అదేవిధంగా ఆన్‌లైన్ ప్రకటనలపై డిజిటల్ పన్నును రద్దు చేస్తున్నట్లు తెలిపారు. 2017లో జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాల్లోనూ ప్రసాదాలపై జీఎస్టీ ఉండదని, అయితే.. వాటి తయారీకి వినియోగించే ముడిపదార్థాలు-- పంచదార, నెయ్యి వంటి వాటిపై యథావిధిగా పన్ను ఉంటుందని పేర్కొన్న విషయం తెలిసిందే.! కాగా.. బడ్జెట్(ఆర్థిక బిల్లు-2025)ను లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. రాజ్యసభ కూడా దీన్ని ఆమోదిస్తే.. 2025-26 బడ్జెట్ ప్రక్రియ పూర్తవుతుంది.

'జమిలి' జేపీసీ కాలపరిమితి పొడిగింపు

న్యూఢిల్లీ, మార్చి 25: ఒక దేశ- ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లులపై అధ్యయనానికి ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) కాలపరిమితిని లోక్‌సభ పొడిగించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ఆఖరి వారం మొదటి రోజు వరకు పొడిగించింది. జేపీసీ చైర్‌పర్సన్ పీపీ చౌదరీ.. సోమవారం సభలో ఈ మేరకు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు మూజువాణి ఓటు ద్వారా ఆమోదం తెలిపారు. ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి రాజీనామా చేసిన నేపథ్యంలో రాజ్యసభ నుంచి మరో సభ్యుడిని జేపీసీలో చేర్చినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ వెల్లడించారు.

కేంద్ర మంత్రి రిజుజుపై సభా హక్కుల నోటీసు

న్యూఢిల్లీ, మార్చి 25: సభను తప్పుదోవ పట్టించారన్న ఆరోపణతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజుజుపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశ పెడతామంటూ కాంగ్రెస్ పార్టీ నోటీసు అందజేసింది. కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ మంగళవారం స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు అందజేశారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాజ్యాంగాన్ని మార్చుతామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ వ్యాఖ్యానించారంటూ సోమవారం లోక్‌సభలో అసత్యం చెప్పిన రిజుజు సభ్యులను తప్పుదోవపట్టించారని ఆరోపించారు. ఇది సభా హక్కుల ఉల్లంఘనేనని పేర్కొన్నారు.

బెట్టింగ్ ప్రమోటర్లకు హవాలా ద్వారా డబ్బు

» ఇప్పటికే రంగంలోకి దిగిన ఈడీ, సీఐడీ

» విచారణకు విష్ణుప్రియ, రీతూ గైర్హాజరు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టిస్తున్న బెట్టింగ్ యాప్ కేసులు సీఐడీకి బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. పంజాగుట్ట పోలీసులు బెట్టింగ్ యాప్స్‌పై కేసు నమోదు చేశాక.. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధుల్లోని ఠాణాలకు ఇదే అంశంపై ఫిర్యాదులు హోరెత్తుతున్నాయి. మియాపూర్ పోలీసులు కూడా మరో కేసులో దర్యాప్తు ప్రారంభించడంతో.. ఈ కేసులన్నింటినీ సీఐడీకి బదిలీ చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మియాపూర్ కేసులో పలువురు దిగ్గజ సినీ నటులు ఇబ్బందులను ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. ఏయే యాప్‌లను ఎవరెవరు ప్రమోట్ చేశారు? అందుకోసం వారికి దక్కిన ప్రతిఫలం ఎంత? అగ్రిమెంట్ వివరాలేంటి? అనే కోణంపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఇప్పటి వరకు జంగిల్ రమ్మీ అనే యాప్‌ను రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ ప్రమోట్ చేశారని, ఏ23 యాప్‌నకు విజయ్ దేవరకొండ, యోలో 24/7 యాప్ కోసం మంచు లక్ష్మీ ప్రచారం కల్పించారని నిర్ధారించారు. ఇక, బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌పై మియాపూర్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్లలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలంటూ యాంకర్ బి.విష్ణుప్రియ మంగళవారం హైకోర్టులో రెండు క్వాష్ పిటిషన్లను దాఖలు చేశారు. కాగా.. విష్ణుప్రియ, రీతూ చౌదరి మంగళవారం పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరవ్వాల్సి ఉండగా.. వారిద్దరూ డుమ్మా కొట్టడం గమనార్హం..!

న్యాయ నియామకాలపై ఏం చేద్దాం!



ధన్‌ఖడ్ నిర్వహించిన అఖిలపక్ష భేటీలో వివిధ పార్టీల నేతలు

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్నుంచీ ఆయన పలుమార్లు బాహాటంగానే వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో సూచించాలని అఖిలపక్ష భేటీకి హాజరైన నేతలను కోరినట్లు తెలిసింది. అయితే, న్యాయనియామకాలపై ప్రభుత్వం తన ప్రతిపాదనలను స్పష్టంగా తెలియజేయాలని.. అప్పుడే తమ వైఖరిని తెలియజేస్తామని ప్రతిపక్షాలు తెలిపాయి. న్యాయవ్యవస్థలో నియామకాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న విషయంలో తమకు సందేహం లేదని కాంగ్రెస్‌తో సహా పలు పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. గతంలో మాదిరి జాతీయ న్యాయనియామకాల కమిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేస్తే ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలేమిటో (రోడ్ మ్యాప్) కూడా చెప్పాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతానికైతే న్యాయ నియామకాలు పారదర్శకంగా జరగడం లేదని, ఇందుకు ప్రత్యామ్నాయం అవసరమని కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఉన్నత న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం లభించడం లేదని, రిజర్వేషన్ పద్ధతే లేదని ఆయన అన్నారు. ప్రత్యామ్నాయ వ్యవస్థపై ప్రభుత్వం ప్రతిపాదనలతో ముందుకు వచ్చినప్పుడే తాము తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పగలమని ఆయన అన్నారు. అదే సమయంలో న్యాయవ్యవస్థకు ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాలని ఆయన అభిప్రాయపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్ నేత సుఖేందు శేఖర్ రాయ్ కూడా.. ఎన్‌జేఏసీ వంటి యంత్రాంగంపై ప్రభుత్వ వైఖరి చెప్పినప్పుడే తాము స్పందిస్తామని స్పష్టం చేశారు. ఇక.. న్యాయనియామకాల విషయంపై ఎన్డీఏ సహచరులతో చర్చించి తాము ఒక నిర్ణయానికి వస్తామని సభా పక్ష నేత, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా చెప్పారు. ఈలోపు ఆయా పార్టీలు తమ నాయకత్వంతో చర్చించి స్పష్టతకు రావాలని ఆయన సూచించారు. మరోవైపు.. ఎలాంటి ఏకాభిప్రాయమూ లేకుండానే ఈ భేటీ ముగిసిందని శివసేన (ఉద్ధవ్‌ఠాక్రే వర్గం) ఎంపీ ప్రియాంక చతుర్వేది తెలిపారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. బహుశా వచ్చేవారం సభలో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశం ఉందన్నారు. రాజ్యసభ చైర్మన్ ఈ అంశంపై ఫ్లోర్ లీడర్లతో విడివిడిగా సమావేశమై చర్చిస్తారని తెలిపారు. కాగా.. ఈ అంశంపై సభలో చర్చించాలి తప్ప, చాంబర్‌లో కాదని.. సమస్యలపై చర్చకు ఒక పద్ధతి ఉందని.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అఖిల పక్ష భేటీలో వ్యాఖ్యానించినట్టు సమాచారం. 'ఓటర్ ఐడీ కార్డులపై చర్చకు ఏఐటీసీ ఒక నోటీసు ఇచ్చింది. అది 10 రోజులుగా జాబితాలో చేరలేదు. మేం చాలా ఓపిక పడుతున్నాం. కానీ, ఈ ప్రభుత్వం పార్లమెంటును అవమానిస్తోంది. ఇలాంటి అంశాలన్నింటినీ సభలో చర్చించాలి తప్ప వేరేచోట కాదు" అని ఒక నేత ఘాటుగా వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

సభలో నోటీసు తిరస్కరణ

అఖిల పక్ష భేటీకి ముందు.. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో నోట్ల కట్టల ఉదంతంపై చర్చకు రాజ్యసభ సభ్యుడు, ఐయూఎంఎల్ నేత హరీస్ బీరన్ 267 నిబంధన కింద సభలో ఇచ్చిన నోటీసును జగ్‌దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. జరిగిన ఉదంతం తనకు ఆందోళన కలిగించిందని.. న్యాయవ్యవస్థలో ఉన్న లొసుగులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని ఆయన పేర్కొన్నారు. న్యాయనియమకాల విషయంలో ప్రక్షాళనకు రూపొందించిన ఎన్‌జేఏసీ చట్టాన్ని కోర్టు కొట్టివేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ చరిత్రాత్మక చట్టానికి అసాధారణ రీతిలో ఏకాభిప్రాయం లభించిందని.. అదే అమలులోకి వస్తే పరిస్థితులు వేరేగా ఉండేవని ఆయన వ్యాఖ్యానించారు. అసలు ఒక రాజ్యాంగ సవరణను న్యాయపరంగా సమీక్షించే అధికారం ఎవరికీ లేదని అభిప్రాయపడ్డారు.

విచారణ షురూ..

నోట్లకట్టల వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ మంగళవారం ఉదయం జస్టిస్ వర్మ నివాసానికి వెళ్లి విచారణ ప్రారంభించింది. కమిటీ సభ్యులు జస్టిస్ శీల్‌నాగ్, జస్టిస్ సంధవాలియా, జస్టిస్ అను శివరామన్.. అక్కడ 30-35 నిమిషాలపాటు ఉండి జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణాన్ని, అక్కడ అగ్నిప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌ను నిశితంగా పరిశీలించారు. మధ్యాహ్నం సమయానికి అక్కణ్నుంచీ వెళ్లిపోయారు. ఆ సమయంలో జస్టిస్ వర్మ ఇంట్లో ఉన్నారా లేరా అనే విషయం తెలియరాలేదు. మరోవైపు.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న సుప్రీం సిఫారసును వ్యతిరేకిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయవాదులు మంగళవారం నిరవధిక సమ్మెకు దిగారు. తమ నిరసన ఏ న్యాయస్థానానికీ, న్యాయమూర్తికీ వ్యతిరేకం కాదని.. న్యాయ వ్యవస్థను వంచించినవారికి వ్యతిరేకంగానే తాము సమ్మె చేస్తున్నామని అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ తెలిపారు. అవినీతికి పాల్పడ్డవారిపై, పారదర్శకత లేని వ్యవస్థపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "(జస్టిస్ వర్మ) బదిలీ ఉత్తర్వును పునఃపరిశీలించి, ఉపసంహరించుకోవాలన్నదే మా ప్రధాన డిమాండ్" అని ఆయన పేర్కొన్నారు.



జస్టిస్ వర్మ నివాసంలో హిమాచల్ హైకోర్టు సీజే జస్టిస్ జీఎస్ సంధవాలియా

మరోసారి ఎన్‌జేఏసీపై కేంద్రం దృష్టి?

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు లభించడం, దీనిపై దేశవ్యాప్తంగా సామాన్యుల్లో సైతం ఆగ్రహం వ్యక్తం కావడం వంటి పరిణామాలను అవకాశంగా తీసుకుని.. మోదీ ప్రభుత్వం జాతీయ న్యాయనియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)పై మరోసారి చట్టం చేసే అవకాశాలున్నాయా? జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఈ ప్రశ్నకు రాజకీయ నిపుణులు ఔననే సమాధానమే ఇస్తున్నారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మంగళవారం నిర్వహించిన అఖిలపక్ష భేటీ అందులో భాగమేనని వారు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఎన్‌జేఏసీని తిరస్కరించిన సుప్రీంకోర్టు ప్రస్తుత పరిస్థితుల్లో అలా వ్యతిరేకించే అవకాశాలు లేవని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ తాము అలాంటి బిల్లును ప్రవేశపెడితే.. గతంలో లభించిన విధంగానే ఈసారి కూడా దానికి కాంగ్రెస్‌తో సహా అన్ని పక్షాలు ఏకగ్రీవ ఆమోదం లభిస్తుందని మోదీ ప్రభుత్వం విశ్వాసంతో ఉన్నది. ఈ విషయంలో ప్రభుత్వం తన ప్రతిపాదన ఏమిటో స్పష్టంగా చెబితే.. తామూ తమ వైఖరి చెప్తామని ప్రతిపక్షాలు అఖిలపక్ష భేటీలో పేర్కొనడమే ఇందుకు నిదర్శనమని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

లోకం తీరు



అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ

» బాలిక పైజామా తాడు లాగడం, ఛాతీపై చేయివేయడం రేప్ కాదన్న నిర్ణయంపై అభ్యంతరాలు

న్యూఢిల్లీ, మార్చి 25: బాలిక ఛాతీపై చేయి వేసి వక్షోజాలను లాగడం, ఆమె ధరించిన పైజామా తాడును లాగి తెంపివేయడం రేప్ కిందికి రాదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్పందించింది. దీనిపై సుమోటోగా విచారణ జరపనున్నట్టు మంగళవారం ప్రకటించింది. ఇలాంటి చర్యలు అత్యాచారం కిందికి రావని, కానీ అత్యాచారయత్నంగా పరిగణించవచ్చని పేర్కొంటూ హైకోర్టు ఈ నెల 17న తీర్పు ఇచ్చింది. బలప్రయోగం చేసి వస్త్రాలను లాగడం, నగ్నంగా ఉండాలంటూ బెదిరించడం అన్న నేరాల కిందకు వస్తుందని తెలిపింది. అందువల్ల ఐపీసీలోని సెక్షన్ 354(బీ) కింద కేసు నమోదు చేస్తే సరిపోతుందని, రేప్‌కు వర్తించే సెక్షన్లు అవసరం లేదని తెలిపింది. ఈ తీర్పుపై విమర్శలు రావడంతో సుమోటోగా విచారణ జరపాలని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టైన్ జార్జి మాసిహ్ ధర్మాసనం నిర్ణయించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు కాగా దాన్ని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ ప్రసన్న బి వరాలే ధర్మాసనం తిరస్కరించడం గమనార్హం. 2021 జనవరి పదో తేదీన పవన్, ఆకాశ్ 14ఏళ్ల బాలికను ఓ కల్వర్టు కిందకు లాకెళ్లారు. పవన్ ఆమె ఛాతీభాగంపై చేయివేయగా, ఆకాశ్ ఆమె పైజామా తాడును లాగాడు. అప్పుడే ఎవరో రావడం చూసి వారు పారిపోయారు. ఈ కేసులో పోలీసులు నిందితులపై సెక్షన్ 376 (రేప్), పోక్సో చట్టంలోని సెక్షన్ 18 కింద కేసు పెట్టారు. అయితే, తాము చేసిన నేరాన్ని బట్టి చూస్తే ఇవి కఠిన శిక్షలు పడే సెక్షన్లు కావడంతో వాటిని తగ్గించాలని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన జస్టిస్ రామ్ వాని వాదనతో ఏకీభవించారు.

తమిళనాట 'ఈడీ' రగడ!

టాస్మాక్ కేసు విచారణ నుంచి తప్పుకొన్న జడ్జిలు

చెన్నై, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తమిళనాట మద్యం విక్రయాల కోసం ఏర్పాటైన 'తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్'(టాస్మాక్)కు సంబంధించిన కేసు విచారణ నుంచి ఇద్దరు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు వైదొలిగారు. చెన్నై 'టాస్మాక్' ప్రధాన కార్యాలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఈడీ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. తనిఖీలు పూర్తయ్యాక మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో సుమారు రూ.వెయ్యి కోట్ల మేర అవినీతి జరిగినట్లు గుర్తించామని ఈడీ పేర్కొంది. అయితే, ఈడీ చర్యల్ని సవాల్ చేస్తూ టాస్మాక్ ఎండీ సహా ప్రభుత్వం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 20న న్యాయమూర్తులు జస్టిస్ రమేశ్, జస్టిస్ సెంథిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈడీ వ్యవహారాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఎలాంటి ఆధారాలు లేకుండానే టాస్మాక్ ఉద్యోగులను గంటల తరబడి కార్యాలయంలో నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలను ఈడీ అధికారులు తోసిపుచ్చారు. తాము ఉద్యోగులను నిర్బంధించలేదన్నారు. మద్యం అమ్మకాల లైసెన్సు మంజూరులోనే భారీ ఎత్తున అవినీతి, కుట్ర ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మరోసారి ఈ పిటిషన్ ధర్మాసనం ముందు విచారణకు రాగా.. తాము ఈ కేసు విచారణ నుంచి వైదొలగుతున్నట్లు జస్టిస్ రమేశ్, జస్టిస్‌సెంథిల్‌కుమార్ తెలిపారు. "టాస్మాక్ విషయంపై మేం విచారించదలుచుకోలేదు. మా అంతట మేమే తప్పుకొంటున్నాం. దీనిపై మా కారణాలు మాకున్నాయి. వేరే ధర్మాసనానికి ఈ పిటిషన్‌ను బదిలీ చేసేందుకు అనువుగా పిటిషన్‌ను సీజే ముందుంచాలి" అని రిజిస్ట్రీని ఆదేశించారు.

మోదీ రంజాన్ తోఫా

పండగ రోజుల్లో దుస్తులు, ఆహార పదార్థాల కిట్ల అందజేత

» బిహార్ ఎన్నికల కోసమేనని విమర్శలు



న్యూఢిల్లీ, మార్చి 25: మైనార్టీలకు చేరువ కావడం కోసం బీజేపీ ఓ ప్రత్యేక మెగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'సౌగాత్ ఎ మోదీ' పేరుతో పండగ రోజుల్లో మైనార్టీలకు వివిధ వస్తువులను కానుకగా ఇవ్వాలని నిర్ణయించింది. తొలుత రంజాన్ సందర్భంగా ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో మంగళవారం వీటిని ముస్లిం మైనార్టీలకు అందజేసింది. సౌగాత్ కిట్‌లో ఆహార పదార్థాలు, సేమియా, ఖర్జూరం, డ్రైఫ్రూట్స్, పంచదార; పురుషులు, స్త్రీల కోసం అవసరమయ్యే రూ.500-600 విలువ చేసే కుర్తా-పైజామా/ సల్వార్-కమీజ్ వంటి దుస్తులు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్దికీ వివరించారు. రంజాన్ సందర్భంగా దేశం మొత్తం మీద 32 లక్షల మంది పేద ముస్లింలకు ఈ కిట్‌లను అందజేస్తామని తెలిపారు. దేశంలోని 32వేల మసీదుల సహకారంతో మైనార్టీ మోర్చాకు చెందిన 32 వేల మంది కార్యకర్తలు వీటిని పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రతి మసీదు పరిధిలో 100 మంది నిరుపేద ముస్లింలను గుర్తించి ఈ గిఫ్ట్ ప్యాకెట్లను అందజేయనున్నారు. మసీదు కమిటీ సహాయంతోనే లబ్ధిదారులను గుర్తించనున్నారు. మొట్టమొదటగా ముంబయిలోని పార్టీ మైనార్టీ మోర్చా చొరవ తీసుకొని నవీ ముంబయిలో 200 మంది పేదలను గుర్తించి ఈ సౌగత్ కిట్లను అందజేసింది. అది జాతీయ కార్యక్రమంగా రూపుదిద్దుకొంది. రంజాన్‌తో పాటు గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, నౌరోజ్, నూతన సంవత్సర దినోత్సవాలు, ఇతర పర్వదినాల్లో అందజేస్తామని సిద్దికీ తెలిపారు.

ఓట్ల కోసమే సౌగత్ కిట్లు

బిహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే బీజేపీ ఈ పథకానికి రూపకల్పన చేసిందని విపక్షాలు ఆరోపించాయి. కాంగ్రెస్ ఎంపీ రాజీవ్ రంజన్ తన అభిప్రాయాన్ని చెబుతూ బిహార్‌లో 16-17 శాతం ముస్లింలు ఉన్నారని, కొన్ని జిల్లాలో చాలా ప్రభావం చూపుతారని అన్నారు. వారి ఓట్ల కోసమే బీజేపీ సౌగత్ కిట్లను తీసుకొచ్చిందని విమర్శించారు. బిహార్‌కు నిజంగా సౌగాత్ (బహుమతి) ఇవ్వాలనుకుంటే తొలుత వలసలు నివారించడం కోసం ఉద్యోగాలను కల్పించాల్సి ఉందని అన్నారు. శివసేన (ఠాక్రే) యువనేత ఆదిత్య ఠాక్రే సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెడుతూ బీజేపీ కపటబుద్ధికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. వారు చేసేదంతా మంచి, ఇతరులు చేసేదంతా చెడ్డ అన్న రీతిలో వ్యవహరిస్తుందని విమర్శించారు.

జూన్ నుంచి ఏటీఎం ద్వారా పీఎఫ్ తీసుకునే వెసులుబాటు

» యూపీఐ ద్వారా ఖాతాలోని నిల్వ చూసుకునే అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 25: ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాల్లోని సొమ్ము తీసుకునే ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ కేంద్ర కార్మిక శాఖ నిర్ణయం తీసుకొంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) చేసిన సిఫార్సుల మేరకు ఇకపై ఏటీఎంతోపాటు, ఫోన్ పే వంటి యూపీఐల ద్వారా కూడా విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కలిగించింది. మే చివరి వారం నుంచి గానీ, జూన్ మొదటి వారం నుంచిగానీ ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల కార్యదర్శి సుమితా దావ్రా వెల్లడించారు. తొలుత రూ.లక్ష వరకు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఉందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకోవచ్చని చెప్పారు. పీఎఫ్ ఖాతాలోని నిల్వను యూపీఐ ద్వారా చూసుకునే సౌకర్యం కూడా కల్పించినట్టు తెలిపారు. ఇళ్ల నిర్మాణం, విద్య, ఆరోగ్యం, వివాహం వంటి అవసరాల నిమిత్తం చాలా సులువుగా సొమ్మును విత్ డ్రా చేసుకునే సౌకర్యాన్ని కలిగించినట్టు వివరించారు. దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే పీఎఫ్ ఖాతా నుంచి సొమ్ము విత్‌డ్రా చేసుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ ప్రక్రియను మరింత సరళతరం చేయనున్నట్టు వివరించారు. 95శాతం క్లెయిమ్‌లు ఆటోమేటెడ్ విధానంలో జరుగుతున్నాయని చెప్పారు. పెన్షనర్లు కూడా ఏ బ్యాంకు నుంచయినా సొమ్ము తీసుకునే సౌకర్యాన్ని కలిగించినట్టు తెలిపారు.

'సోషల్' ఖాతాల వివరాలివ్వండి

» గ్రీన్‌కార్డు, హెచ్-1బీ, ఎఫ్-1 వీసాదారులపై ట్రంప్ సర్కారు నిఘా



న్యూఢిల్లీ, మార్చి 25: అమెరికాలో భారతీయ వలసదారులపై ఉక్కుపాదం మోపడానికి ట్రంప్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగా గ్రీన్‌కార్డుదారుల ప్రతి కదలికను నిశితంగా పరిశీలించాలని నిర్ణయించింది. ట్రంప్ సన్నిహితుడు, 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ సహకారంతో వారి సామాజిక మాధ్యమ ఖాతాలను వడపోయడం ద్వారా ప్రభుత్వాన్ని విమర్శించేవారిపై నిఘా పెట్టనుంది. మరోవైపు వలస చట్టాలకు పదును పెడుతూ ఇతర దేశాలకు వెళ్లి అమెరికాకు తిరిగొచ్చే హెచ్-1బీ వీసాదారులను విమానాశ్రయాల్లోనే అడ్డుకొని, కఠినమైన తనిఖీలతో పాటు వారిపై ప్రశ్నల వర్షం కురిపించనుంది. గ్రీన్‌కార్డు ఉన్నంత మాత్రాన అమెరికాలో శాశ్వతంగా నివసించడానికి హక్కు ఉండదని దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో ఇప్పటికే తీవ్ర ఆందోళన చెందుతున్న వలసదారులు... తాజాగా ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో బెంబేలెత్తుతున్నారు. అమెరికాలో నివసించే గ్రీన్‌కార్డుదారులు తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను సమర్పించాలని ట్రంప్ యంత్రాంగం త్వరలోనే ఆదేశించే అవకాశం ఉంది. ఈ మేరకు సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఇతర దేశాలకు చెందిన పౌరులు అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసేటప్పుడే తమ సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలు వెల్లడించడం తప్పనిసరి. ఇప్పుడు అమెరికాలో నివసిస్తున్న వలసదారులకూ ఈ నిబంధనను వర్తింపజేయాలని భావిస్తున్నారు. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ... భారత్, అమెరికా రాజకీయ చర్చల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న పలువురు భారతీయులపై ఈ ప్రతిపాదనలు ప్రభావం చూపుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పర్యవసానాలపై ఆందోళనతో రాజకీయ అంశాలపై తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో స్వేచ్ఛగా వ్యక్తం చేసే పరిస్థితి లేకుండా పోతుందని, ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై మే 5వ తేదీ వరకూ యూఎస్‌సీఐఎస్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది.

విదేశాలకు వెళ్తొస్తే... సమాధానం చెప్పాల్సిందే

గ్రీన్‌కార్డు, హెచ్-1బీ, ఎఫ్-1 వీసాలు కలిగిన భారతీయ వలసదారులు విదేశాలకు వెళ్లి, వచ్చే సమయంలో భద్రతాపరమైన తనిఖీలతో అప్రమత్తంగా ఉండాలని యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు సూచించారు. ఈ మేరకు ట్రావెల్ రిస్క్ అడ్వైజరీ జారీ చేశారు. పాకిస్థాన్, భూటాన్, అఫ్ఘానిస్థాన్ సహా 43 దేశాల పౌరుల ప్రయాణాలను పరిమితం చేయాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ జాబితాలో భారత్ లేకపోయినా కూడా అమెరికా వెలుపల ప్రయాణాలు చేసే భారతీయులు కఠినమైన తనిఖీలతో వీసా స్టాంపింగ్‌లో జాప్యంతో పాటు విమానాశ్రయాల్లో అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఉద్యోగం, వీసా పునరుద్ధరణ కోసం బయటి దేశాలకు వెళ్లేవారు ఊహించని అడ్డంకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

'నవోదయ' ఎంట్రెన్స్ ఫలితాలు వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 25: నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. పర్వత ప్రాంతాలు మినహా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈ పరీక్షలను 'నవోదయ విద్యాలయ సమితి' 2025 జనవరి 18న నిర్వహించింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఇచ్చిన తమ రోల్‌నెంబర్, పుట్టిన తేదీ తదితర వివరాలను ఎంటర్ చేసి ఫలితాలను తెలుసుకోవచ్చు. ఖాళీలను బట్టి అడ్మిషన్ల కోసం నవోదయ విద్యాలయాల్లో రెండు వెయిటింగ్ లిస్ట్‌లను రూపొందిస్తారు. ఎంపికైనా చేరనివారు, సరైన తేదీలోగా సర్టిఫికెట్లను సమర్పించలేని వారి స్థానంలో వెయిటింగ్ లిస్టులోని వారికి అవకాశం ఇస్తారు.

కేవీ లాటరీ ఫలితాలు వచ్చాయి

కేంద్రీయవిద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల లాటరీ ఫలితాలు వెల్లడయ్యాయి. వీటికి సంబంధించి మార్చి 7నుంచి 21వరకు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుదారులు తమ పిల్లలు ఎంపికయ్యారో లేదో తెలుసుకునేందుకు కేంద్రీయ విద్యాలయ అధికారిక వెబ్‌సైట్ చూడవచ్చు. విద్యార్థుల ధ్రువపత్రాలను వెరిఫై చేశాక అడ్మిషన్ ఫైనల్ అవుతుంది.

బంగ్లాదేశ్‌లో ఆర్మీ తిరుగుబాటు?

ఢాకా, మార్చి 25: బంగ్లాదేశ్‌లో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్ర ఇబ్బందుల్లో పడినట్టు ప్రచారం జరుగుతోంది. దేశంలో తిరుగుబాటు వాతావరణం నెలకొందని పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. రాజధాని ఢాకాలోకి సైన్యం ప్రవేశించినట్టు సమాచారం. అంతేకాదు, ఆర్మీ వర్గాలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రధాని యూనస్ సర్కారుపై తిరుగుబాటుకు సిద్ధమైనట్టు సమాచారం. దేశంలో ఎమర్జెన్సీ లేదా మార్షల్ లా విధించే అవకాశం ఉందని మీడియా పేర్కొనడం గమనార్హం. 'ఇండియా టుడే' కథనం మేరకు.. ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ యూ జమాన్ నేతృత్వంలో సోమవారం ఉన్నతస్థాయి సైనికాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్మీ చీఫ్ స్పందిస్తూ.. ప్రజల్లో అశాంతి, అపనమ్మకం పెరిగిపోయిందని ఇలాంటి సమయంలో ఆర్మీ పాత్ర కీలకం కానుందని వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం.148 టు 175/AE/e-Procurement/2024-25, తేది:22.03.2025 – గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య విభాగము, ఏలూరు పరిధిలో JJM నిధుల నుండి మంజూరు కాబడిన 28 పనులకు అంచనావిలువ: రూ.715.80లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-మార్కెట్ ప్లేస్‌లో టెండర్లు స్వీకరణ తేది: 28.03.2025 నుండి 04.04.2025, మ.03.00 గం.వరకు. తదుపరి వివరాలు: www.tender.apeprocurement.gov.in ఫోన్: 9100121214

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, రూరల్ వాటర్ సప్లై & సానిటేషన్ డివిజన్, ఏలూరు
DIPR RO.No.15657/CL/ADVT/1/1/2021-22, Dt: 25.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం.18/2024-25, తేది:21.03.2025
పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు వారి పరిధిలోని బాపట్ల మరియు నరసరావుపేట నియోజకవర్గంలలోని మంజూరు కాబడిన రూ.573.00లక్షల విలువ గల 2 పనులకు టెండర్లు ది.28.03.2025 నుండి ఇ-ప్లాట్‌ఫారం ద్వారా కోరబడుచున్నవి. ఇతర వివరాలను పి.యం.జి.ఎస్.వై. ఇ-మార్కెట్ ప్లేస్ www.pmgsytendersap.gov.in నందు చూడగలరు.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు
DIPR RO.No.15667/CL/ADVT/1/1/2021-22, Dt: 25.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం.12/ఎ.టి.ఓ./ఇ-ప్రొక్యూర్‌మెంట్/2024-25, తేది: 19.03.2025 – కార్యాపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పా.డివిజన్, బాపట్ల వారి కార్యాలయ పరిధిలోని గ్రామములో 15 ఫైనాన్స్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయిలకి సంబంధించి 7 పనులకు అంచనావిలువ: రూ.122.60 లక్షలకు టెండర్లు కోరడమైనది. టెండరు డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ సైటు నందు ది.26.03.2025 నుండి www.apeprocurement.gov.inలో చూడగలరు.

సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల
DIPR RO.No.15666/CL/ADVT/1/1/2021-22, Dt: 25.03.2025

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED

e-Procurement Tender Notice

APTRANSCO invites bids online for the Work-1: Spec. No. APT-VJA-e-71/2024-25-Modification of existing 132KV Atmakuru (from 220KV SS Atmakuru) - Atmakuru-I SC line between Loc Nos. 257 and 262. Work-2: Spec. No. APT-VJA-e-72/2024-25- Modification of existing 132 KV Adurupalli Railway DC/SC line between Loc. Nos 56 and 59 for providing required vertical clearance to the proposed Nadikudi-Kalahasthi Railway BG line Nellore District in Vijayawada Zone. Date & availability of Tender in http://www.apeprocurement.gov.in on 26.03.2025 at 05.00 PM. Phone No. 8332864005 - 9494096752

Sd/- Chief Engineer, A.P.TRANSCO, Vijayawada Zone
DIPR R.O. No.3635PP/CL/ADVT/1/1/2021-22, Dt:25.03.2025

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి

ఈ సంస్థచే అభివృద్ధి పరచబడిన "తుడ టవర్స్" యందు ఖాళీగా వున్న *Residential Flats*ను మొదట వచ్చిన దరఖాస్తుకు మొదట కేటాయింపు ప్రాతిపదికన తేది:30.04.2025 వరకు కేటాయింపు చేయబడును. వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.70955 77477/ 70939 43045. వెబ్‌సైట్ : www.tudatowers.in

సం/- శ్రీమతి ఎన్.మౌర్య, IAS, ఉపాధ్యక్షులు, తుడ, తిరుపతి

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY(APCRDA)
Lenin Center, Governerpet, Vijayawada – 520002 (A.P.)

E Procurement Short Tender Notice

NIT No. Lr. No: 115/MAU61-EE0LS(OTH)/4/2025-RZLE, Dt.25.03.2025
Name of Work :APCRDA-" Repair and Restoration of Dandelion Fountains Complete on Wide Median at Tadepalli Sub Control Police Station near Varadhi on NH -16"- ECV:12,53,530/-.
The bid can be downloaded on AP e-procurement portal from **26.03.2025** to **02.04.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **02.04.2025 up to 15.00 Hrs**, Technical bid opening **02.04.2025 @16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

E Procurement Short Tender Notice

NIT No. 116/MAU61-ADMN0IS(INVC)/7/2025-IS, Dt:24/03/2025
Name of Work :APCRDA-" Supply, Installation, testing and commissioning of Audio-Video Conferencing system @ O/o Hon'ble MA&UD Minister's Conference Hall, Block-2, AP Secretariat, Amaravati"ECV: 53,90,946/-.
The bid can be downloaded on AP e-procurement portal from **26.03.2025** to **29.03.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **29.03.2025 up to 15.00 Hrs**, Technical bid opening **29.03.2025 @16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

E Procurement Short Tender Notice

NIT No. 117/MAU61-ADMN0IS(GIS)/1/2024-GIS, Dt:24/03/2025
Name of Work :APCRDA-" Upgradation of existing ArcGIS Licenses and Purchase of New ArcGIS Licenses with 3 Years of AMC/Support for O/o APCRDA, Vijayawada"ECV: 4,57,00,000/-(Excl. of all taxes).
The bid can be downloaded on AP e-procurement portal from **26.03.2025** to **29.03.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **29.03.2025 up to 15.00 Hrs**, Technical bid opening **29.03.2025 @16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.** Sd/- Commissioner, APCRDA, Vijayawada

भारतीय विज्ञान शिक्षा एवं अनुसंधान संस्थान तिरुपति
INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(शिक्षा मंत्रालय का एक स्वायत्त संस्थान, भारत सरकार / An Autonomous Institute of Ministry of Education, Govt. of India)
येरपेडु मंडल–517619, तिरुपति / Yerpedu Mandal & 517619, Tirupati.

पीएचडी कार्यक्रम में प्रवेश, अगस्त- 2025
Admission to Ph.D. Program, AUGUST- 2025

आईआईएसईआर तिरुपति (www.iisertirupati.ac.in) अगस्त– 2025 सत्र के लिए जीव विज्ञान, रसायन विज्ञान, गणित, भौतिकी, पृथ्वी और जलवायु विज्ञान, और मानविकी और सामाजिक विज्ञान में पीएचडी कार्यक्रमों में प्रवेश के लिए ऑनलाइन आवेदन आमंत्रित करता है। शैक्षिक योग्यता, पात्रता मानदंड, चयन प्रक्रिया, ऑनलाइन आवेदन और जमा करने की अंतिम तिथि के विवरण के लिए, कृपया देखें: **https://www.iisertirupati.ac.in/admission-phd/**

IISER Tirupati (**www.iisertirupati.ac.in**) invites online applications for admission to the Ph.D. programs in Biology, Chemistry, Mathematics, Physics, Earth & Climate Sciences, and Humanities and Social Sciences for the August- 2025 session. For details of educational qualifications, eligibility criteria, selection procedure, online application, and last date of submission, please visit: **https://www.iisertirupati.ac.in/admission-phd/**

Advt. No. 11/2025/IISER-T/Admissions/11-03-2025
Sd/-
निदेशक / **Director**

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

NOTICE

Roc. TCP. No. 103242/2025/G5/Circle-1 Date.25.03.2025.

The following individual sites are submitted for the forth coming TDR Scrutiny Committee meeting, which will be headed by the Commissioner of Vijayawada Municipal Corporation. The meeting will cover the areas mentioned below. As per Govt.Memo.2635884/M2/2020 Dated.19.12.2024 any suggestions or objections regarding the issuance of the TDR bonds for the applications listed below should be submitted to this office Circle-I (VMC Main office) within 7 days form the date of receipt of this notification. If no objections are received within this period, further action will be taken for the issuance of TDR bonds.

Details of TDR Sites.

Sl. No.	Name of the Site Owner	Location R.S. No (Address)	Extent in Sqy	Name of the Road / Area	RDP Number / Purpose
1	Smt. Pappu Venkaiahamma W/o Late Ayyanna	RS.NO.106/1C Bhavanipuram (v)	3678.06	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
2	Smt. Pappu Venkaiahamma W/o Ayyanna	RS.NO.106/2B Bhavanipuram (v)	1258.28	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
3	Sri. Bommadevara Venkata Subbarao S/o. Venugopala Rao	RS.NO.105/1A Bhavanipuram (v)	333.33	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
4	Sri Nutakki Ganga dhara Bose S/o. Madhusudhan Rao	RS.NO.105/1A Bhavanipuram (v)	333.33	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
5	Smt. Patibanda Yasoda W/o. Sundar Rao	RS.NO.105/1A Bhavanipuram (v)	333.33	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
6	Smt. Heena Moosavi D/o. S.M. Sultan Moosavi	RS.NO.105/1A Bhavanipuram (v)	222.22	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
7	Sri. Pokuru Narendra Kumar, S/o. Venkata Subbarao	RS.NO.105/1A Bhavanipuram (v)	222.22	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
8	Smt. Velagapudi Vimala Devi, W/o. Veera Raghava Chowdary	RS.NO.105/1A Bhavanipuram (v)	222.22	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
9	Sri. Sk. Meeravali, S/o. Hussain sahib & Smt. Sk. Guljar Begum, W/o. Sk. Meeravali	RS.NO.105/1B, 106(P) Bhavanipuram (v)	151.66	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
10	Smt. Patan Arifa, C/o. Patan Ajim Khan	RS.NO.105/1B, 106(P) Bhavanipuram (v)	77.00	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.
11	Smt. Patan Gowsiya W/o. Yosub Khan	RS.NO.105/1B, 106(P) Bhavanipuram (v)	77.00	Punnami Ghat	Krishna River Front Develop--ment Project.

Sd/- For Commissioner



వినుకొండ గాయత్రినగర్‌లో సీసీ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి

వినుకొండ కాలనీలకు మహర్దశ

- 'ఆంధ్రజ్యోతి' అక్షరం అండగా.. పరిష్కారం దిశగా
- రూ.62.60 లక్షల పనులకు చీఫ్ విప్ జీవీ శంకుస్థాపనలు



వినుకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారం దిశగా 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ఫలితంగా పలు కాలనీలకు మహర్దశ పట్టనుంది. ఆయా కాలనీల్లో ప్రగతి పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. రూ.62.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. జనవరి 28న గాయత్రినగర్.. కొట్నాల్చి వీధిలో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న జీవీ ఆంజనేయులుకు ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. స్పందించిన జీవీ వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కొట్నాల్చి వీధిలో రూ.17.60 లక్షలతో సీసీ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో ప్రజలు కోరిన విధంగా సిమెంట్ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణానికి మంగళవారం జీవీ శంకుస్థాపన చేశారు. 'ఆంధ్రజ్యోతి' వేదికగా ప్రజలు కోరిన అభివృద్ధి పనులకు ఇచ్చిన హామీల మేరకు పనులు చేపట్టడంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అధికారులు, పాలకులకు మధ్య వారధిగా కాలనీల్లో అభివృద్ధి పనులకు 'ఆంధ్రజ్యోతి' కృషి చేసిందని వారు కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండలో 'ఆంధ్రజ్యోతి' అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని జీవీ ఆంజనేయులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు చేపట్టేందుకు కోడ్ పూర్తయ్యే వరకు ఆగాల్సి వచ్చిందన్నారు. వినుకొండ మున్సిపాలిటీలో రూ.161 కోట్లతో రక్షిత నీటి పథకం విస్తరణ చేపట్టి తాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు.

Sri Kadiri Lakshmi Narasimha Swamy Temple
Nulukunta (V), Kuppam(M), Chittoor District

e-Procurement Tender

NIT No.P/COE/1363/2024-41, Dt: 28/01/2025

E-Tenders are invited through the e-Procurement portal for the **Re Construction of Temple and other Development works.** Interested bidders may visit the official website **www.apeprocurement.gov.in** for detailed information, eligibility criteria, and submission guidelines.

Trustee

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.13/ఎ.టి.ఓ./ఇ-ప్రొక్యూర్‌మెంట్/2024-25, తేది: 21.03.2025
కార్యపాలక ఇంజనీర్, గ్రా.నీ.స & పా.డివిజన్, బాపట్ల వారి కార్యాలయ పరిధిలోని సముద్ర తీరాలలో & కలెక్టర్ ఆఫీస్ ప్రాంగణంలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి 6 పనులకు అంచనా విలువ: రూ.156.00 లక్షలకు టెండర్లు కోరడమైనది. టెండరు డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ సైట్ నందు ది.28.03.2025 నుండి www.apeprocurement.gov.in లో చూడగలరు.

సం/- కార్యపాలక ఇంజనీర్, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల
DIPR Ro No. 15659/CL/ADVT/1/1/2021-22, తేది: 25.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం.04SE/2024-25, తేది:22.03.2025
ఎన్.టి.ఆర్ జిల్లాలో గల బుడమేరు డైవర్షన్ చానల్ యొక్క శాశ్వత పునరుద్ధరణ పనుల నిమిత్తం కి.మీ.3.840 నుండి కి.మీ 4.340 వరకు ఎడమ ప్రక్కన & కుడి ప్రక్కన గల భారీ గండ్ల ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మించడానికి ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. కాంట్రాక్టు విలువ: రూ.21,94,88,952/-, డాక్యుమెంట్లు లభ్యమగు తేది: 24.03.2025, సా.5.00 గం.నుండి 08.04.2025, మ.1.00 గం.వరకు. వివరాలు: https://tender.apeprocurement.gov.in ఫోన్: 08812 248001

సం/- పర్యవేక్షక ఇంజనీరు, పి.బి.పి.ఆర్.యం.సి సర్కిల్, ఏలూరు
DIPR RO No.15669/CL/ADVT/1/1/2021-22, Dt: 25.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

షార్ట్ నిట్ నెం.17/టి.ఓ./2024-25, తేది:24.03.2025 – ఏలూరు జిల్లాలో 3 పనుల కొరకు ఇ-ప్లాట్‌ఫారం పై ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. అంచనావిలువ: రూ.466.00లక్షలు. టెండరు షెడ్యూళ్ళను ది.01.04.2025, సా.03.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ http://tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, (ర.భ) ఏలూరు సర్కిల్, ఏలూరు
DIPR RO No.15671/CL/ADVT/1/1/2021-22, Dt: 25.03.2025



చిన్నారిని నాయనమ్మకు అప్పగిస్తున్న పోలీసులు

పాప తప్పిపోయింది... డ్రోన్ కనిపెట్టింది!

- సాంకేతిక పరిజ్ఞానంతో అరగంటలోపే నాయనమ్మ ఒడికి చేర్చిన పోలీసులు

భీమవరం క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాయనమ్మతో వచ్చి తప్పిపోయిన చిన్నారి ఆచూకీ డ్రోన్ సాయంతో పోలీసులు గుర్తించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం చిన్నగొల్లపాలెంకు చెందిన బొర్రా వెంకట నారాయణమ్మ తన మనుమడు, మనుమరాలితో ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం భీమవరం హెడ్ పోస్టాఫీస్‌కు వెళ్లారు. మంచినీళ్ల కోసం బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఏడేళ్ల మనుమరాలు దివ్య కనిపించక పోవడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. టౌన్ సీఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్ కుమార్ తక్షణమే స్పందించి తమ సిబ్బందితో కలసి గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో డ్రోన్ ద్వారా సమీపంలోనే చిన్నారి ఉన్నట్టు గుర్తించి ఆమెను సురక్షితంగా నారాయణమ్మకు అప్పగించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'మహా' బుల్డోజర్

ఏదో ఒక నేరంలో నిందితుడో, దోషో అయినంతమాత్రాన నోటీసులు ఇవ్వకుండా, స్పందించడానికి తగినంత సమయం ఇవ్వకుండా, చట్టాలూ నిబంధనలూ పాటించకుండా నేరుగా బుల్డోజర్లతో పోయి వారి నివాసాలను నేలమట్టం చేయడం అన్యాయం, అంతకుమించి రాజ్యాంగ విరుద్ధం అని నాలుగు నెలలక్రితమే సుప్రీంకోర్టు గట్టిగా చెప్పినా, ఈ ఆదేశాలను బేఖాతరుచేసి, మళ్ళీ అదే దుర్నీతితో వ్యవహరిస్తున్న సదరు రాష్ట్రాలను, అధికారులను ఏం చేయాలి? కూల్చివేతల విషయంలో కాస్తంత మానవీయంగా ఉండండి అని సుప్రీంకోర్టు సోమవారం మళ్ళీ చెప్పింది. ఇలా పలుమార్లు చెప్పాల్సివస్తుండటం న్యాయస్థానానికి ఆగ్రహమో, అసహనమో కలిగించవచ్చును కానీ, ఒకవర్గం మీద ప్రత్యేకంగా కక్షతీర్చుకోవడానికీ, మరోవర్గం ఓట్లుపెంచుకోవడానికీ కూల్చివేతలను ఒక విధానంగా అమలుచేస్తున్న పాలకులకు సుప్రీం చీవాట్లు అవమానం కలిగించవు.

నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టిన నిర్మాణాలను నాశనం చేయాల్సిన సందర్భంలోనూ పద్ధతులు పాటించాల్సిందేనని న్యాయస్థానం అంటోంది. కానీ, ఈ బుల్‌డోజర్ న్యాయంలో జరుగుతున్నదల్లా ముందుగా ఇళ్లను కూల్చివేయడం, ఆ తరువాత వాటిని అక్రమకట్టడాలనీ, దురాక్రమణలనీ ముద్రవేయడం. బుల్‌డోజర్ బాబాగా ప్రసిద్ధిచెందిన యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలోని ఉత్తర్ ప్రదేశ్ ఈ విషయంలో, ఆయన పార్టీకి చెందిన మిగతా పాలకులకు మార్గదర్శి కూడా. మిగతా ఘనకార్యాలను పక్కనబెడితే, 2021లో ప్రయాగ్‌రాజ్‌లో యూపీ పోలీసులు అతీఖ్ అహ్మద్ అనే గ్యాంగ్‌స్టర్ పొలిటీషియన్‌ను ఎన్‌కౌంటర్ చేశారు, అతడికే చెందినవేనంటూ కొన్ని ఇళ్ళూవాకిళ్ళను కూడా అధికారులు కూల్చివేశారు. అలా కూల్చివేసినవి గ్యాంగ్‌స్టర్‌వి కావు, మావి అని ఇద్దరు వితంతువులతో సహా కొందరు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కేసుపోవడంతో, వారంతా సుప్రీంకోర్టుకు వచ్చారు. ముందురోజు రాత్రి నోటీసులు ఇచ్చి మర్నాడు ఉదయాన్నే కూల్చివేయడంలో వీసమెత్తు న్యాయమైనా ఉందా? అని ద్విసభ్యధర్మాసనం అటార్నీ జనరల్‌ను ప్రశ్నించింది. జవాబు చెప్పుకోవడానికి కూడా గడువు ఇవ్వకుండా ఇంత నిర్దయగా ఇళ్ళను కూల్చివేస్తుంటే సహించం, భరించం అంటూ ఆగ్రహించింది.

ఇక, బీజేపీ ఏలుబడిలో ఉన్న మరో రాష్ట్రం–మహారాష్ట్రలో అమలయిన బుల్‌డోజర్ న్యాయం మరీ విచిత్రమైనది. ఫిబ్రవరి 23న భారత్–పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంలో ఒక ఇంట్లోనుంచి ఒక పిల్లవాడు పాకిస్థాన్ అనుకూల, ఇండియా వ్యతిరేక నినాదాలు చేశాడంటూ కొందరు స్థానికులు ఆరోపించడంతో ఆ ఇంట్లోవారిని పోలీసులు అరెస్టుచేశారు. కొద్దిగంటల్లోనే ఆ పిల్లవాడిని వదిలిపెట్టి, తల్లిదండ్రులు ఇద్దరూ నిర్బంధంలో ఉండగానే, వారి ఇంటినీ, పాత ఇనుము–చెత్త దుకాణాన్ని అధికారులు ఆగమేఘాలమీద కూల్చివేశారు. ఈ విధ్వంసం ముగిసిన మర్నాడే దంపతులు ఇద్దరూ మేజిస్ట్రేట్ బెయిల్‌మీద బయటకు వచ్చారు. ఈ పరిణామాలన్నింటినీ న్యాయస్థానానికి విన్నవించుకుంటూ, గత ఏడాది నవంబరు 13న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ చర్యలు ఉల్లంఘిస్తున్నాయని సదరు బాధితుడు న్యాయమూర్తులకు గుర్తుచేశాడు. తన ఆస్తిని పునరుద్ధరించి, తగిన పరిహారం ఇప్పించవలసిందిగా ప్రార్థించాడు.

ఒకపక్క, ఈ కేసుల్లో సుప్రీంకోర్టు నోటీసులు ఇస్తున్న క్షణాల్లోనే, నాగపూర్‌లో ఒక ఇంటిని బుల్‌డోజర్ కూల్చేసింది. మార్చి 17న జరిగిన మతహింసకు కారకుడున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇంటిని మునిసిపల్ అధికారులు మార్చి 20న అక్రమ నిర్మాణమని ప్రకటించి, 24న కూల్చేశారు. నోటీసులమీద నోటీసులు ఇవ్వాలి, కనీసం పదిహేను రోజులు గడువు ఉండాలి అంటూ నవంబరులో దేశవ్యాప్తంగా వర్తించే మార్గదర్శకాలను విడుదలచేసిన సుప్రీంకోర్టు, వారంలోనే బుల్‌డోజర్ న్యాయాన్ని అమలు చేసిన కనీసం రెండుకేసుల్లో అధికారులు, పాలకులను ఎలా శిక్షిస్తుందో చూడాలి. 142వ అధికరణ ద్వారా సంక్రమించిన విశేషాధికారాలను వినియోగించుకుంటూ, గీసిన గీతదాటి దూకుడుగా వ్యవహరించే అధికారుల మీద ధిక్కరణ చర్యలు తీసుకుంటాననీ, బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని వీరి నుంచి ముక్కుపిండి వసూలు చేస్తాననీ 95 పేజీల ఆ తీర్పులో న్యాయమూర్తులు బుల్డోజర్ ఘాతుకాలను నిలువరించేందుకు చేసిన ఆ ప్రయత్నం వృథాపోకూడదు.

న్యాయవ్యవస్థ పతనానికి కారణం ఎవరు?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

మృగాలు వేటాడి తమ ఆకలిని తీర్చుకున్న తర్వాత శాంతిస్తాయి కాని అవినీతి అనే ఆకలి ఉన్న మనిషి అంత త్వరగా శాంతించడు. ఆఫీసుల్లో, రహదారుల కూడళ్లలో, ప్రార్థనా మందిరాల్లో అంతటా మనిషి మనిషిని వేటాడడం మనకు కనిపిస్తోంది. ఎన్నికల రాజకీయాల్లో కోట్ల రూపాయలు ప్రవహిస్తూనే ఉంటాయి. రాజకీయ పార్టీలకు నిధుల సమీకరణ ఎవరి ద్వారా చేయాలో బాగా తెలుసు. ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకి నిధుల సమీకరణకు అనేక మార్గాలు ఉంటాయి. ఎందుకంటే అన్ని వ్యవస్థలూ వారికి అనుకూలంగా పనిచేస్తాయి. హవాలా మార్గాలు దేశమంతటా విస్తృతంగా పనిచేస్తూనే ఉంటాయి. పార్లమెంట్‌లో కీలకమైన ఓటింగ్ జరిగినప్పుడు ప్రజాప్రతినిధులను ప్రలోభపరిచిన ఉదంతాలు, నిండు సభలో నోట్ల కట్టలు రెపరెపలాడిన సంఘటనలు ఎన్నో. ఈ దేశంలో పెద్ద నోట్ల రద్దు జరిగినప్పుడు కూడా డబ్బు ప్రవాహం ఆగనే లేదు. అప్పుడప్పుడూ ఆదాయపన్ను శాఖ, ఈడీ అధికారులు దాడులు చేసి కోట్ల రూపాయల నోట్ల కట్టలను ఏ మంత్రి పీఏ ఇంటిలోనో, ఏ అధికారి నివాసంలోనో పట్టుకున్నట్లు వార్తలు వస్తాయి. కాని ఇది కంటితుడుపు మాత్రమే.

భారతదేశంలో అవినీతి సర్వాంతర్యామి. 62 శాతం మంది భారతీయులు తమ పనులకోసం ఎప్పుడో ఒకప్పుడు లంచాలు చెల్లించినవారేనని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. గత ఏడాది ఈ సంస్థ ప్రకటించిన నివేదిక ప్రకారం 180 దేశాల్లో భారతదేశం అవినీతి 96వ ర్యాంకును సాధించింది. స్కూలు అడ్మిషన్ల నుంచి సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు వరకూ ఏ రంగమూ అవినీతికి మినహాయింపు కాదని, లైసెన్స్‌రాజ్ రద్దయినా ఈ దేశంలో ప్రైవేట్ రంగం అత్యధికంగా ప్రభుత్వ రంగంలో పెద్దల చుట్టూ తిరగాల్సి వస్తోందని అందరికీ తెలుసు. 'భారత దేశంలో ఏ బడా ప్రైవేట్ సంస్థ ప్రభుత్వ ప్రాపకం లేకుండా ఎదిగిందో చెప్పండి'. అని కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఒక సందర్భంలో ప్రశ్నించారు. భారత దేశంలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఎంత బలంగా వేళ్లూనికొని ఉన్నదో రాజకీయ నాయకుల కంటే ఎవరికి ఎక్కువ తెలుసు?

ఈ నేపథ్యంలో గతవారం ఢిల్లీ హై కోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో నోట్లకట్టలు దొరికాయని వార్తలు రావడం పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. న్యాయమూర్తులు సంపాదనకు అతీతులని ఈ దేశంలో ఎంతమంది విశ్వసిస్తున్నారు? న్యాయమూర్తులను ప్రలోభపెట్టి తీర్పులను అనుకూలంగా తెప్పించుకునేందుకు, లేదా కేసులను వాయిదా వేయించుకునేందుకు నిరంతర ప్రయత్నాలు చేసేవాళ్లు నిరంతరం ఎక్కడో ఒకచోట తటస్థిస్తూనే ఉంటారు. 'న్యాయమూర్తులేమీ దేవతలు కాదు, వారు కూడా ఇదే సమాజంలో భాగం' అని ప్రముఖ న్యాయవాది రాంజెత్మలానీ ఒక సందర్భంలో చెప్పారు.

న్యాయవ్యవస్థ లోపాల గురించి అనేక రచనలు వచ్చాయి. రావి శాస్త్రి న్యాయవ్యవస్థలో కుళ్లును బట్ట బయలు చేశారు. 'కోర్టు అంటే ఏమిటో తెలుసా.. అదొక పెద్ద అడవి. అడవిలోకి వచ్చినవాడిదే పొరపాటు కాని మనది కాదు. అక్కడ హైనాల వంటి పెద్ద పెద్ద జంతువులుంటాయి. జాగ్రత్తగా ఉండకపోతే అవి మననే తినేస్తాయి..' అని రావి శాస్త్రి రచించిన 'మాయ' అనే కథలో న్యాయస్థానాల గురించి అభివర్ణిస్తారు. 'ప్లీడరు బాబూ సెప్తున్నా విను. ఏ మనిషీ మంచోడని ఎవరు చెప్పినా నేను నమ్మను. ఈ లోకంలో డబ్బొ యాపారం తప్ప మరేటీ లేదు' అని ముత్యాలమ్మ అనే సారా అమ్ముకునే స్త్రీ ద్వారా ఆయన చెప్పిస్తారు.

న్యాయమూర్తుల్లో ఎంత శాతం మంది అవినీతి పరులో అన్న విషయంపై చాలా కాలంగా చర్చ జరుగుతూనే ఉన్నది. సుప్రీంకోర్టు, హై కోర్టు న్యాయమూర్తుల్లో 50 శాతం మంది అవినీతిపరులేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న మార్కండేయ కట్జూ కూడా ఒకప్పుడు వ్యాఖ్యానించారు. మార్కండేయ కట్జూ కూడా యశ్వంత్ వర్మ మాదిరే అలహాబాద్‌కు చెందినవారే. అలహాబాద్ హై కోర్టులో తీవ్ర అవినీతికి పాల్పడుతున్న న్యాయమూర్తుల జాబితాను తాను అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లహోటీకి ఇచ్చానని, కాని ఆయన ఏ చర్యా తీసుకోలేదని ఖట్జూ వెల్లడించారు. తాను వారి అవినీతి గురించి సాక్ష్యాధారాలతో సహా బయటపెడతానని ఖట్జూ అన్నప్పుడు అలా చేయవద్దని జస్టిస్ లహోటీ ఆయనను బతిమిలాడారు. 'దయచేసి అలా చేయకండి. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి మనమే ప్రచారం చేస్తే రాజకీయ నాయకులు దాన్ని తమకు అనువుగా వాడుకుంటారు. జాతీయ జ్యుడిషియల్ కమిషన్‌ను నియమిస్తారు.' అని జస్టిస్ లహోటీ ఆయనను అభ్యర్థించారు. అవినీతిపరులైన ఆ న్యాయమూర్తుల్లో కొందరిని బదిలీ చేసి ఊరుకున్నారు. ఇప్పుడు జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో అదే జరిగింది.

అసలు న్యాయవ్యవస్థలో ఉన్న బలహీనతలను అధికారంలో ఉన్నవారు వాడుకొననిది ఎప్పుడు? అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వం న్యాయవ్యవస్థ తనకు అనుకూలంగా ఉండాలనే భావిస్తుంది. దీన్ని ప్రతిఘటించి తన స్వతంత్రతను కాపాడుకునే ప్రయత్నాలు చేసిన, ప్రభుత్వాలు తప్పు చేస్తే నిలదీసిన న్యాయమూర్తులు లేకపోలేదు. న్యాయమూర్తుల నియామకాల్లో రాజకీయ జోక్యం ఉండరాదని తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కానియా నెహ్రూకు లేఖ రాసి స్పష్టం చేశారు. 1994లో జస్టిస్ వెంకటాచలయ్య పదవీ విరమణ తర్వాత ప్రభుత్వాలను బలంగా ప్రశ్నించే ప్రధాన న్యాయమూర్తులు అడపాదడపా మాత్రమే ప్రత్యక్షమవుతున్నారు. క్రమంగా న్యాయవ్యవస్థ బలహీనపడుతున్నదనే అభిప్రాయం సర్వత్రా ఏర్పడుతోంది.

ఢిల్లీ హై కోర్టు న్యాయమూర్తి నివాసంలో డబ్బులు దొరకడం గురించి అనేక కథనాలు వచ్చినప్పటికీ ఎక్కడా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అదంతా ఆయన ఊళ్లో లేనప్పుడు జరిగిన కుట్ర అని, దీని వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉన్నదని వాదించేవారు కూడా ఉన్నారు. అత్యంత శక్తివంతమైన ఢిల్లీ హై కోర్టు, కొలీజియంపై అలహాబాద్‌కు చెందిన న్యాయమూర్తుల పట్టు ఉన్నదని, దాన్ని సడలించేందుకే ఈ ఉదంతం జరిగిందని ఒక సీనియర్ న్యాయవాది చెప్పారు. ఏదిఏమైనా ఈ ఉదంతంతో ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పట్టు బిగించే అవకాశం లభించిందని మాజీ న్యాయమూర్తి ఒకరు అన్నారు. గతంలో జస్టిస్ లహోటీ భయపడినట్లే జాతీయ జ్యుడిషియల్ కమిషన్ నియామకానికి మరోసారి ప్రభుత్వం ప్రయత్నించేందుకు రంగం సిద్ధమవుతున్నదేమో? న్యాయ వ్యవస్థ తీవ్రంగా అప్రతిష్ఠపాలయినప్పుడు దాన్ని సరిదిద్ది న్యాయమూర్తుల నియామకాన్ని ఒక స్వతంత్ర సంస్థకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు హర్షించవచ్చు. కాని న్యాయవ్యవస్థ బలహీనపడటానికి బాధ్యులు ఎవరు?



akbar

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో నోట్ల కట్టల ఉదంతంతో ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పట్టు బిగించే అవకాశం లభించిందని మాజీ న్యాయమూర్తి ఒకరు అన్నారు. గతంలో జస్టిస్ లహోటీ భయపడినట్లే జాతీయ జ్యుడిషియల్ కమిషన్ నియామకానికి మరోసారి ప్రభుత్వం ప్రయత్నించేందుకు రంగం సిద్ధమవుతున్నదేమో? న్యాయమూర్తుల నియామకాన్ని ఒక స్వతంత్ర సంస్థకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు హర్షించవచ్చు. కాని న్యాయవ్యవస్థ బలహీనపడటానికి బాధ్యులు ఎవరు?

ఒక ప్రైవేట్ కంపెనీకి అనుకూలంగా తీర్పునిచ్చేందుకు ఒక హై కోర్టు అదనపు న్యాయమూర్తి మరో ఇద్దరు న్యాయమూర్తులను ఒత్తిడి చేశారన్న ఫిర్యాదుపై ఇటీవల లోక్‌పాల్ విచారణకు సిద్ధపడితే సుప్రీంకోర్టు స్టే విధించింది. 'ఇది చాలా ఆందోళనకరం' అని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు, అధికారులతో సమానంగా హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కూడా విచారించే అధికారం లోక్‌పాల్‌కు ఉన్నదా లేదా అని తామే తేల్చాలని సుప్రీంకోర్టు నిర్ణయించుకుంది. నిజానికి లోక్‌పాల్ కూడా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ ఆధ్వర్యంలో ఉన్నదే. మరి లోక్‌పాల్‌కు హై కోర్టు న్యాయమూర్తులపై విచారించే అధికారం ఎందుకు లేదు? అంతర్గత విచారణ పేరుతో తమ న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలను తమే రహస్యంగా విచారించి ఏ చర్యా తీసుకోకుండా వదిలేయడం, మహా అయితే బదిలీ చేయడం సుప్రీం కోర్టు కొలీజియం ఇంతకాలం చేస్తూవస్తోంది. 'స్థానం మారినంత మాత్రాన అవినీతి లక్షణాలు మారుతాయా?' అని ప్రముఖ న్యాయకోవిదుడు ఉపేంద్ర బక్షి ఒక ఇంటర్వ్యూలో ప్రశ్నించారు.

న్యాయమూర్తుల అవినీతి, అక్రమాల గురించి బయట విస్తృతంగా చర్చకు వస్తే న్యాయవ్యవస్థ అప్రతిష్ఠపాలవుతోందని, ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల గౌరవం పోతుందని వారు భయపడుతున్నారు. కాని న్యాయవ్యవస్థలో అవినీతిని కప్పిపుచ్చినంత మాత్రాన ప్రజలకు గౌరవం కలుగుతుందా? ఇది పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగితే తనను ఎవరూ గమనించరని భావించినట్లే ఉన్నది. సుప్రీంకోర్టు కొలీజియంలో ఉన్న న్యాయమూర్తులు ఒకరి అస్మదీయులను మరొకరు నియమించుకుని పదవులు పంచుకున్న ఉదంతాలు ఎన్నో చర్చకు వచ్చాయి. తద్వారా బంధువులు, మిత్రులు, స్వవర్గీయులు అందలమెక్కిన సందర్భాలు కూడా ప్రజల దృష్టి నుంచి దాటిపోలేదు. సుప్రీంకోర్టు కొలీజియం ఆశ్రిత పక్షపాతంతో, తమకు నచ్చినవారిని నియమిస్తోందని, షెడ్యూల్డు కులాలు, జాతులు, ఇతర అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ప్రముఖ ప్రగతిశీల న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ ఎప్పుడో చెప్పారు. దళితులకు న్యాయవ్యవస్థలో అవకాశం దక్కడం లేదని ఒకప్పుడు రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఏర్పడిన తర్వాత 39 సంవత్సరాల పాటు ఒక్క మహిళను కూడా న్యాయమూర్తిగా నియమించలేదు.

ఒక రకంగా న్యాయవ్యవస్థ తన ఉనికిని, ప్రతిష్ఠను, స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోలేకపోవడానికి కొందరు న్యాయమూర్తులే కారణం. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉండాలంటే పదవీవిరమణ తర్వాత న్యాయమూర్తులు మరే పదవినీ నిర్వహించకూడదని 1958లో లా కమిషన్ సూచించింది. కాని పదవీ విరమణ అనంతరం పోస్టులకోసం వెంపర్లాడే న్యాయమూర్తులు ఎందరో ఉన్నారు. తాము తప్పులకు పాల్పడి ప్రభుత్వ పెద్దలు తమను శాసించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. న్యాయ వ్యవస్థ విశ్వసనీయతను కాపాడే బాధ్యత చట్టసభలు, ప్రభుత్వంపై ఉన్నది. అన్ని వ్యవస్థలతో పాటు న్యాయవ్యవస్థ కూడా తమ అడుగులకు మడుగులొత్తాలని పాలకులు భావిస్తే మాత్రం మనం చేయగలిగింది ఏమీ లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

చేనేతలో 'చంద్ర'కాంతులు

చేనేత కేవలం వస్త్రమే కాదు లక్షల కుటుంబాలకు జీవనాధారం. అన్న ఎన్టీఆర్ బాటలోనే నడుస్తూ నేడు సీఎం చంద్రబాబునాయుడు చేనేతకు పెద్దపీట వేస్తున్నారు. జనతా వస్త్రాల పేరుతో సగం ధరకే పేదలకు ధోవతి, చీరను అందజేశారు ఎన్టీఆర్. ఈ పథకం వల్ల చేనేత వస్త్రాల అమ్మకాలు పెరగడంతో పాటు ఆకలితో అలమటిస్తున్న చేనేత కార్మికులకు ఉపాధి లభ్యమైంది. దీంతో పాటు, చేనేతలకు నూలు, రంగులు, రసాయనాలను సబ్సిడీపై అందజేశారు. నేతన్నలు నేసిన వస్త్రాలను అన్నగారి ప్రభుత్వమే సేకరించింది. ఆనాడు తీసుకున్న ఈ నిర్ణయం ఓ సంచలనం సృష్టించింది. ఆత్మహత్యలకు పాల్పడకుండా ఎంతో మంది నేత కార్మికులను రక్షించిన గొప్ప పథకమిది. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడు సైతం నేతన్నలకు లబ్ధి కలిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నారు. మరెన్నో పథకాలు అమలు చేస్తున్నారు. తన తాత, తండ్రి లక్షణాలు పుణికి పుచ్చుకున్న యువ నాయకులు, మంత్రి నారా లోకేశ్ కూడా చేనేత రంగానికి మరింత వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు నేతన్నల ఆర్థిక వృద్ధికి ఎన్నో పథకాలు, ప్రయోజనాలు అందజేశారు. 2014–19 మధ్య కాలంలో త్రిఫ్ట్ పథకాన్ని అమలు చేసి, ప్రభుత్వం అందించే వాటాను పెంచారు. పావలా వడ్డీ పథకం అమలు చేసి, నేతన్నలకు వడ్డీ భారాన్ని తగ్గించారు. పవర్ టారిఫ్‌లో 50 శాతం రాయితీ ఇచ్చారు. 2014–19లో రూ.50.15 కోట్లతో 54 క్లస్టర్లు ఏర్పాటు చేశారు.



అయిదేళ్ల జగన్ అసమర్థ పాలనలో నేతన్నలు అన్ని విధాలా నష్టపోయారు. చంద్రబాబు అధికారంలోకి రావడంతో చేనేత రంగానికి పటిష్ఠ ప్రణాళికలు చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే కాకుండా, కొత్త పథకాలకు కూడా శ్రీకారం చుట్టడంతో నేతన్నలకు భరోసా వచ్చింది.

2024లో చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా చేనేతలకు మరోసారి అండగా నిలిచింది. చంద్రబాబు దిశానిర్దేశంలో అధికారులతో కలిసి చేనేత, జౌళి శాఖ మంత్రిగా ఎన్నో పథకాలు రూపొందించాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ పెంచాం. మొదటి ఏడాది పెన్షన్ల రూపంలోనే రూ.370.89 కోట్లు లబ్ధిదారులకు చెల్లించాం. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచాం. ఈ పథకం కింద 2024–25లో రూ.5 కోట్లు కేటాయించాం. 2025–26లోనూ త్రిఫ్ట్ పథకానికి మరో రూ.5 కోట్లు కేటాయించాం. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నాం. నేటి తరం అభిరుచులకు అనుగుణంగా నూతన వస్త్రాల తయారీలో అయిదు జిల్లాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాం. చేనేత వస్త్రాల విక్రయాలకు రాష్ట్రంతో పాటు దేశంలోని ఏడు నగరాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశాం. ఆప్కో నేతృత్వంలో ఈ కామర్స్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను అందజేస్తున్నాం. జాతీయ హ్యాండ్‌లూమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కింద 2024–25లో 10 క్లస్టర్లు ఏర్పాటు చేశాం. వీవర్స్ ముద్రా స్కీమ్ ద్వారా చేనేతలకు రుణాలు అందజేశాం. ముడిపదార్థాల సరఫరా పథకం కింద నూలుపై 15 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చేనేత ఉత్పత్తుల 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని చంద్రబాబునాయుడు నిర్ణయించారు. త్వరలోనే ఈ పథకాన్ని కూడా అమలు చేయబోతున్నాం. చేనేత ఉత్పత్తులకు జి.ఐ. ట్యాగ్ కోసం, పది కొత్త ఉత్పత్తులకు కేంద్రానికి దరఖాస్తు చేశాం. ప్రస్తుతం నాలుగు ఉత్పత్తులకు జి.ఐ. ట్యాగ్ ఉంది. అది కూడా 2014–19లో టీడీపీ ప్రభుత్వం కృషి వల్లే లభించింది.

విశాఖపట్నంలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మిస్తున్నాం. రాయదుర్గం, హిందూపురం, బ్రాండెక్స్‌లో టెక్స్ టైల్స్ పార్కుల అభివృద్ధితో పాటు ఎమ్మిగనూరు టెక్స్ టైల్స్ పార్క్ కూడా నిర్మించబోతున్నాం. నూతన టెక్స్ టైల్స్ పాలసీని తీసుకొచ్చాం. ఈ పాలసీ ద్వారా చేనేత రంగంలో రూ.10,000 కోట్ల పెట్టుబడులు సేకరించాలని, 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డీకార్బనైజేషన్, వ్యర్థాలను తగ్గించడానికి సబ్సిడీలు అందజేస్తున్నాం. నేతన్నలకు 365 రోజుల పాటు పనిదినాలు కల్పించడంతో పాటు, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి టాటా తనీరా, ఆదిత్య బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్‌తోనూ ఒప్పందం చేసుకున్నాం. ఈ ఒప్పందాలతో చేనేత వస్త్రాల అమ్మకాలు గణనీయంగా పెరగనున్నాయి. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.10 వేలు విలువ చేసే నూలును ఉచితంగా అందజేస్తున్నాం.

మంత్రి నారా లోకేశ్ సూచనతో రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలల ఏర్పాటుకు నిర్ణయించాం. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించాం. ఇందుకోసం ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్య బీమా పథకం అమలు చేయబోతున్నాం. చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించబోతున్నాం.

2019–24 కాలం చేనేతల బతుకుల్లో చీకటి మిగిల్చింది. ఈ అయిదేళ్లలో జగన్ అసమర్థ పాలన కారణంగా చేనేతలు అన్ని విధాలా నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటినీ రద్దు చేసి, ఒకే ఒక్క పథకం నేతన్న నేస్తం మాత్రమే అమలు చేశారు. ఈ పథకం కింద అర్హులకు బదులు అనర్హులకు, వైసీపీ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చారు. ఉత్పత్తి అయిన వస్త్రాలకు మార్కెటింగ్ లేక, చేసిన అప్పులు తీర్చలేక, జగన్ ప్రభుత్వం నుంచి సాయం అందక... నేతన్నలు ఐదేళ్లు నరకం అనుభవించారు. ఎందరో నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. మరెందరో ఆ వృత్తిని వీడి వలస కార్మికులుగా ఇతర ప్రాంతాలకు వలస పోయారు.

మరోసారి చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడంతో చేనేత రంగానికి పటిష్ఠ ప్రణాళికలు చేపట్టారు. అదే సమయంలో గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలే కాకుండా కొత్త పథకాలకు కూడా శ్రీకారం చుట్టడంతో నేతన్నలకు భరోసా వచ్చింది. అందుకే ఏపీలో చేనేత రంగానికి సీఎం చంద్రబాబునాయుడు పాలన ఎప్పుడూ స్వర్ణయుగమే.



• ఎస్. సవిత
రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

హిందీని రుద్దింది కాంగ్రెస్ పార్టీయే!

మార్చి 1న ఆంధ్రజ్యోతిలో పి.చిదంబరం 'త్రిభాషా విద్యలో హిందీ తప్పనిసరా?' శీర్షికన వ్యాసం రాస్తూ కాంగ్రెస్ పార్టీ తప్పులను నిర్లజ్జగా సమర్థించారు. హిందీ భాషని త్రిభాషా విధానం ద్వారా అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. మేము స్కూల్లో చదువుకునే రోజుల్లో (1960లలో) హిందీని మూడో భాషగా మానెత్తిన రుద్దింది కాంగ్రెస్ పార్టీయే. హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని డీఎంకే చేపట్టినప్పుడు, దానికి ముందు రాజాజీ, కామరాజ్, సి.సుబ్రహ్మణ్యం వంటి కాంగ్రెస్ నాయకులు ఏమి చెప్పిందీ, త్రిభాషా విధానాన్ని సమర్థించిందీ చిదంబరానికి తెలియదా? త్రిభాషా విధానంలో హిందీ నిర్బంధం కాదు. మాతృ భాష, ఇంగ్లీష్‌తో పాటుగా మరో భారతీయ భాషా చదవడమన్నది ఆ భాషా విధానం రూపొందించినపుడు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా వున్న త్రిగుణ సేన్ చేసిన ప్రకటన చిదంబరానికి తెలియదా? ఆ సమయంలో హర్యానాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్కడి పాఠశాలలో మూడో భాషగా తెలుగు ప్రవేశపెట్టింది. ఇప్పుడు తమిళనాడు కూడా హిందీ అమలు చేయాల్సిన అవసరం లేదు. తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో ఒకదానిని నేర్చవచ్చు. భాషా ఉద్యమ రాజకీయం నడుపుతున్న స్టాలిన్‌ను నిర్ద్వంద్వంగా ఖండించాల్సిన చిదంబరం, డీఎంకే విదిల్చే ఒకటి, రెండు సీట్ల కోసం కక్కుర్తిపడుతూ హిందీ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు పలకటం నీచం. డీఎంకే తమిళనాట తెలుగును ఎలా అణిచివేసిందీ అందరికీ తెలుసు. తమిళులది భాషా అభిమానం కాదు, అది దురభిమానం. ఇతర భాషలను ద్వేషించే దురభిమానం చాలా ప్రమాదకరం.

– దుగ్గరాజు శ్రీనివాసరావు, విజయవాడ

బిహార్‌లో మరో కుమార సంభవం?

ఢిల్లీ దంగల్ తరువాత రాజకీయ రణ రంగస్థలం బిహార్‌కు మారింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా యూపీలో ఎదురైన పరాజయ– పరాభవాల నుంచి తేరుకొని, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వరుస విజయాల ఊపుమీదున్న బీజేపీ– రాజధానిని దక్కించుకున్నంత సునాయాసంగా బిహార్‌లో ప్రభావ– ప్రాభవాలు చాటుకోగలదా అన్నది ప్రస్తుతానికి అనుమానమే.

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఆరేడు నెలల గడువు ఉన్నప్పటికీ, ఇప్పటికే రంగు మారుతున్న రాజకీయం భవిష్యత్తు చిత్రపటాన్ని సూచాయగా ఆవిష్కరిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి నితీశ్ అడుగుజాడల్ని అనుమానాలు నీడల్లా వెన్నాడుతున్నాయి. ఆరో దశకం చివర్లో హరియాణాలో పురుడుపోసుకున్న 'ఆయారామ్.. గయారామ్' సంస్కృతిని పునికిపుచ్చుకొని, రాష్ట్రంలో ఏ పార్టీ గెలిచినా.. తనే ముఖ్యమంత్రిగా ఉండేలా పల్టురామ్ అవతారమెత్తిన నితీశ్, వయసు మీద పడిన దృష్ట్యా మరోసారి అలాంటి దుస్సాహసానికి తెగబడకపోవచ్చు. కానీ, అధికారాన్ని సునాయాసంగా వదులుకోరని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. అందుకు ఆయన ఎలాంటి ఎత్తుగడలు వేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరం.

బిహార్‌లో రాజకీయ వాతావరణం యూపీ తదితర రాష్ట్రాల కన్నా పూర్తిగా భిన్నమైనది. హిందుత్వానికి పట్టుకొమ్మ వంటి యూపీలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అయోధ్య రాముడే గట్టెక్కించలేకపోయాడు. ఇక బిహార్‌లోనైతే హిందూ సమాజం నూటికి నూరుపాళ్లు కులాలు, వర్గాలుగా చీలికలు పేలికలై ఉంది. హిందుత్వ గొడుగు నీడలోకి చేరి, ఒకే ఓటు బ్యాంకుగా.. ఉమ్మడిగా ఓటు వేసే పరిస్థితి ఎంత మాత్రం లేదు. అలాంటిది, బిహార్‌లో మళ్లీ అధికారంలోకి వస్తే సీతామాత ఆలయం నిర్మిస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇవ్వడాన్ని బట్టి చూస్తే.. ఒక ఎన్నికల వ్యూహకర్తగా ఆ రాష్ట్రంలో క్షేత్రస్థాయి పరిస్థితి అంచనాలో ఆయన, బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా విఫలమవుతున్నాయేమో అనిపిస్తోంది. మరోవైపు ఢిల్లీ ఎన్నికల్లో 'బిగ్ జీరో'గా మిగిలిపోయాక బేరమాడే శక్తిని మరింతగా కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ, ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్తుందనేది చూడాల్సిందే.

ఎన్నికల పోరాటం స్థూలంగా చూస్తే లాలూప్రసాద్ యాదవ్ సారథ్యంలోని ఆర్జేడీ, నితీశ్ కుమార్ నాయకత్వంలోని పాలక జేడీ(యు) మధ్యేనని అనిపిస్తున్నప్పటికీ, అసలుసిసలు యుద్ధం జరిగేది మాత్రం కాంగ్రెస్, బీజేపీల నడుమే.

ముఖ్యమంత్రి నితీశ్ కుమారే తమ సీఎం అభ్యర్థిగా గోదాలోకి దిగాలని బిహార్ సంకీర్ణ సర్కారులో ప్రధాన భాగస్వామిగా ఉన్న బీజేపీ నిర్ణయించడం అనూహ్యమేమీ కాదు. జేడీ(యు)కు 12 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ మనుగడకు అవెంతో కీలకం. ఈ దృష్ట్యా జేడీ(యు)తో కలిసి సాగడం వినా బీజేపీ ముందు మరో మార్గం లేదు. అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీ నుంచే ముఖ్యమంత్రి ఎంపిక జరగాలన్న మహారాష్ట్ర ఫార్ములాకు బీజేపీ బిహార్‌లో తిలోదకాలు వదులుకొనకా తప్పలేదు. అగ్రవర్ణాల్లో పట్టుకలిగి ఉన్న బీజేపీ, నితీశ్ కారణంగా కుర్మిలు, తీవ్ర వెనుకబడిన (ఈబీసీ) కులాల ఓట్లు గంపగుత్తగా తమ కూటమికే లభిస్తాయని, దాంతో మరోసారి మంచి మెజారిటీతో గద్దెనెక్కగలమని ఆశిస్తోంది.

ఢిల్లీలో జీరో మార్కుతో డీలా పడిపోయిన కాంగ్రెస్ పార్టీ, బిహార్‌కు సంబంధించినంతవరకు లాలూ తనయుడు తేజస్వీ యాదవ్‌ను సీఎం చేయడం వరకే తన పాత్రను పరిమితం చేసుకునేలా కనిపిస్తోంది. తాను గెలవకపోయినా.. గెలిచే అవకాశం ఉన్న పార్టీని ఓడించే సత్తా మాత్రం కాంగ్రెస్‌కు పుష్కలంగా ఉందని ఢిల్లీ ఎన్నికల్లో తిరుగులేని విధంగా రుజువైన దృష్ట్యా, ఆర్జేడీ సైతం కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ స్థాయిలో సీట్లు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. అలాగని పెద్ద సంఖ్యలో స్థానాలు డిమాండ్ చేసే పరిస్థితిలో కాంగ్రెస్ ఉందా అంటే.. అదీ లేదు. మూడున్నర దశాబ్దాల క్రితం వరకు ఆ రాష్ట్రంలో ఏకఛత్రాధిపత్యం కాంగ్రెస్‌దే. అనేక కుంభకోణాలు, అరాచక పాలనతో బిహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చి, తీవ్ర అప్రతిష్ఠ మూటగట్టుకున్న ఆర్జేడీకి తోక పార్టీగా నేడు అది తయారైంది. లాలూ పార్టీని మరోసారి అధికార పీఠం మీద కూర్చోబెట్టేందుకు ఉపకరించే ఒక సాధనంగా మాత్రమే మిగిలిపోయింది. ఎంతటి దురవస్థ..!



దేశంలో ఇప్పటికే 30కి పైగా శక్తివంతమైన రాజకీయ కుటుంబాలు చక్రం తిప్పుతున్నాయి. బిహార్‌లోను ఇద్దరు వారసులు తేజస్వీ యాదవ్, చిరాగ్ పాసవాన్ తమదైన ముద్ర వేశారు. ఇప్పుడిక నిశాంత్ కుమార్ సైతం ముగ్గులోకి దిగితే.. రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరిగినట్టే.

బిహార్ అసెంబ్లీలో 243 సీట్లు ఉంటే.. అందులో పాలక కూటమివి 138. వాటిలో జేడీ(యు)వి 48 కాగా, 84 సీట్లతో బీజేపీ ఆధిపత్యం కలిగి ఉంది. అయినప్పటికీ, నితీశ్ చంచల స్వభావం దృష్ట్యా దూకుడు ప్రదర్శించకుండా బీజేపీ తమాయించుకుంటూ వస్తోంది. ఇటీవలి మంత్రివర్గ విస్తరణ సందర్భంగా మొత్తం ఏడుగురిని కొత్తగా చేర్చుకున్న సీఎం నితీశ్ కుమార్, అందర్నీ బీజేపీ నుంచే తీసుకోవడం.. అందులోనూ రాజ్‌పుత్, కుష్వాహ, కుర్మి, భూమిహార్లకు చోటు ఇవ్వడం ద్వారా బీజేపీతో మైత్రి కొనసాగింపునకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు బలమైన సంకేతాలు పంపారు. అటు లాలూ సైతం రాజకీయ వ్యూహాల్లో ఆరితేరిన నేతే. తన కుమారుడిని ఎలాగైనా గద్దెనెక్కించే క్రమంలో ముఖ్యంగా ఎం–వై(ముస్లిం–యాదవ ఏకీకరణ) సూత్రాన్ని ఆయన అనుసరిస్తున్నారు. 18 శాతం ముస్లిములు, 17 శాతం యాదవుల ఓట్లకు ఆయన గురిపెట్టారు. కానీ.. ఈ మధ్య జరిగిన ఉప ఎన్నికల్లో నాలుగైదు శాతం యాదవుల ఓట్లు ఎన్డీఏ కూటమికి పడినట్లు గణాంకాల్లో వెల్లడి కావడం.. లాలూకు కలవరం కలిగించే పరిణామమే. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్, తన జన స్వరాజ్ పార్టీ తరఫున 30–40 మంది ముస్లిం అభ్యర్థులను రంగంలోకి దింపే అవకాశం ఉంది. మజ్లిస్ సైతం తన ఉనికిని బలంగా చాటుకునేందుకు సిద్ధపడుతోంది. ఈ దృష్ట్యా.. కాంగ్రెస్–ఆర్జేడీ కూటమికి ముస్లిములు పూర్తిస్థాయిలో ఓట్లు వేస్తారా అన్నది అనుమానమే.

నితీశ్ కుమార్ ఆరోగ్య పరిస్థితి ఇటు ఎన్డీయే కూటమినీ ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్న నితీశ్, కొంత కాలంగా పలు కార్యక్రమాలకు గైర్ హాజరవుతున్న తీరు – విపక్షం చేతిలో తాజా ఆయుధంగా మారే సూచనలు ఉన్నాయి. నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ బిహార్ రాజకీయాల్లోకి అరంగేట్రం చేయవచ్చునన్న ఊహాగానాలు... ఈ నేపథ్యంలో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. దేశంలో ఇప్పటికే 30కి పైగా శక్తివంతమైన రాజకీయ కుటుంబాలు చక్రం తిప్పుతున్నాయి. బిహార్‌లోను ఇద్దరు వారసులు తేజస్వీ యాదవ్, చిరాగ్ పాసవాన్ తమదైన ముద్ర వేశారు. ఇప్పుడిక నిశాంత్ కుమార్ సైతం ముగ్గులోకి దిగితే.. రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరిగినట్టే.

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ డిగ్రీ పొందిన నిశాంత్ కుమార్, ఇప్పటిదాకా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ... పుస్తకాలు, భజనలు, ధ్యానంతో గడిపేస్తున్నారు. తన వ్యాపకాలు ఏమిటో తను చూసుకుంటున్నారు. రాష్ట్రంలో బీజేపీకి చెప్పుకోదగ్గ స్థాయి కలిగిన నాయకులు లేకపోవడం, నితీశ్ కుమార్ సైతం రెండో తరం నాయకుల్ని తయారు చేసుకోని నేపథ్యంలో.. నిశాంత్ కుమార్ మరో వారసుడిగా ఎన్నికల రాజకీయాల్లోకి రంగప్రవేశం చేసే సూచనలు ఉన్నాయి. బిహార్ ఎన్నికలపై దీని ప్రభావం తథ్యం. అది ఏ స్థాయిలో ఉంటుంది, ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేం..!

■ పి. దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు





స్థూల ఉత్పాదకతలో సంవృద్ధి

ఎన్టీఆర్ జిల్లా 2, కృష్ణాజిల్లా 3 స్థానాలు

- రూ.94,562 కోట్లు ఉత్పత్తి సాధించిన ఎన్టీఆర్ జిల్లా
- రూ.87,742 కోట్ల ఉత్పత్తితో కృష్ణాజిల్లా
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గణాంకాలు విడుదల చేసిన సీఎం
- రాష్ట్ర జీడీడీపీలో ఎన్టీఆర్ 5.79, కృష్ణా 5.57 శాతం కాంట్రిబ్యూషన్
- తలసరి ఆదాయంలో రెండు, మూడు స్థానాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా రెండు, కృష్ణాజిల్లా మూడు స్థానాలు పొందాయి. విశాఖపట్నం మొదటి స్థానం సాధించింది. కొద్దిరోజుల్లో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాల్లో ఎన్టీఆర్ జిల్లా రూ.94,562 కోట్లు, కృష్ణాజిల్లా రూ.87,742 కోట్ల ఉత్పాదకతను పొందాయి. గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే ఎన్టీఆర్ జిల్లా 10.09 శాతం, కృష్ణాజిల్లా 11.58 శాతం మేర జీడీడీపీలో వృద్ధిని నమోదు చేశాయి. వ్యవసాయానుబంధ రంగాల కేటగిరీలో వ్యవసాయం, ఉద్యానం, మాంసం, చేపలు, రొయ్యల ఉత్పత్తిలోనూ, పారిశ్రామిక రంగాల కేటగిరీలో మైనింగ్, క్వారీయింగ్, తయారీ, విద్యుత్, గ్యాస్, వాటర్ సప్లై, నిర్మాణం వంటి రంగాల్లో ఉత్పాదకత, సేవా రంగంలో వ్యాపారం, హోటళ్లు, రెస్టారెంట్లు, రైల్వే, బ్యాంకింగ్, రవాణా, రియల్ ఎస్టేట్ తదితర రంగాలకు సంబంధించి సాధించిన జీడీడీపీని మంగళవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు విడుదల చేశారు.



సీఎం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

ఎన్టీఆర్ జిల్లాలో వృద్ధి

వ్యవసాయ రంగంలో ఎన్టీఆర్ జిల్లా రూ.1,081 కోట్లు సాధించి 1.24 శాతం కంట్రిబ్యూషన్ అందించింది. ఉద్యాన రంగంలో మాత్రం రూ.4,905 కోట్ల ఉత్పాదకతను సాధించి, 5.62 శాతం వృద్ధితో కంట్రిబ్యూషన్ అందించింది. లైవ్‌స్టాక్ (మాంసం) రంగంలో రూ.4,414 కోట్ల ఉత్పాదకతతో, 5.06 శాతం వృద్ధితో కంట్రిబ్యూషన్ అందించింది. మొత్తంగా వ్యవసాయ రంగంలో 2022-23తో పోల్చుకుంటే, 2024-25కు 15.94 శాతం వృద్ధితో రూ.1,737 కోట్ల ఉత్పాదకతను సాధించడం విశేషం. పారిశ్రామిక రంగానికి సంబంధించి మైనింగ్-క్వారీయింగ్‌లో రూ.1,149 కోట్లు, తయారీకి సంబంధించి రూ.3,310 కోట్లు, ఎలక్ట్రిసిటీ, గ్యాస్, వాటర్ సప్లైకు సంబంధించి రూ.2,638 కోట్లు, నిర్మాణాలకు సంబంధించి రూ.10,632 కోట్ల ఉత్పాదకతతో గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే రూ.3,293 కోట్ల మేర అదనంగా ఉత్పాదకతను సాధించింది. సేవా మిగతా 8లో..

తలసరి ఆదాయంలో కీలక స్థానాలు

తలసరి ఆదాయంలో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లా తలసరి ఆదాయం రూ.4,18,997 కాగా, ఎన్టీఆర్ జిల్లా తలసరి ఆదాయం రూ.3,53,150గా నమోదైంది. కిందటి ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కృష్ణాజిల్లాలో రూ.69,313, ఎన్టీఆర్ జిల్లాలో రూ.64,262 మేర తలసరి ఆదాయం పెరిగింది. కృష్ణాజిల్లాలో 16.54 శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 18.20 శాతం వృద్ధి నమోదైంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26లో కృష్ణాజిల్లా రూ.4,88,310, ఎన్టీఆర్ జిల్లా రూ.4,17,412 తలసరి ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి.

రూ.కోట్ల విలువచేసే మిర్చి పంట.. కళ్ల ముందే దహనమైంది. జగ్గయ్యపేట మండలం తొర్రగుంటపాలెంలో సాయితిరుమలగిరి అగ్రి ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోల్డ్ స్టోరేజీలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.15 కోట్ల విలువైన పంట బూడిదైంది. మిర్చి ఘాటుకు మంటలను ఆర్పడం కష్టతరమవుతుండగా, మరో రెండు రోజుల వరకు మంటలు అదుపులోకి వచ్చే పరిస్థితి లేకుండాపోయింది.



మంగళవారం ఉదయం కోల్డ్ స్టోరేజీ నుంచి భారీగా వస్తున్న పొగ

మిర్చి మంటలు

జగ్గయ్యపేటలోని కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం

బూడిదైన రూ.15 కోట్ల విలువైన మిర్చి పంట

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానేనని అంచనా
- మంటలను అదుపు చేయలేకపోతున్న అగ్నిమాపక సిబ్బంది
- ఆపరేషన్‌కు అడ్డుగా మారుతున్న మంటలు.. ఆపై ఘాటు
- అదుపునకు మరో రెండు రోజులు పట్టే అవకాశం
- రికార్డులను సీజ్ చేసిన మార్కెటింగ్ అధికారులు
- ఇటీవలే రూ.6 కోట్ల రుణం తీసుకున్నట్టు నిర్ధారణ
- ఫైర్ ఎన్‌వోసీ లేదు.. అగ్నినిరోధక యంత్రాలు కూడా లేవ్
- యాజమాన్యం పరార్.. రైతుల అందోళన

జగ్గయ్యపేట/విజయవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట శివారులో జాతీయ రహదారికి సమీపంలోని తొర్రగుంటపాలెంలో ఉన్న సాయి తిరుమలగిరి అగ్రి ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోల్డ్ స్టోరేజీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు కూడా మంటలు అదుపులోకి రాలేదు. మిర్చిఘాటు కారణంగా అగ్నిమాపకశాఖ అధికారులు అష్టకష్టాలు పడుతూ మంటలను ఆర్పేందుకు కష్టపడుతున్నారు. ఈ ప్రమాదంలో రూ.15 కోట్ల విలువ చేసే మిర్చి పంట అగ్నికి ఆహుతైంది. స్టోరేజీ యాజమాన్యం పరారీలో ఉంది. తమ పంట అగ్నికి ఆహుతి కావటంతో రైతులు కోల్డ్ స్టోరేజీ దగ్గర ఆందోళన నిర్వహించారు. కోల్డ్ స్టోరేజీలో ఎలాంటి ఫైర్ ఎన్‌వోసీ లేదు. కనీసం అగ్ని నిరోధక వ్యవస్థలు కూడా లేవని తెలుస్తోంది. కాగా, వీటిపై అగ్నిమాపక శాఖ అధికారులు ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు.



మంగళవారం అర్ధరాత్రి భారీగా ఎగసి పడుతున్న మంటలు

అదుపులోకి రాని మంటలు

సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కోల్డ్ స్టోరేజీ సిబ్బంది నిద్రిస్తుండగా, ఘాటైన వాసనతో కూడిన పొగలు వచ్చాయి. దీంతో సిబ్బంది లేచి చూడగా, స్టోరేజీలో మంటలు కనిపించాయి. వెంటనే యజమాని రావూరి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన స్థానిక అగ్నిమాపక, జిల్లా అధికారులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. హుటాహుటిన ఫైరింజన్లు రంగంలోకి దిగి మంటలు ఆర్పటం మొదలుపెట్టాయి. జగ్గయ్యపేటతో పాటు సమీపంలోని రామ్‌కో, అల్ట్రాటెక్ కర్మాగారాల నుంచి, నందిగామ నుంచి కూడా ఫైరింజన్లను తీసుకొచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు.

అదుపులోకి రాని మంటలు

మార్కెటింగ్ శాఖ అధికారులకు స్టోరేజీ యాజమాన్యం ఇచ్చిన గణాంకాల ప్రకారం 385 మంది రైతులు ఫిబ్రవరి నెలాఖరు వరకు 13,960 టిక్కీలు (బస్తాలు) ఇక్కడ నిల్వ ఉంచినట్టు తెలుస్తోంది. కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం మాత్రం 40 వేల టిక్కీలు ఉన్నట్టు చెబుతోంది. మార్కెట్ విలువ ప్రకారం రూ.15 కోట్ల విలువచేసే మిర్చి కోల్డ్ స్టోరేజీలో ఉన్నట్టు తెలుస్తోంది. సమాచారం తెలియగానే జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక మిగతా 8లో..

ఇక ఆధునిక ఐజీఎంఎస్

ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి అడుగులు



ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న పనులు

- తమకు అప్పగించాలని వీఎంసీకి శాప్ లేఖ
- జాతీయ క్రీడల నిర్వహణకు అనువుగా ఆధునికీకరణ
- రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్‌ల అభివృద్ధికి ప్రణాళిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌తో పాటు ఎన్నో రంజీ మ్యాచ్‌లు నిర్వహించిన నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం కొత్తరూపు సంతరించుకోనుంది. ఇప్పటివరకు భారీ సభల నిర్వహణకు, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలకు కేంద్రంగా ఉన్న ఈ స్టేడియాన్ని ఇకపై జాతీయ క్రీడలు నిర్వహించేందుకు వీలుగా అభివృద్ధి చేయాలని క్రీడాప్రాధికార సంస్థ (శాప్) అధికారులు భావిస్తున్నారు. అభివృద్ధి నిమిత్తం స్టేడియాన్ని తమకు అప్పగించాలని శాప్ అధికారులు విజయవాడ నగరపాలక సంస్థ అధికారులకు కొద్దిరోజుల క్రితం లేఖ కూడా రాశారు.

కౌన్సిల్‌లో చర్చ

ఆధునికీకరణ జరగాలంటే కార్పొరేషన్ అధికారులు స్టేడియాన్ని శాప్‌కు అప్పగించాలి. శాప్ రాసిన లేఖపై కొద్దిరోజుల క్రితం వరకు వీఎంసీ అధికారులు తర్జనభర్జన పడ్డారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్టేడియాన్ని శాప్‌కు అప్పగించేద్దామన్న అభిప్రాయాన్ని పలువురు కార్పొరేటర్లు వ్యక్తం చేశారు. అయితే, దీనిపై ఎలాంటి తీర్మానం చేయలేదు.

రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్‌లు

స్టేడియం ప్రస్తుతం నగరపాలక సంస్థ ఆధీనంలో ఉంది. గ్యాలరీలకు దిగువన ఉన్న గదులను వివిధ క్రీడా సంఘాలు ఉపయోగించుకుంటున్నాయి. స్టేడియం లోపల ఆడుకోవడానికి ప్రాంగణం, రన్నింగ్ ట్రాక్ సన్నాహాలు చేస్తోంది. ఇందుకు మిగతా 8లో..

పోలీసులకు చిక్కిన రంగా

- వల్లభనేని వంశీకి కుడిభుజం
- అరెస్టు చేసిన సీఐడీ

8లో

కౌన్సిల్ రసాభాస

కండ్రిక-పాయకాపురం సర్కిల్‌కు రంగా పేరుపై వాడివేడిగా చర్చ

- వాటర్ ప్లాంట్ పునరుద్ధరణపై ఇరుపక్షాల వాగ్వాదం
- ఎమ్మెల్యే రాకుండా ప్రతిపాదనలు ఏమిటని వైసీపీ ప్రశ్నలు
- ప్రతిఘటించిన టీడీపీ కార్పొరేటర్లు
- మంచినీటి, ఆస్తిపన్ను, దోమల సమస్యలపై అధికారుల నిలదీత
- పారిశుధ్య పర్యవేక్షణ, సిబ్బంది తీరుపై ఆగ్రహం
- అధికారులపై అధికార, ప్రతిపక్షాల మూకుమ్మడి దాడి



కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల వాగ్యుద్ధం

కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వీఎంసీ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వంగవీటి మోహనరంగా నగరాభివృద్ధికి చేసిన కృషికి చిహ్నంగా కుందావారి కండ్రిక-పాయకాపురం సర్కిల్‌కు వంగవీటి మోహనరంగా సర్కిల్‌గా నామకరణం చేయాలనే ప్రతిపాదనను వైసీపీ ట్రాఫిక్ కమిటీ రిఫర్ చేయడంపై టీడీపీ అభ్యంతరం తెలిపింది. గతంలో వైసీపీ ఎమ్మెల్యే పెట్టిన ప్రతిపాదనలు ఇలాగే ట్రాఫిక్ కమిటీకి పంపించారా.. అంటూ ప్రశ్నించగా, ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఎన్టీఆర్ సృజల స్రవంతి వాటర్ ప్లాంట్‌కు సంబంధించి గతంలో ఉన్న సింగ్‌నగర్‌లో పునరుద్ధరణ పనులు చేసుకునేందుకు స్థానిక కార్పొరేటర్ ప్రతిపాదన పెట్టగా, అధికార వైసీపీ.. గతంలో అక్కడి నుంచి తొలగించాలని ఆమోదించిన దానినే అమలు చేస్తూ తీర్మానం చేయడంపై పలువురు టీడీపీ కార్పొరేటర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో వైసీపీ ఎమ్మెల్యే అడ్డగోలుగా ప్రతిపాదనలు పెట్టినా ఆమోదించుకున్నారని, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రతిపాదనలు పెడితే, వాటిని ఆమోదించకుండా ట్రాఫిక్ కమిటీలకు రిఫర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం వీఎంసీలో కౌన్సిల్ సమావేశం మిగతా 8లో..

పారిశుధ్యంపై గరంగరం

నగరంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, సచివాలయ సెక్రటరీలకు మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇలా జరిగిందని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య అధికారులతో పాటు కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎవరికి నచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నారని, కమిషనర్ స్పందించి పారిశుధ్య సిబ్బందిని పెంచడంతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలపై దృష్టిసారించి పారిశుధ్య పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు.

అవినీతికి సహకారం

గోకవరం పీఏసీఎస్‌లో రూ.కోటి గోల్‌మాల్

రైతులు చెల్లించిన రుణాలు హాంఫట్

పేర్ని నాని ముఖ్య అనుచరుడు, ఓ సీఈవో అక్రమాలు

- రైతుల ఆగ్రహం.. 51 విచారణ జరపాలని డిమాండ్
- విషయం బయటపెట్టిన సూపర్‌వైజర్‌పై దాడికి యత్నం
- చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు
- విచారణ చేయకుండా పోలీసుల జాప్యం

మచిలీపట్నం మండలం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో కోటి రూపాయలకు పైగా గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. రైతులు రుణాలను చెల్లించినప్పటికీ.. ఇంకా బకాయిలుగా రికార్డుల్లో చూపడం వివాదాస్పదమవుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన పీఏసీఎస్ అధ్యక్షుడు, మాజీమంత్రి పేర్ని నాని ముఖ్య అనుచరుడితో పాటు పీఏసీఎస్ సెక్రటరీ (సీఈవో) ఈ అక్రమాలకు కారణమని రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మూడెకరాల భూమి రైతు పేరున ఉంటే చాలు.. కేడీసీసీ బ్యాంకుకు అనుబంధంగా ఉన్న పీఏసీఎస్‌లలో లాంగ్‌టర్మ్‌గా రూ.25 లక్షల వరకు రుణం ఇస్తారు. మచిలీపట్నం మండలం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో అధిక శాతం మంది మిగతా 8లో..



8 నుంచి దుర్గగుడిలో చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు వెండి పల్లకీ సేవ
- 9న రథోత్సవం
- 13న ఉత్సవమూర్తుల నదీవిహారం

6లో

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

- రూ.15.65 లక్షల బంగారు, వెండి ఆభరణాలు
- ఆరు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-19 (బుధవారం సాయంత్రం)
సహర్ : 04-54 (గురువారం ఉదయం)

8 నుంచి దుర్గగుడిలో చైత్ర మాస కల్యాణ బ్రహ్మోత్సవాలు



ఇంద్రకీలాద్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఏప్రిల్ 8 నుంచి 13వ తేదీ వరకు ఆగమోక్తంగా దుర్గామల్లేశ్వర స్వామి వార్ల చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11 రాత్రి 7.30 గంటలకు సుప్రసిద్ధ కవి పండితుల చేత రాయబార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో గంగా, పార్వతీ, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను రోజుకో వాహనంపై ఊరేగిస్తారు. 8వ తేదీ ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు చేయించి వధూవరులుగా అలంకరించి సిద్ధం చేస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీప స్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 13వ తేదీ ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకుట్నోత్సవము, వసంతోత్సవం, అవబృథ స్నానం, మూకబలి, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తి అవుతాయి. అదేరోజు సాయంత్రం గంగా, పార్వతీమల్లేశ్వరుల ఉత్సవమూర్తుల నదీ విహార కార్యక్రమం జరుగుతుంది. 14 సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ కార్యక్రమాలు, 15వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఏకాంత పవళింపు సేవలు ఉంటాయి.

● 8వ తేదీ వెండి పల్లకి సేవ కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమల విలాస్ సెంటర్, సామారంగం చౌక్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ ద్వారా సాగుతుంది. 9వ తేదీ వెండి రథోత్సవం, 10వ తేదీ రావణ వాహన సేవ, 11వ తేదీ నంది వాహన సేవ, 12వ తేదీ సింహ వాహన సేవ, 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉత్సవ మూర్తుల నదీ విహారం కొనసాగుతుంది. స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.1,116లు రుసుము చెల్లించి పాల్గొనవచ్చు. శేష వస్త్రం, రవికె, అమ్మవారి శ్రీచక్రపీఠం, పెద్ద లడ్డు, ప్రసాదంతో పాటు ఇరువురికి కళ్యాణానికి ముందుగానే ముఖమండపం నుంచి అమ్మవారి దర్శనం కల్పిస్తారు. కళ్యాణోత్సవం రాత్రి 12.30 గంటలకు ప్రారంభమవుతుంది.

భూసార పరీక్షతో ఏపీలో 1.42 కోట్ల మంది రైతులకు లబ్ధి

» కేంద్ర సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్

వన్‌టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నేల ఆరోగ్యం, విత్తనోత్పత్తి పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మట్టి నమూనాలను పరీక్షించి, రైతులకు భూసార పరీక్ష కార్డులు (సాయిల్ హెల్త్ కార్డులు, ఎస్‌హెచ్‌సి) పంపిణీ చేస్తుంది. ఇప్పటి వరకు ఏపీలో భూసార నిర్ధారణ నిమిత్తం 38,58,795 మట్టి నమూనాలను పరీక్షించగా 1,42,57,644 మంది రైతులకు లబ్ధి చేకూరిందని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాల వారీగా వచ్చిన ప్రతిపాదనల ప్రస్తుత పరిస్థితిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంటు సమావేశాల సందర్భంగా లోక్‌సభలో మంగళవారం అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 5 రాష్ట్రాలకు కొత్తగా 25 మొబైల్ భూసార పరీక్షా ప్రయోగశాలలు మంజూరయ్యాయని, బీహార్‌కు 10, మధ్యప్రదేశ్‌కు 9, మహారాష్ట్రకు 2, తెలంగాణకు 2, త్రిపురకు 2 మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్ సందర్శన



పార్లమెంట్‌లో ఏపీ గిరిజన సహకార సంఘం ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్స్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సందర్శించారు. స్టాల్స్ సిబ్బందితో అరకు కాఫీకి దక్కుతున్న ఆదరణ గురించి అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రదేశంలో అరకు కాఫీ అందుబాటులోకి రావడం గిరిజన సమాజానికి లభించిన గొప్ప గౌరవమన్నారు.

చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మరొకరి అరెస్టు

ఇబ్రహీంపట్నం : చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ఉండవల్లిలోని ఆయన నివాసంపై దాడి చేసిన కేసులో ఇబ్రహీంపట్నంకు చెందిన మడుపల్లి ఆనంద్‌ను సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కేసులో మరికొంతమంది ఇబ్రహీంపట్నంకు చెందిన వ్యక్తులు ఉండగా వారు రేపు స్వయంగా వచ్చి లొంగిపోతామని చెప్పినట్టు తెలిసింది. ఆనంద్ గత వైసీపీ ప్రభుత్వంలో జోగి ప్రధాన అనుచరుడిగా కొనసాగుతూ చంద్రబాబు ఇంటి మీదకు దాడికి వెళ్లాడు. 2024 ఎన్నికల్లో వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆనంద్ టీడీపీలో చేరారు. ప్రస్తుతం అతను టీడీపీలో కొనసాగుతున్నాడు. అయితే ఈ కేసులో అరెస్టు అయిన కొందరు బెయిల్‌పై ఉన్నారు. ఆనంద్ అరెస్టుతో కేసులో ఉన్నవారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

నారా లోకేశ్‌కు అమెరికా తెలుగు సంఘం ఆహ్వానం

పటమట : ఈఏడాది జూలై 4 నుంచి 6.వ తేదీ వరకు అమెరికాలోని ఫ్లోరిడాలో జరగబోయే 8.వ అమెరికా తెలుగు సంబరాల్లో పాల్గొనాలని కోరుతూ మంగళవారం నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాక్) ప్రతినిధులు ఏపీ ఐటీ, మానవవనరులశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. నాక్ కాన్ఫరెన్స్ కన్వీనర్ గుత్తికొండ శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్, ఏపీ టెక్నాలజీ సర్వీసు చైర్మన్ మన్నం మోహన కృష్ణలు లోకేష్‌ను ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

1 నుంచి 'సదరం స్లాట్స్' పునఃప్రారంభం

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సదరం స్లాట్స్‌ను ప్రభుత్వం పునఃప్రారంభించనుంది. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్స్ బుకింగ్‌కు అవకాశం కల్పించింది. ఈ మేరకు సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దివ్యాంగుల పింఛను సర్టిఫికెట్ వెరిఫికేషన్ కారణంగా ప్రభుత్వం జనవరిలో సదరం క్యాంప్‌లకు స్లాట్స్‌ను నిలిపివేసింది. దీంతో కొత్తగా సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దివ్యాంగ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం పరిస్థితిని సమీక్ష నిర్వహించింది. ఒకవైపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తో పాటు క్యాంపులు నిర్వహించి అర్హులైన దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఏప్రిల్ 1 నుంచి స్లాట్స్ బుకింగ్‌కు అవకాశం కల్పించింది. ప్రతి మంగళవారం ఎంపిక చేసిన ఏరియా, జిల్లా, బోధనాసుపత్రుల్లో స్లాట్స్ అందుబాటులో ఉంటాయని, అర్హులైన వారు బుక్ చేసుకోవాలని సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి తెలిపారు.

మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ప్రసన్న వెంకటేశ్

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న కె.హర్షవర్ధన్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రసన్న వెంకటేశ్‌ను నియమించడంతో పాటు ఎస్సీ కమిషన్ కార్యదర్శిగా కూడా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

మార్కెట్ కళకళ.. మార్క్‌ఫెడ్ వెలవెల!



» కొనుగోలు కేంద్రాల ముఖం చూడని శనగ రైతులు
» నిబంధనలే ప్రతిబంధకాలు!
» గిట్టుబాటు ధరలో వ్యత్యాసం లేక పోవడంతోనే మార్కెట్లో విక్రయాలు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక (ఫైల్ ఫోటో)

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

మద్దతు ధరతో సమానంగా బయట మార్కెట్లో ధర లభిస్తుండటంతో శనగ రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం వైపు కన్నెత్తి చూడటం లేదు. కేంద్రం తెరిచి వారం రోజులైనప్పటికీ రైతులు మార్క్‌ఫెడ్‌కు ఒక్క గింజ కూడా అమ్మలేదు. రైతులందరూ ప్రైవేట్ వ్యాపారులకు శనగలు విక్రయిస్తుండటంతో కొనుగోలు కేంద్రం వెలవెలబోతోంది. నందిగామ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో 85 వందల ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగుచేశారు. ఎకరానికి నగటున రూ. 30 వేల నుంచి రూ. 35 వేలవరకు పెట్టుబడి పెట్టారు. పైరు పూత, పిందె దశలో ఉన్నప్పుడు కురిసిన కొద్దిపాటి జల్లులకు పంట దెబ్బతిన్నది. దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి పది క్వింటాళ్ల రావాల్సిన దిగుబడి ఐదారు క్వింటాళ్లకు మించి రాలేదు. శనగలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 5,650లు. కొద్ది రోజుల క్రితం శనగ పంట కోతలు పూర్తయ్యాయి. నాణ్యత బాగుండటంతో వ్యాపారులు క్వింటా రూ. 55 వందల వంతున కొనటం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న స్థానిక మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని డీఎం కె.నాగమల్లిక ప్రారంభించారు. వారం రోజులు గడిచినప్పటికీ రైతులెవరూ కొనుగోలు కేంద్రం వైపు చూడటం లేదు. బయటి మార్కెట్లో వ్యాపారులు రూ. 56 వందలకు కొంటున్నందున రైతులు మార్క్‌ఫెడ్‌కు అమ్మేందుకు ఆసక్తి చూపటం లేదు. దీనికితోడు కొన్ని నిబంధనలు ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. మార్క్‌ఫెడ్‌కు శనగలు అమ్మాలనుకున్న రైతులు ముందుగా సీఎం యాప్‌లో పేరు నమోదు చేయించుకోవాలి. తమకు కేటాయించిన తేదీల్లో సరుకు తీసుకువచ్చి కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాల్సి ఉంది. యంత్రాలతో నూర్పిళ్లు చేయించినందున మట్టి, రాళ్లు ఎక్కువగా ఉన్నాయంటూ, ఒకటికి రెండుసార్లు జల్లెడ వేయించి రాళ్లు లేకుండా చూడాలని మార్క్‌ఫెడ్ అధికారులు సూచిస్తున్నారు. మద్దతు ధరకు, బయటి ధరకు కేవలం రూ. 50లు మాత్రమే తేడా ఉండటంతో రైతులు వ్యాపారులకు అమ్ముతున్నారు. మున్ముందు ధర పెరుగుతుందన్న ఉద్దేశ్యంతో పలువురు రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. దీంతో కొనుగోళ్లు జరగకపోవటంతో కేంద్రం బోసిపోతున్నది.

ఈనెల 17న స్థానిక మార్కెట్ యార్డును సందర్శించిన డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీతను కలిసి మార్క్‌ఫెడ్‌కు శనగలు అమ్మే ప్రసక్తే లేదంటూ పలువురు రైతులు ముందుగానే చెప్పటం విశేషం. మద్దతు ధరకు అమ్మితే నష్టం తప్పితే రూపాయి కూడా మిగలదని రైతులు వివరించారు. సాగుకోసం శనగ విత్తనాలను 30శాతం రాయితీపై క్వింటా రూ.ఏడువేల వంతున విక్రయించిన ప్రభుత్వం ఇప్పుడు మద్దతు ధరకు కొనటం వల్ల నష్టం తప్పితే రూపాయి కూడా మిగలదని రైతులు పేర్కొంటున్నారు.

బ్యారక్‌లో ఒంటరిగానే వంశీ

» భద్రత దృష్ట్యా ఇతరులను అనుమతించం
» సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో న్యాయాధికారి స్పష్టీకరణ
» 8 వరకూ రిమాండ్ పొడిగింపు



విజయవాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌తోపాటు మిగిలిన నిందితులందరికీ రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. కిడ్నాప్ కేసులో నిందితులుగా ఉన్న వల్లభనేని వంశీ, వెలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్, నిమ్మ చలపతి, గంటా వీర్రాజు, వేల్పూరు వంశీల రిమాండ్ ముగియడంతో మంగళవారం వీరిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఏప్రిల్ 8వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తున్నట్టు న్యాయాధికారి హిమబిందు ఆదేశాలిచ్చారు. కోర్టుహాల్లోకి వచ్చిన తర్వాత... 'చెప్పుకోవాల్సింది ఏమైనా ఉందా?' అని వంశీని న్యాయాధికారి హిమబిందు అడిగారు. తనను జైల్లో ఒంటరిగా ఒక బ్యారక్‌లో పెట్టారని వంశీ చెప్పారు. బ్యారక్‌లోకి ఇతర ఖైదీలను కాకపోయినా తనతో పాటు అరెస్టయిన వారిలో ఒకరినైనా అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వెన్నునొప్పి కారణంగా కూర్చోవడానికి కుర్చీ ఏర్పాటు చేయాలని అడిగారు. బ్యారక్‌లోకి భద్రత దృష్ట్యా మరొకరిని అనుమతించలేమని స్పష్టం చేసిన న్యాయాధికారి... కుర్చీని ఏర్పాటు చేయాలని జైలు అధికారులకు ఆదేశాలిస్తామని తెలిపారు. కాగా, కోర్టు ఆదేశాలమేరకు దర్యాప్తు అధికారి విజయవాడ సెంట్రల్ ఏసీపీ కె.దామోదరరావు కోర్టుకు హాజరయ్యారు.

'దాడి' కేసులో బెయిల్‌పై తీర్పు రిజర్వ్

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తీర్పును సీఐడీ న్యాయస్థానం ఈనెల 27కి రిజర్వ్ చేసింది. ఈ కేసులో వంశీ 72వ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులోనూ ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన తర్వాత సీఐడీ అధికారులు పీటీ వారెంట్‌పై వంశీని కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ కేసులో రిమాండ్ విధించాక బెయిల్ మంజూరు చేయాలని సీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రాసిక్యూషన్, వంశీ తరఫున న్యాయవాది డాక్టర్ వి.దేవీసత్యశ్రీ కోర్టులో మంగళవారం వాదనలు వినిపించారు. వాదనలు విన్న అనంతరం తీర్పును ఈనెల 27వ తేదీకి రిజర్వు చేస్తున్నట్టు న్యాయాధికారి తిరుమలరావు వెల్లడించారు.

పెట్టమంటే ఒకటి.. పెట్టొద్దంటే మరోటి అంటారు

జైలు నుంచి వంశీతో పాటు మిగిలిన నలుగురు నిందితులను ఉదయం 10 గంటలకు ఎస్కార్టు సిబ్బంది కోర్టుకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు వారికి రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి హిమబిందు ఆదేశాలిచ్చారు. రికార్డులపై సంతకం చేసి ఆమె బెంచ్ దిగి చాంబర్‌కు వెళ్తుండగా ఎస్కార్ట్ సిబ్బంది న్యాయాధికారితో మాట్లాడారు. 'నిందితులకు ఇప్పటి వరకు భోజనం పెట్టలేదు. ఇక్కడ భోజనం పెట్టాక జైలుకు తీసుకెళ్లమంటారా? జైలుకు తరలించిన తర్వాత పెట్టమంటారా?' అని అడిగారు. 'పెట్టమంటే ఒకటి అంటారు, పెట్టొద్దంటే మరొకటి అంటారు' అని నవ్వుతూ వ్యాఖ్యానించి భోజనం పెట్టి జైలుకు తరలించమని ఎస్కార్ట్ సిబ్బందికి చెప్పారు.

కోర్టుకు హాజరైన దర్యాప్తు అధికారి

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో దర్యాప్తు అధికారిగా ఉన్న విజయవాడ సెంట్రల్ ఏసీపీ కె.దామోదరరావు కోర్టుకు హాజరయ్యారు. కొద్దిరోజుల క్రితం దర్యాప్తు అధికారి కోర్టుకు హాజరుకావాలని న్యాయాధికారి హిమబిందు ఆదేశించారు. వంశీ రిమాండ్ పొడిగింపునకు సంబంధించిన మెమోలను న్యాయాధికారి ముందు పెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎవరూ కోర్టు హాల్లోకి రాకపోవడంతో వాటిని పక్కన పెట్టారు. తర్వాత కాసేపటికి పటమట ఇన్‌స్పెక్టర్ పవన్‌కిశోర్ హాజరయ్యారు. భోజన విరామ సమయం కావడంతో న్యాయాధికారి బెంచ్ దిగి చాంబర్‌లోకి వెళ్లిపోయారు. న్యాయాధికారి బెంచ్ మీదకు వచ్చిన తర్వాత దర్యాప్తు అధికారి దామోదరరావు, ఆమె ముందు హాజరయ్యారు. 'రిమాండ్ పొడిగింపునకు మెమోను దాఖలు చేసినప్పుడు ప్రాసిక్యూషన్ తరఫున గానీ, పోలీసుల తరఫున గానీ ఎవరో ఒకరు హాజరుకావాలి కదా?' అని న్యాయాధికారి అన్నారు. ఇన్‌స్పెక్టర్ హాజరయ్యారని ఏసీపీ జవాబు ఇచ్చారు. 'కేసు దర్యాప్తు అధికారి ఇన్‌స్పెక్టర్ కాదు కదా? ఇక నుంచి ఇటువంటివి జరగకుండా చూసుకోవాలి' అని న్యాయాధికారి సూచించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు, చోరీ సొత్తు

రైళ్లలో చోరీ దొంగల అరెస్టు

» రూ.15.65 లక్షల ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

రైల్వేస్టేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులు, నగదు చోరీకు పాల్పడుతున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు రైల్వే పోలీసు అధికారి జేవీ రమణ తెలిపారు. ఈ మేరకు విజయవాడ స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా, నిజాం పేటలోని శ్రీనివాసమ్ అపార్టుమెంట్‌లో కుటుంబసభ్యులతో నివాసం ఉంటోన్న గుడిమెంట్ల భానుప్రియ హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. సామర్లకోటలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి ఆమె కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 13న గౌతమీ ఎక్స్‌ప్రెస్ (12738 కోచ్ నెం.ఎస్1, బెర్త్ నెం.65)లో బయలుదేరింది. రాయనపాడు వద్దకు వచ్చేసరికి ఆభరణాలు, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను భద్రపరచిన బ్యాగ్ చోరీకి గురైంది. బాధితురాలు ఈనెల 16న జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన బి.టెక్ చదివి వ్యసనాలకు బానిసైన పుచ్చకాయల నరేష్ (25) అదే గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు షేక్ హైమద్ (25) చోరీకి పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో నిందితులు ఉన్నట్టు సమాచారం తెలుసుకుని సోమవారం అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.15లక్షల 65వేల విలువ చేసే 217 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ ఆలీబేగ్, ఎస్ఐ మఫత్‌లాల్ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు. నిందితులపై ఖమ్మం, విజయవాడ గవర్నర్‌పేట స్టేషన్లలో కేసులు ఉన్నట్టు సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో గ్యాంగ్ వార్ పండు

» 22 కిలోల గంజాయితో చిక్కిన రౌడీషీటర్
» రాజమండ్రి నుంచి విజయవాడ తరలిస్తుండగా దాడి
» మరో ముగ్గురు అనుచరుల అరెస్టు.. రిమాండ్



కేటీఎం పండు

పెనమలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ గ్యాంగ్‌వార్‌లో ప్రధాన నిందితుడు కేటీఎం పండు పోలీసులకు పట్టుబడ్డాడు. 22కిలోల గంజాయి తరలిస్తూ పెనమలూరు పోలీసులకు చిక్కాడు. అతడి అనుచరులు మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో పెనమలూరు పోలీసులు ఎస్ఐ రమేష్ నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఓ ఆటోలో కేటీఎం పండు పోలీసుల కంటపడ్డాడు. అతడి నుంచి రూ.లక్షకు పైగా విలువచేసే 22కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పండుతో పాటు యనమలకుదురు గ్రామానికి చెందిన నరేలా రామారావును, వీరికి సహకరించిన కొక్కిలిగడ్డ పవన్‌కుమార్, రాజుపై కేసులు నమోదు చేశారు. రాజమండ్రి నుంచి విజయవాడకు గంజాయిని విక్రయించేందుకు తరలిస్తునట్టు విచారణలో పండు తెలిపినట్టు పోలీసులు వెల్లడించారు. ఆటోలో ఉన్న ఎనిమిది బ్యాగులు, నాలుగు ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అలాగే తాడిగడప డొంకరోడ్డులోని ఒక క్రికెట్ నెట్ వెనుక పోలీసులకు అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా గంజాయి పంచుకొంటున్న ముగ్గురు పండు అనుచరులు కళింగపట్నం మనోహర్, మారుబోయిన నాగరాజు, ఉసురుమోతు పవన్‌కళ్యాణ్‌లు పట్టుబడ్డారు. వారి నుంచి తొమ్మిదివేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి కార్యకలాపాలు..!

విజయవాడ గ్యాంగ్‌వార్‌లో ప్రధాన నిందితుడు, పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేటీఎం పండు తన కార్యకలాపాలను గంజాయి వ్యాపారంలోకి మార్చుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. గత ఏడాది ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లలో బీరు సీసాతో యువకుడిపై దాడికి తెగబడ్డ పండుపై పోలీసులు పీడీ యాక్టు మోపి రిమాండుకు తరలించారు. అనంతరం కనిపించకుండా పోయిన పండు అనుచరులతో కలిసి డబ్బు సంపాదన కోసం గంజాయి వ్యాపారంలోకి దిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.



కొండగట్టు వద్ద అక్రమ క్వారీ, పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు

మట్టి లారీలు స్వాధీనం

» వైసీపీ సర్పంచ్‌పై కేసు నమోదు

ఎ.కొండూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఏడాది నుంచి యథేచ్ఛగా జరుగుతున్న మట్టి తరలింపుపై ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. మండలంలోని గోపాలపురం, గొల్లమందల గ్రామ రెవెన్యూ పరిధిలోని కొండగట్టు ప్రాంతం నుంచి మట్టి తరలిస్తున్న మాఫియాపై గతంలో 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించింది. అర్ధరాత్రి సమయంలో గోపాలపురం వైసీపీ సర్పంచ్ కోలా శ్రీను, కొందరు పెద్దల అండతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లారీకి రూ. 8వేలు నుంచి 9 వేల వరకు.. దూర ప్రాంతాలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు వసుళ్లు చేస్తున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వైసీపీ నేతలు కొందరు అధికార పార్టీ నేతలు కలిసి భారీగా మట్టి మాఫియాతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ధనం దోచుకుంటున్నారు. మంగళవారం రాత్రి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా ఎ.కొండూరు ఎస్ఐ చల్లా కృష్ణ సిబ్బందితో దాడిచేయగా మూడు లారీలు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. లారీలను స్టేషన్‌కు తరలించారు. వైసీపీ సర్పంచ్ కోలా శ్రీను, డ్రైవర్లు బత్తుల శ్రీనివాస్, వేములకొండ శ్రీనివాస్, మాళావతు కిషోర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వంశీ కస్టడీ పిటిషన్‌పై వాదనలు నేడు

గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ పిటీషన్‌పై వాదనలను న్యాయాధికారి బుధవారానికి వాయిదా వేశారు. ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన రైల్వే కాంట్రాక్టర్ శనగల శ్రీధర్‌రెడ్డి ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు అతని అనుచరుల మీద కేసు పెట్టారు. ఫోర్జరీ సంతకాలు చేసి, బెదిరించి, కుట్రపూరితంగా నకిలీ పత్రాలు సృష్టించి ఒకరి భూమిని మరొకరి చేతుల్లో పెట్టి తనకు చెందాల్సిన ఆస్తిని దక్కకుండా అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే వంశీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఏప్రిల్ 1 వరకు గన్నవరం కోర్టు రిమాండ్ విధించింది. దీంతో ఆత్కూరు పోలీసులు వల్లభనేని వంశీని ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని గన్నవరం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. నిందితుడి నుంచి కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు కస్టడీ కోరగా న్యాయమూర్తి ఇరుపక్షాల వాదనలు వినేందుకు వాయిదా వేశారు. బుధవారం వాదనలు జరగనున్నాయి.

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

» అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కూడా: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం వారికి సూచించారు.

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై న్యాయ వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. వారికి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'

» కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్'(కేర్) పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఇందులో ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 405

వీఎంసీ చీఫ్ సిటీప్లానర్‌గా కె.సంజయ్ రత్నకుమార్

కార్పొరేషన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్‌గా కె.సంజయ్‌రత్నకుమార్ బదిలీపై రానున్నారు. ఈ మేరకు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. సంజయ్ రత్నకుమార్ విశాఖపట్నం వీకేపీసీపీఐఆర్‌యూడీఏలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తూ నగరానికి బదిలీపై వస్తున్నారు. వీఎంసీ చీఫ్ సిటీప్లానర్‌గా పని చేసిన అడిషినల్ డైరెక్టర్, చీఫ్ సిటీప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ మాస్టర్ ప్లాన్ సెల్ యూడీఏ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ మంగళగిరికి బదిలీ అయ్యారు.

పార్క్ చేసి వదిలేశారు







వాహన యజమానులు వినియోగంలో లేని వారి కార్లను ప్రధాన కూడళ్లలో, స్కూల్ పక్కన, పబ్లిక్ ప్రదేశాల్లో కొన్ని నెలలుగా వదిలేయడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దర్శిపేట జంక్షన్‌లో, ఎన్ఎస్ఎఫ్ గోడ పక్కన అంబేడ్కర్ నగర్ వెళ్లే దారిలో, అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద శిథిలమైన కార్లు ఉన్నాయి. వీటిని అసాంఘిక శక్తులు వారి అడ్డాగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. దోమలకు, విష కీటకాలకు ఆవాసాలుగా మారే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. పోలీస్‌శాఖ వారు స్పందించి శిథిలమైన కార్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

-పటమట, ఆంధ్రజ్యోతి

సంక్షేమ పథకాల ఘనత టీడీపీదే

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రభుత్వాసుపత్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం ఆరాటపడే ఏకైక పార్టీ టీడీపీ అని, ఎన్టీఆర్ నాటి నుంచి చంద్రబాబు వరకు అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తున్న ఘనత టీడీపీదే అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 2వ డివిజన్ మాచవరం డౌన్ ఆర్ఆర్ చికెన్ సెంటర్ ఏరియాలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా నిరుపేద కుటుంబాలకు చెందిన నలుగురు పార్టీ కార్యకర్తలకు రూ.70 వేలు విలువగల టిఫెన్ బండి, మూడు తోపుడు బండ్లను ఆయన అందించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ పూడిక తీయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దాసరి గాబ్రియల్, నుగసాని కృష్ణ ప్రసాద్, ముత్యాలకృష్ణ, ఎలిసెల సురేష్, ఎ.కరుణకుమారి, నుగసాని రత్నశ్రీ, షేక్ షకీలా, జి.నాగుల్‌మీరా, అనుమోలు పూర్ణచంద్రరావు, కృష్ణ, వల్లభనేని సతీష్, సురేష్, శ్రీహరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పాయకాపురంలో వీఎంసీ కమిషనర్ పర్యటన

పాయకాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకాష్‌నగర్‌లోని మోడరన్ ఫిష్ మార్కెట్, రాజీవ్ నగర్‌లోని వృద్ధాశ్రమాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం పాయకాపురంలో పర్యటించారు. మోడరన్ ఫిష్‌మార్కెట్, వృద్ధాశ్రమాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండాచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

యూనియన్ బ్యాంక్ లోన్ పాయింట్ ప్రారంభం



కొత్త బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న యూబీఐ జీఎం, ఎస్ఎల్‌బీసీ ఏపీ కన్వీనర్ సీవీఎస్ భాస్కరరావు, తదితరులు

భారతీనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైల్ లోన్ పాయింట్ కొత్త బ్రాంచ్‌ను గురునానక్ నగర్‌లోని మెక్‌డొనాల్డ్ రోడ్డులో మంగళవారం ప్రారంభించారు. యుబీఐ జనరల్ మేనేజర్, ఎస్ఎల్‌బీసీ ఏపీ కన్వీనర్ సీవీఎస్ భాస్కరరావు జ్యోతి వెలిగించి ఈ బ్రాంచ్‌ను ప్రారంభించారు. గృహరుణాలు, విద్యారుణాలు, తనఖా రుణాలు, వాహన రుణాల నిమిత్తం విజయవాడ ప్రాంతంలోని 73శాఖలకు ఇది ఒక ప్రాసెసింగ్ కేంద్రంగా ఉంటుంది. యూనియన్ బ్యాంక్ ప్రస్తుతం అతి తక్కువ వడ్డీ రేటు, ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా గృహరుణాలను, వాహన రుణాలను అందిస్తోంది. నగర వినియోగదారులు ఇప్పుడు ఈ కేంద్రాన్ని నేరుగా సంప్రదించి, వేగవంతమైన సేవను పొందే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో రీజియన్ రీజినల్ అధినేత ముప్పల శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.





స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

లబ్బీపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గోవిందనామస్మరణతో భక్తులు తన్మయత్వం పొందారు. శ్రావణ నక్షత్రం సందర్భంగా లబ్బీపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 102మంది దంపతులు పుష్పాలు పట్టుకుని ప్రదర్శనగా ఆలయానికి చేరుకోగా, ముత్యాల తలంబ్రాలు, వివిధ రకాల పుష్పాలతో భక్తిశ్రద్ధలతో పుష్ప యాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవిందనామ స్మరణలతో మార్మోగింది.

అనంతరం అన్నసమారాధన నిర్వహించారు, ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు పోలిశెట్టి పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు, గొంట్లా రామమోహనరావులు పర్యవేక్షించారు.



తిమ్మరాజు అప్పారావుకు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

తిమ్మరాజు అప్పారావుకు ఘన నివాళి

రామలింగేశ్వరనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వర నగర్‌లోని తిమ్మరాజు అప్పారావు గ్రంథాలయం వద్ద అప్పారావు 44వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ ఆయన సేవలతో ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఈడే ప్రసాద్, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.ఆర్.ఆంజనేయులు, బీట్ర ధనరాజు, లంక ప్రసాద్, త్రిమూర్తులు, అప్పారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరసన

● ఎన్ఎంయూ ● దీర్ఘకాల సమస్యలపై సెంట్రల్ కమిటీ చర్చ

బస్‌స్టేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థలో దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఏప్రిల్ 2, 3 తేదీల్లో బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఏపీ సెంట్రల్ కమిటీ నిర్ణయించింది. సెంట్రల్ కమిటీ సమావేశంలో మంగళవారం గూగుల్ మీట్ ద్వారా జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్ర రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకట రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై సెంట్రల్ కమిటీ చర్చించిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం వేచి చూసినా ఫలితం దక్కని పక్షంలో ఆందోళనలకు సమాయత్తమవుతామని తెలిపారు. 2019లో ఇచ్చిన జీ.ఓ1ను నిలుపుదల చేయాలని, సిక్‌లో ఉన్న కాలానికి తప్పనిసరిగా వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు ప్రతి ఆరునెలలకు ఒకసారి సంస్థ ద్వారా ఉచిత మెడికల్ చెకప్‌లు చేయించాలని, అవసరమైతే వైద్యం, శస్త్ర చికిత్సలు చేయించాలని కోరారు. అర్హులైన ఉద్యోగులకు నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ.300లకు పెంచాలన్నారు. పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు

స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్రీడలలో భాగస్వామ్యం కావాలని, క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి ఎంతో దోహదం చేస్తాయని స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ అన్నారు. కానూరులోని స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సెకండ్ ఏపీ స్టేట్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 281మంది క్రీడాకారులు హాజరుకాగా, వివిధ కేటగిరీలలో మొత్తం 7రౌండ్స్ జరిగాయి, అనంతరం విజేతలకు రూ.40వేల నగదు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ ప్రెసిడెంట్ జె.సౌజన్య, ఎఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, ఆంధ్రచెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ఎం ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నిందితులకు జైలు

గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దోపిడీ కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముస్తాబాద శివారు రిలయన్స్ గోదాము వద్ద గతేడాది ఆగస్టు 26న రాత్రి కుక్కల వెంకటేశ్వర్లు తన మరదలతో కలసి విజయవాడ వైపు నుంచి వస్తున్నారు. వారిని నలుగురు వ్యక్తులు బెదిరించి వారి వద్ద నున్న బంగారు నగలు, ఫోన్ బలవంతంగా తీసుకుని పారిపోయారు. బాధితుడు గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. విజయవాడకు చెందిన పాలపర్తి వెంకన్న, నల్లగొండ సురేష్, నక్కా గోపిలను నిందితులుగా గుర్తించి గన్నవరం 8వ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం సాక్షులను విచారించగా నేరం రుజు వు కావటంతో ముగ్గురి కి మూడేళ్ల జైలు, రూ.వె య్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నాలుగవ ముద్దాయి కట్టా దుర్గారా వు అరెస్టు పెండింగ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

షిర్డి సాయిబాబాకు నదీ జలాభిషేకం



ఇబ్రహీంపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి సాయిపురం కాలనీలో శ్రీషిర్డి సాయిబాబా మందిర వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం బాబాను కృష్ణానది జలాలతో అభిషేకం చేసినట్లు ఆలయ అధ్యక్షుడు రావూరి కిషోర్ తెలిపారు. ఈనెల 25 నుంచి 27 వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, కోశాధికారి తుమ్మల రంగారావు, జాయింట్ సెక్రటరీ నంబూరి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు కాజ కృష్ణారావు, దేవినేని రామయ్య, మన్నెం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నికల నిమిత్తం ఓరియంటేషన్ ప్రోగ్రాం

గ్రామ పంచాయతీ జిల్లా అధికారి లావణ్యకుమారి



కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి లావణ్యకుమారి ఈ నెల 27న జరుగనున్న ఉపసర్పంచ్ ఎన్నికల నిమిత్తం మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ కార్యాలయంలో నిర్వహిం చారు. ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగు గ్రామ పంచాయతీల ప్రిసైడింగ్ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారి హాజరై ఓరియంటేషన్‌లో, సూచనలు, సలహాలు ఎలా నిర్వహించాలి అనే అంశాలపై డివిజనల్ పంచాయతీ అధికారి జీఎల్ఎల్‌వీఎన్ రాఘవన్ సూచనలు సలహాలు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో జి.కొండూరు మండలం కట్టుబడిపాలెం వత్సవాయి మండలం మంగొలు, ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం,విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ఉపసర్పంచ్ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్నాయని జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్యకుమారి తెలిపారు.

ఎండిన చెట్లకు మంటలు

తప్పిన భారీ ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లబ్బీపేట మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎండిన చెట్లకు ఒక్కసారిగా మంటలు అంటుకోగా స్పందించిన స్థానికులు మంటలు అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. లబ్బీపేటలోని విద్యుత్ ఉపకేంద్ర వద్ద బందరుకాలువ ఒడ్డున మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఎండిన చెట్లు, ఆకుల నుంచి మంటలు వ్యాపించాయి. వీటిని గమనించిన సమీపంలోని జీఆర్టీ హోటల్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలు మరింత వ్యాపించకుండా నియంత్రించారు. దీనితో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక జిల్లా శాఖ సహాయధికారి కె.వినయ్‌కుమార్ సిబ్బందితో మంటలను పూర్తిగా నియంత్రించారు. అయితే మంటలు మరింతగా వ్యాపించి ఉంటే పక్కనే ఉన్న విద్యుత్ ఉపకేంద్రానికి ప్రమాదం జరిగేది. స్థానికులు స్పందించి అదుపు చేయడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

గవర్నర్‌పేట,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోరుతూ 28న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ముఠా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. సీపీఎం, సీఐటీయూ, ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గవర్నర్‌పేట అన్నపూర్ణ థియేటర్, ఆలీబేగ్ వీధి, ఫర్నిచర్ షాప్స్ సెంటర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇళ్లు లేని అందరికీ ఇస్తామని చెప్పి వాగ్దానం నెరవేర్చకుండానే అధికారాన్ని కోల్పోయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు సెంట్లు స్థలం నగరంలోనే ఇస్తామని చెప్పిందని, అధికారంలోకి వచ్చి 9 నెలలు నిండినా ఇంతవరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. కట్టిన ఇళ్లు కూడా లబ్ధిదారులకు అప్పగించడం లేదని, ఇంటికి రుణాలు చెల్లించమని బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, జిల్లా కమిటీ సభ్యుడు కె. దుర్గారావు, సీపీఎం నాయకుడు ఎం. సోమేశ్వరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నేతలు ఎం. బ్రహ్మయ్య, సీహెచ్ నరసింహులు, డి. తిరుపతయ్య, ఎం.గురవయ్య తదితరులు పెద్దన్న, పాల్గొన్నారు.



ముఠా కార్మికుల ర్యాలీ

ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

- ఈ నెలాఖరులోపు చెల్లిస్తేనే వర్తింపు..
- పురపాలకశాఖ ఉత్తర్వులు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను బకాయిలు మొత్తం ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీలో 50శాతం రాయితీ ప్రకటిస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఇంటి పన్ను, ఖాళీ స్థలాలపై పన్నులు సకాలంలో అంటే మొదటి అర్ధ సంవత్సరానికి జూన్, రెండో అర్ధ సంవత్సరానికి డిసెంబర్ లోపు పన్ను చెల్లించని వారు 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 31 లోపు పెండింగ్ బకాయిలు చెల్లించిన వారికి వడ్డీ బకాయిల్లో ఈ రాయితీ ప్రకటించింది. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, రూ.కోట్లలో పేరుకుపోయిన ఆస్తి పన్ను వసూలు కోసం ప్రభుత్వం రాయితీ నిర్ణయం తీసుకుంది.

పన్నుల పెంపుదలను నిలిపివేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో డిమాండ్

గవర్నర్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నుంచి ఆస్తి పన్నుతో సహా పన్నుల పెరుగుదలను నిలిపివేయాలని, క్యాపిటల్ విలువపై ఆస్తిపన్ను లెక్కించడానికి ఉద్దేశించిన సవరణ చట్టం-2020 తక్షణమే రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం ఎంజీ రోడ్డులోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సాంబిరెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నగరానికి చెందిన వివిధ సంఘాల నేతల సమావేశంలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సీహెచ్ బాబూరావు టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ ఆంజనేయులు పాల్గొన్నారు.

కోల్డ్ ఫైర్



కోల్డ్ స్టోరేజీ



డీప్ కూల్ చాంబర్

కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్వహణలో రాజ్యమేలుతున్న యాజమాన్యాల నిర్లక్ష్యం

- అమ్మోనియం గ్యాస్‌తో తరచూ అగ్ని ప్రమాదాలు, సరుకు బుగ్గిపాలు
- ఫైర్ ఎన్‌వోసీలు, కనీస రక్షణ చర్యలు లేకుండా నిర్వహణ
- ఎన్టీఆర్ జిల్లాలో 17 కోల్డ్ స్టోరేజీలు.. సింహభాగం నిబంధనలకు విరుద్ధం
- అగ్ని ప్రమాదాలు సంభవిస్తే.. అన్నదాతకు కడగండ్లు



కోల్డ్ స్టోరేజీలో ఉన్న మిర్చి

నందిగామ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్వహణలో యాజమాన్యాలు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 17 కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నాయి, ఒక్కొక్కటి సరాసరి లక్ష బస్తాల సామర్థ్యం కలిగి ఉన్నాయి. గతంలో చిన్న ఘటనలు జరిగినప్పటికీ, ఇటువంటి భారీ స్థాయిలో స్టోరేజ్ దగ్ధం కావడం ఇదే మొదటిసారి. అధికారులు, స్టోరేజ్ యాజమాన్యాలు ఇప్పటికైనా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. ఒక కోల్డ్‌స్టోరేజ్ అగ్నికి ఆహుతైతే నష్టం రూ.కోట్లలో ఉంటుంది. వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతారు. కోల్డ్‌స్టోరేజ్‌లలో అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణం యాజమాన్యాల నిర్లక్ష్యమైన నిర్వహణ. అమ్మోనియం గ్యాస్ ట్యాంకర్, పైప్‌లైన్ నిర్వహణలో అనుభవం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. గిడ్డంగులను శీతలపరిచే అమ్మోనియం గ్యాస్ అనేక సందర్భాల్లో ప్రమాదానికి దారితీస్తోంది. స్టోరేజ్ పక్కనున్న అమ్మోనియం ట్యాంక్ నుంచి గ్యాస్ పైప్‌లైన్ల ద్వారా ప్రవహించి లోపలున్న సరుకును చల్లగా ఉంచుతుంది. అయితే, అమ్మోనియం గ్యాస్ ట్యాంక్ లోపల ఉష్ణోగ్రత బయట ఉష్ణోగ్రత కంటే 7 డిగ్రీలు తక్కువగా ఉండాలి. లేదంటే సిలిండర్ పేలి మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. దీన్ని నివారించాలంటే అమ్మోనియం సిలిండర్‌పై గన్నీబ్యాగ్‌లు వేసి నిరంతరం నీటితో చల్లబరచాలి. ముఖ్యంగా వేసవిలో పూర్తి అప్రమత్తంగా ఉండాలి. నాణ్యమైన సిలిండర్ల వినియోగంతోనే ప్రమాదాలు తగ్గించవచ్చు.

అయితే, ఆర్థికభారం తగ్గించేందుకు స్టోరేజ్ యజమానులు నాసిరకం సిలిండర్లు వాడటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. అలాగే, పైప్‌ల ద్వారా ప్రవహించే గ్యాస్‌ను నిరంతరం చల్లబరచడం తప్పనిసరి. అయితే, చిల్లింగ్ ప్లాంట్ల నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు కూడా అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నాసిరకం వైరింగ్, స్విచ్‌బోర్డులు, విద్యుత్ హెచ్చుతగ్గులను నివారించే వ్యవస్థల లేమితో షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతుంది. స్టోరేజ్ నిర్మాణ సమయంలోనే పలు భద్రతా నిబంధనలు విధించబడతాయి. యాజమాన్యాలు వాటిని పాటించకుండా కేవలం 4 అగ్నిమాపక సిలిండర్లు, 4 ఇసుక బక్కెట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటాయి. వార్షిక తనిఖీల్లో అధికారులు యాజమాన్యాల నుంచి లంచం తీసుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు.

అన్నదాతలకు నష్టమే

కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణ సమయంలో బ్యాంకు రుణాలు తీసుకోవడం సాధారణం. రుణం ఇచ్చే బ్యాంకర్లు స్టోరేజ్‌కు బీమా చేయిస్తారు. ప్రమాదం జరిగితే యాజమాన్యానికి బీమా అందుతుంది. కానీ, స్టోరేజ్‌లో మిర్చి నిల్వ ఉంచిన రైతుల పరిస్థితి వేరుగా ఉంటుంది. రైతులు స్టోరేజ్‌లో మిర్చిని నిల్వ ఉంచినప్పుడు బీమా చెల్లించాలి. కానీ, ప్రమాదం జరిగితే బీమా కంపెనీలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర మాత్రమే చెల్లిస్తాయి. అయితే, మార్కెట్‌లో మిర్చి ధర ఎప్పుడూ మద్దతు ధర కంటే ఎక్కువగా ఉంటుంది. దీంతో రైతులకు పూర్తిస్థాయి నష్టపరిహారం అందదు.

యాజమాన్యాల నిరక్ష్యం

కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు రైతుల నుంచి అద్దెతో పాటు బీమా మొత్తాన్ని వసూలు చేస్తాయి. కానీ, కొంతమంది యాజమాన్యాలు స్టోరేజ్ మొత్తానికి పూర్తి బీమా చెల్లించినా, రైతుల సరుకుకు మాత్రం నామమాత్రపు బీమా చేస్తున్నారు. దీంతో దీంతో ప్రమాదం జరిగినప్పుడు యాజమాన్యానికి బీమా మొత్తం వస్తుంది, కానీ రైతులు మాత్రం పూర్తి నష్టాన్ని భరించాల్సి వస్తుంది. ఇందులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. యాజమాన్యాలపై సక్రమంగా నిఘా పెట్టి, పూర్తిస్థాయి భద్రతా నిబంధనలు అమలు చేయించాల్సిన అవసరం ఉంది.

కోల్డ్ స్టోరేజీల నిర్వహణపై యాజమాన్యాలు, అధికారులు సమర్థమైన చర్యలు తీసుకోవాలి. రైతులకు న్యాయం కల్పించేలా బీమా నిబంధనలను సవరించాలి. అగ్ని ప్రమాదాల నివారణకు సరైన భద్రతా ప్రమాణాలు అమలు చేసి, నిర్లక్ష్యపు నిర్వహణను అరికట్టాలి.

నిబంధనలు ఇలా ఉన్నాయి..?

ఉత్తమ ప్రమాణాలు కలిగిన వైరింగ్‌ను వినియోగించాలి. అధిక, తక్కువ ఓల్టేజ్ నియంత్రణ పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. గ్యాస్ లీకేజ్ డిటెక్టర్లు తప్పనిసరిగా ఉండాలి. ఆమ్మోనియా, ఇతర రిఫ్రిజిరేషన్ గ్యాస్ లీకులను తక్షణమే గుర్తించే అలారమ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. కార్మికులు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు వీలుగా స్పష్టమైన మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయాలి. నిరంతరం పరిశీలించే కెమెరాల వ్యవస్థ ఉండాలి. అనధికార వ్యక్తులు స్టోరేజ్ పరిసరాలలోకి రాకుండా నియంత్రణ పాటించాలి. కార్బన్ డయాక్సైడ్ లేదా ఫోమ్ ఆధారిత అగ్ని నివారణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పొగను గుర్తించే స్మోక్ డిటెక్షన్ సిస్టమ్ తప్పనిసరిగా ఉండాలి. ఆటోమేటిక్ తాప నియంత్రణ మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. విద్యుత్, యంత్రాలను రోజువారీ, వారానికి, నెలకొకసారి పరిశీలించాలి. పంటను రక్షించేందుకు బయో ఫ్రెండ్లీ పెస్ట్ కంట్రోల్ పద్ధతులు అవలంబించాలి. కలుషిత నీటిని శుద్ధి చేసేందుకు బయోలాజికల్ వేస్ట్ ట్రీట్మెంట్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రికల్, అగ్ని భద్రత, ఆహార భద్రత, వైద్య, ఆడిట్ శాఖల ద్వారా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. వీటితో పాటు ఎలిక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, వైద్యశాఖ, ఆడిట్, తదితర శాఖలు తరచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉంది.

క్రీడాయాప్ ప్రయోజనాలు తెలపండి

- క్రీడా సంఘాల నేతలతో శాప్ చైర్మన్ రవినాయుడు



విజయవాడ స్పోర్ట్స్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ రూపొందించిన ఆయా క్రీడా అసోసియేషన్లు ముందుకు తీసుకువెళ్లాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. మంగళవారం శాప్ కార్యాలయంలో క్రీడా సంఘాల నిర్వాహకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాయాప్ వలన కలిగే ప్రయోజనాలను క్రీడాకారులకు తెలియజేయాలని, వారికి పారదర్శకమైన సేవలందించేందుకే ఈ యాప్‌ను తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో శాప్ పకడ్బందీగా పనిచేస్తోందని, అలాగే అసోసియేషన్లు కూడా బలోపేతమవ్వాలని, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఒక రాష్ట్రంలో ఒక క్రీడకు సంబంధించిన అసోసియేషన్ మాత్రమే ఉండాలని, దానికనుగుణంగా అసోసియేషన్లు చర్యలు చేపట్టాలని, అసోసియేషన్లపై కోర్టుల్లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు, ఔత్సాహికులు, దాతలు ముందుకొచ్చి క్రీడలను, క్రీడాకారులను దత్తత తీసుకోవడంతో పాటు అవసరమైన నిధులను సమకూర్చేలా అసోసియేషన్లు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యోనెక్స్ కంపెనీ స్పాన్సర్‌షిప్ తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. శాప్ ఏవో ఆర్.వెంకటరమణ నాయక్, ఏపీ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రముఖ పారిశ్రామిక వేత్త

ఆలపాటికి నివాళులు



గవర్నర్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గోల్డ్‌స్పాట్ సత్యనారాయణ మూర్తి (గోల్డ్‌స్పాట్ మూర్తి) గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఆలపాటి సత్యనారాయణ మూర్తి (80) పార్థివదేహానికి పలువురు నగర ప్రముఖులు నివాళులర్పించారు. గుండెకు సంబంధించిన వ్యాధికి వైద్య చికిత్సలు తీసుకుంటూ సోమవారం రాత్రి హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు మంగళవారం హైదరాబాద్ నుంచి విజయవాడ సూర్యారావుపేటలోని ఆయన స్వగృహానికి తరలించారు. పలువురు నగర ప్రముఖులు, రాజకీయ నేతలు ఆలపాటి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గోల్డ్‌స్పాట్ మూర్తికి భార్య, ఇరువులు కుమార్తెలు. ది విజయవాడ బాట్లింగ్ కంపెనీని విజయవాడలో ప్రారంభించి గోల్డ్ స్పాట్, లింకా తదితర శీతల పానీయాలను బిస్లరీ సోడాలను తయారు చేసి జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసేవారు. విజయవాడ సిద్ధార్థ అకాడమి పాలకవర్గ సభ్యుడిగా ఉన్నారు. జీవిత కాలంలో అనేక సంస్థలకు, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాన్ని అందజేశారు. ఆయన అంతిమ సంస్కారాలను పెద్దల్లుడు ప్రకాష్ ఆర్ఫ్ అధినేత సిడీవీ సుబ్బారావు నిర్వహించారు.

కౌన్సిల్ రసాభాస

(5వ పేజీ తరువాయి)

జరిగింది. సమావేశం ప్రారంభంలో ప్రశ్నోత్తరాలపై జరిగిన చర్చలో టిడ్కో ఇళ్లు, ఆస్తి పన్నులు ఏ ప్రతిపాదికన వేస్తున్నారు.. తదితర అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది.

అధికారులపై మూకుమ్మడి దాడి

ఆస్తిపన్నుల వసూలు, మంచినీటి సమస్యలు.. తదితర అంశాలపై అధికార, ప్రతిపక్షాలు అధికారులపై మూకుమ్మడి దాడి చేశాయి. ప్రశ్నలతో అధికారులను ఇరకాటంలో పెట్టాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, వారిపై భారాలు వేసి వసూలు చేస్తున్నారని, కార్పొరేట్ కంపెనీలు రూ.కోట్ల బకాయిలున్నా పట్టించుకోవట్లేదని, పేద మధ్య తరగతి ప్రజలు ఆస్తిపన్ను బకాయి ఉంటే.. కుళాయి, డ్రెయినేజీ కనెక్షన్లు తొలగిస్తున్నారని కార్పొరేటర్లు మూకుమ్మడిగా అధికారులపై ధ్వజమెత్తారు. కొండ ప్రాంతాల్లోని ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందించలేకపోతున్నామని, ఏ ముఖం పెట్టుకుని పన్నులు కట్టించుకోవడంతో పాటు ఆలస్య రుసుం వసూలు చేస్తున్నారని, కార్పొరేటర్లుగా, ప్రజాప్రతినిధులుగా ప్రజల్లో తిరగలేకపోతున్నామని, ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించకుండా పన్నులకు వడ్డీ వేసి కట్టించుకోవడం ఏమిటని, కృష్ణానదీ చెంతనే ఉన్నా.. కొన్ని ప్రాంతాల్లో మంచినీరు అందక ప్రజలు అల్లాడుతున్నారని కమిషనర్, సంబంధిత అధికారుల తీరును కార్పొరేటర్లు ఎండగట్టారు.

ఆక్రమణలపై ఆగ్రహం

నగరంలో ఆక్రమణలు ప్రధాన సమస్యగా మారాయని, పట్టణ ప్రణాళిక అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని, దీంతో నిత్యం ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందని పలువురు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో వీధుల వెంబడి చిరువ్యాపారాలు చేసుకునే వారికి సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు వీధి విక్రయదారుల కమిటీని ఏర్పాటుచేసి కౌన్సిల్‌లో ప్రతిపాదన పెట్టారు. దీన్ని కార్పొరేటర్లు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. కమిటీలో అధికారులతో పాటు ప్రతి డివిజన్ కార్పొరేటర్ ఉండేలా చూడాలన్నారు. మొత్తం 19 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇందులో ఇద్దరు కార్పొరేటర్లు ఉన్నారని కమిషనర్ వివరించినా కార్పొరేటర్లు ఒప్పుకోలేదు.

నగరంలో దోమలు విజృంభిస్తున్నాయని, మందులు సక్రమంగా పిచికారీ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని పలువురు కార్పొరేటర్లు మేయర్ ద్వారా కమిషనర్‌కు వివరించారు. కుక్కల సమస్యను కూడా ప్రధానంగా చర్చించారు.

డిప్యూటీ మేయర్ ప్రతిపాదనపై అభ్యంతరం

15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ కట్ట రోడ్డుపై భారీ వాహనాలు ఇసుక లోడుతో ప్రయాణించడంతో రోడ్డు కుంగిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని, పైపులైన్లు పగిలిపోతున్నాయని, ఇటీవల ఆ వార్త.. తమ పార్టీకి చెందిన దినపత్రికలో వచ్చిందంటూ ప్రతిపాదన పెట్టడంపై టీడీపీ కార్పొరేటర్ ముమ్మనేని వెంకటప్రసాద్ అభ్యంతరం తెలిపారు. డిప్యూటీ మేయర్ స్థాయిని తగ్గించుకుని దినపత్రిక పేరు పెట్టడం ఏమిటని టీడీపీ కార్పొరేటర్లు ప్రశ్నించారు. దీనిపై కొద్దిసేపు ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది.

మిర్చి మంటలు

(5వ పేజీ తరువాయి)

చర్యలను పర్యవేక్షించారు. ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసులు, జిల్లా ఫైర్ ఆఫీసర్ జి.శంకర్రావులు దగ్గరుండి మంటలు నియంత్రించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈదురుగాలులు వీస్తుండటంతో మంటలు నియంత్రించటం కష్టంగా మారింది. భారీగా పొగలు రావటం, మిర్చి ఘాటుతో సహాయ చర్యలు చేసే సిబ్బందికి, అధికారులకు ఇబ్బందికరంగా మారింది. మంటలు ఎంతకూ నియంత్రణలోకి రాకపోవటంతో సెంటినీ కెమికల్ ఫ్యాక్టరీ నుంచి లిక్విడ్ కంప్రెస్సెడ్ కార్బన్ డై ఆక్సైడ్ ట్యాంకర్‌ను తెప్పించి, ఆ గ్యాస్ ద్వారా మంటలు నియంత్రించే ప్రయత్నాలు చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజీలోని రెండు చాంబర్లలో ఒక చాంబర్‌లోనే సరుకు ఉంది. అధికారులకు కోల్డ్ స్టోరేజీ షట్టర్లను ఓవైపు తొలగించి పంటను కాపాడాలని యత్నించినా సఫలం కాలేదు. లోపలకు పోకుండా ఘాటైన పొగలు, మంటలు కింద వరకు వ్యాపించాయి. సంఘటనాస్థలాన్ని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ తదితరులు సందర్శించారు. అక్కడ జరుగుతున్న నియంత్రణా చర్యలను సమీక్షించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఆదుకునేందుకు కృషి చేస్తామని వారంతా హామీ ఇచ్చారు.

కనిపించని యాజమాన్యం

మంటల గురించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన యాజమాన్యం తర్వాత కనిపించలేదు. రైతులు మంగళవారం ఉదయం ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. నందిగామ ఏసీపీ తిలక్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ పీ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు రైతులను శాంతింపజేశారు. కోల్డ్ స్టోరేజీలో తాము నిల్వ ఉంచిన సరుకు వివరాల పత్రాలను అందజేయాలని రెవెన్యూ అధికారులు కోరారు. కోల్డ్ స్టోరేజీ వద్దే ఓ క్యాంప్ ఏర్పాటుచేసి రైతుల వద్ద వివరాలు నమోదు చేస్తున్నారు.

మంటల ఘాటుకు అల్లకల్లోలం

జగ్గయ్యపేట చుట్టుపక్కల ఉన్న అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించి మంటలను అదుపు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. అగ్నిమాపక సిబ్బంది ఒక్కో అడుగు ముందుకు వేయడానికి ఎక్కువ సమయం పడుతోంది. స్టోరేజీ మొత్తం అరలు అరలుగా ఉండటం, అందులో ఉన్న మిర్చి మండుతూ ఉండటంతో ఘాటు ఎక్కువగా బయటకు వస్తోంది. మిర్చి మండటంతో అగ్నిమాపక సిబ్బంది ఒళ్లంతా మంటలు పుడుతున్నాయి. మరోపక్క ఘాటు తీవ్రత ఎక్కువగా ఉండటంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. అయినప్పటికీ మంగళవారం సాయంత్రానికి మంటలను కొంతవరకు అదుపు చేయగలిగారు. ఫైర్ టెండర్ల ద్వారా నీటిని బలంగా వెదజల్లినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో కీసర వద్ద ఉన్న సెంటినీ బయో స్పిరిట్స్ నుంచి లిక్విడ్ కార్బన్ డై ఆక్సైడ్ (సీవో2) ట్యాంకర్‌ను రప్పించారు. ఈ ట్యాంకర్‌లో ఉన్న వాయువు మొత్తం అయిపోయినా మంటలు మాత్రం అదుపులోకి రాలేదు. కోల్డ్ స్టోరేజీలో మంటలు అదుపులోకి రావడానికి మరో రెండు రోజుల సమయం పడుతుందని అగ్నిమాపక శాఖ సిబ్బంది చెబుతున్నారు. లోపల ఉన్న అగ్గిని ఆర్పడానికి బుధ, గురువారాల్లో ఆపరేషన్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇటీవలే రుణం తీసుకున్న యజమాని

కోల్డ్ స్టోరేజీ నిర్వాహకుడు, యజమాని రావూరి శ్రీనివాసరావు.. లోపల ఉన్న మిర్చిపంటను హామీగా పెట్టి బ్యాంకు నుంచి రుణం తీసుకున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్ధారించారు. సుమారు రూ.6.36 కోట్ల వరకు కొద్దిరోజుల క్రితమే బ్యాంకు నుంచి రుణం తీసుకున్నట్టు పేర్కొన్నారు. అసలు లెక్కలు తేల్చడం కోసం కోల్డ్ స్టోరేజీ వద్ద ఉన్న రికార్డులను మార్కెటింగ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. ఇలా బ్యాంకు నుంచి తీసుకున్న రుణం డబ్బును రైతులకు పంచాల్సి ఉంది. ఇంతలోనే అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదాలను నియంత్రించడానికి ఉండాల్సిన భద్రతా చర్యలు కూడా ఇక్కడ లేవని తెలుస్తోంది. కోల్డ్ స్టోరేజీకి సంబంధించిన బీమా గడువు నెల క్రితం ముగిసినట్టు తెలిసింది. ఇదే కనుక జరిగితే బీమాను క్లెయిమ్ చేసుకోవడం సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రుణం మొత్తంలో నుంచి బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించాలని నిర్వాహకుడు శ్రీనివాసరావు నిర్ణయించినట్టు తెలిసింది. ఇంతలో ఈ దారుణం జరిగింది.

పోలీసులకు చిక్కిన వంశీ కుడిభుజం 'రంగా'

- అరెస్టు చేసిన సీఐడీ

విజయవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు కుడిభుజంగా వ్యవహరించిన ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మంగళవారం రాత్రి అతడికి పోలీసులు సంకెళ్లు వేశారు. వంశీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో మోహనరంగారావు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో ఫిర్యాదిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో ఐదో నిందితుడిగా ఉన్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రెచ్చిపోయిన రంగ, కొమ్మా కోట్లు, యతేంద్ర రామకృష్ణలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటి వరకు గన్నవరం కేంద్రంగా వ్యవహారాలు చక్కబెట్టిన రంగా అక్కడి నుంచి పరారయ్యాడు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఇది విచారణలో ఉండగానే సత్యవర్ధన్ ఎపిసోడ్‌ను తెర వెనుక ఉండి నడిపించాడు. సత్యవర్ధన్ కిడ్నాప్ వెనుక రంగా, కొమ్మా కోట్లు కీలకపాత్ర పోషించినట్టు పోలీసులు ఇప్పటికే ఆధారాలు సేకరించారు. ఇప్పుడు రంగాను అరెస్టు చేయడంతో ఇక కోట్లు వంతు మిగిలి ఉంది. రాజమహేంద్రవరం వద్ద సీఐడీ పోలీసులు రంగాను పట్టుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వంశీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అక్రమాలన్నింటిలో రంగా పాత్ర ప్రత్యక్షంగా ఉందని పలు ఫిర్యాదులు అందాయి. వంశీపై తాజాగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో రంగా పేర్లు కచ్చితంగా ఉంటోంది. ఈ తరుణంలో రంగా చిక్కడం పెద్ద సంచలనంగా మారింది. అతడిని బుధవారం సీఐడీ కోర్టులో పోలీసులు హాజరుపరిచే అవకాశాలు ఉన్నాయి. సత్యవర్ధన్ కేసులో ఏ5గా ఉన్నందున పటమట పోలీసులు పీటీ వారెంట్‌ను కోర్టులో దాఖలు చేయడానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

అవినీతికి సహకారం

(5వ పేజీ తరువాయి)

రైతులు రొయ్యలు, పండుగప్ప చేపల సాగు, వ్యవసాయం చేస్తుండటంతో ఇలాగే లాంగ్‌టర్మ్ రుణాలు తీసుకున్నారు. రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే, సంబంధిత పొలం పత్రాల పరిశీలన, రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్టిగేజ్ చేసే పనులను పీఏసీఎస్ సీఈవో భాస్కర్ చూసుకునేవాడు. అతనిపై ఉన్న నమ్మకంతో రైతులు రుణాలు తీసుకుని, సకాలంలో చెల్లించేసేవారు. కాగా, గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడు వైసీపీకి చెందిన వ్యక్తి. ఇతను మాజీ మంత్రి పేర్ని నానికి ముఖ్య అనుచరుడు. కేడీసీసీబీ పాలకవర్గంలోనూ దీర్ఘకాలం డైరెక్టర్‌గా కొనసాగాడు. కేడీసీసీబీ ప్రధాన కార్యాలయంలోని అధికారులతో తనకున్న పరిచయాలను ఆసరాగా చేసుకుని సీఈవోతో కలిసి కోటి రూపాయలకు పైగా నగదును పక్కదారి పట్టించాడని రైతులు ఆరోపిస్తున్నారు.

బయటపడింది ఇలా..

గోకవరం పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలు చెల్లించేశారు. తిరిగి రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, గతంలో తీసుకున్న రుణాలు చెల్లించారా, లేదా అనే విషయంపై బ్యాంకు అధికారులు స్టేట్‌మెంట్లను తీశారు. రైతులు రుణాలు చెల్లించనట్టుగా చూపడంతో ఇదే విషయాన్ని బ్యాంకు అధికారులు రైతులకు తెలియజేశారు. అవాక్కయిన రైతులు రుణాలు చెల్లించిన సమయంలో తమకు ఇచ్చిన రసీదులను చూపారు. దీంతో బ్యాంకు అధికారులు పదిమందికి పైగా రైతులకు సంబంధించిన వివరాలను సేకరించే పనిని ప్రారంభించారు. దీంతో పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూశాయి. పీఏసీఎస్ అధ్యక్షుడు, సీఈవో తమను నిలువునా మోసం చేసిన విషయం తెలుసుకున్న రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై 51 విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పీఏసీఎస్ సీఈవోకు, అధ్యక్షుడికి వివిధ రకాల వ్యాపారాలు ఉన్నాయని, రైతుల నుంచి రుణాల చెల్లింపుల రూపంలో వసూలు చేసిన నగదును తమ వ్యాపారాల్లో పెట్టుబడులుగా పెట్టి ఉంటారని ఆరోపిస్తున్నారు. పీఏసీఎస్‌లో నగదు దారి మళ్లిన విషయం బయటపడటంతో సంబంధిత సీఈవో అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చేరాడు. వైసీపీకి చెందిన వ్యక్తి ఈ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా, కేడీసీసీబీ పాలకవర్గం డైరెక్టర్‌గా ఐదేళ్లు పనిచేశాడు. కేడీసీసీబీ ద్వారా రుణాల మంజూరులో కమీషన్‌ను తీసుకోవడంతో పాటు తాను ప్రాతినిధ్యం వహించిన గోకవరం పీఏసీఎస్‌లో అక్రమాలకు పాల్పడటంలో ఈ వైసీపీ నాయకుడు తనదైనశైలిలో వ్యవహరించేవాడనే ఆరోపణలు ఉన్నాయి.

పీఏసీఎస్ సూపర్‌వైజర్‌పై దాడి

గోకవరం పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం మొత్తాన్ని ఇక్కడ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జడా ప్రభాకరరావు బయటపెట్టాడనే కారణంతో అతనిపై రెండు రోజులక్రితం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దాడిచేశారు. ఈ నెల 23న విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో చిలకలపూడి గోడౌన్స్ సమీపంలో కాపుకాసిన ఇద్దరు వ్యక్తులు అతని కళ్లలో రసాయనాలు చల్లారు. అనంతరం దాడి చేయబోగా, అతను తప్పించుకున్నాడు. ఈ ఘటనపై బాధితుడు చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి పోలీస్‌స్టేషన్ సీఐ నబీ తెలిపారు. గోకవరం పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేస్తామని కేడీసీసీబీ సీఈవో శ్యామ్ మనోహర్ తెలిపారు.

స్థూల ఉత్పాదకతలో సంవృద్ధి

(5వ పేజీ తరువాయి)

రంగంలో ట్రేడ్, హోటళ్లు, రెస్టారెంట్ల ద్వారా రూ.16,691 కోట్లు, రైల్వేస్ ద్వారా రూ.1,250 కోట్లు, రవాణా ద్వారా రూ.6,088 కోట్లు, కమ్యూనికేషన్స్ ద్వారా రూ.2,691 కోట్లు, బ్యాంకింగ్-ఇన్‌స్టిట్యూట్స్ ద్వారా రూ.10,005 కోట్లు, రియల్ ఎస్టేట్ ద్వారా రూ.10,046 కోట్లు, ఇతర సేవల ద్వారా రూ.8,842 కోట్ల ఉత్పాదకత సాధించింది. గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే 18.06 శాతం వృద్ధితో రూ.10,591 కోట్ల ఉత్పాదకతను ఎన్టీఆర్ జిల్లా సాధించడం విశేషం.

రెండు జిల్లాల కాంట్రిబ్యూషన్

రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పాదకతలో రెండు జిల్లాలు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లతో పోల్చి చూస్తే ప్రస్తుతం ముగియనున్న, రాబోయే ఆర్థిక సంవత్సరాల్లో సాధించాల్సిన కాంట్రిబ్యూషన్ రెండంకెల వృద్ధిలో ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా 5.79 శాతం, కృష్ణాజిల్లా 5.57 శాతం కాంట్రిబ్యూషన్‌ను నమోదు చేశాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా 6.04 శాతం, కృష్ణాజిల్లా 5.53 శాతం కాంట్రిబ్యూషన్‌ను నమోదు చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం (ఇంకా ముగియలేదు)లో ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా 5.94 శాతం, కృష్ణాజిల్లా 5.51 శాతంలో ఉన్నాయి. రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్ జిల్లా 6.01 శాతం, కృష్ణాజిల్లా 5.50 శాతం మేర రాష్ట్ర జీడీపీకి కాంట్రిబ్యూషన్ ఇచ్చేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి.

ఇక ఆధునిక ఐజీఎంఎస్

(5వ పేజీ తరువాయి)

వీలుగా స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని శాప్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జాతీయ క్రీడల్లో అథ్లెటిక్స్ నిర్వహించడానికి అనువుగా ఇక్కడ ట్రాక్ లేదు. ఈ నేపథ్యంలో రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 100, 200, 400 మీటర్ల పరుగులు, హర్డిల్స్ నిర్వహించేలా ఈ ట్రాక్ నిర్మించాలని భావిస్తున్నారు. స్టేడియానికి బయట ఉన్న ఫుట్‌బాల్ కోర్టు వద్ద 200 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. ఇటీవల ఈ స్టేడియంలో ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు నిర్వహించినప్పుడు అథ్లెటిక్స్ కోసం తాత్కాలికంగా ఎర్రమట్టితో ట్రాక్‌లను ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం



ఫ్యాషన్

జంప్‌సూట్స్ జోరు

అన్నిసార్లూ తీరికగా సింగారించుకునే సమయం ఉండదు. ఒక్కోసారి క్షణాల్లో తయారు కావల్సి వస్తుంది. అలాంటి సందర్భాల్లో తక్కువ శ్రమతో ఎక్కువ ఆకర్షణీయంగా కనిపించాలనుకుంటే, నిస్సందేహంగా జంప్‌సూట్స్‌ను ఎంచుకోవచ్చు. ఈ వినూత్న డ్రస్సుల మీద ఓ లుక్కేద్దామా?

ఈ డ్రస్‌లు అన్ని వయసుల వారికీ నప్పుతాయి. వైవిధ్యంగా, విభిన్నంగా కనిపించాలనుకుంటే, మరో ఆలోచన లేకుండా జంప్‌సూట్స్‌ను ఎంచుకోవాలి. అన్ని సందర్భాలకూ, వేడుకలకూ నప్పే ఈ దుస్తులు భారీ హంగులతో కూడా రూపొందుతున్నాయి. ఫ్యూజన్ లుక్‌తో కనిపించేలా పట్టుతో కూడా తయారవుతున్నాయి. శాటిన్, సింథటిక్, కాటన్...ఇలా పలు రకాల వస్త్రాల్లో దొరుకుతున్నాయి.



సొబగులు జోడించి...

జంప్‌సూట్‌లో సంప్రదాయబద్ధంగా కనిపించాల నుకుంటే ఆక్సిడైజ్డ్ ఝుంకాలు, చాంద్‌బాలీలు పెట్టుకోవాలి. మెరుపులీనే నెక్లెస్, జుత్తీలు, కోల్హాపురి చెప్పులతో మ్యాచ్ చేయాలి. ఆధునికంగా కనిపించాలనుకుంటే స్లింగ్ బ్యాగ్, హైహీల్స్ ధరించాలి. స్లీవ్‌లెస్ జంప్‌సూట్ వేసవి సెలవుల విహారాలకు అనువుగా ఉంటాయి. ఎక్కువ వదులుగా ఉండే కాటన్ జంప్‌సూట్స్ స్నేహితులతో కాలక్షేపం చేసే సాయంకాలపు విహారాలకు అనువుగా ఉంటాయి.

శరీరాకృతికి తగ్గట్టు...

పియర్ షేప్ ఉన్నవారు వెడల్పాటి కాళ్లతో కూడిన జంప్‌సూట్ ఎంచుకోవాలి. యాపిల్ శరీరాకృతి కలిగిన వాళ్లు సన్నని నడుమును హైలైట్ చేయడం కోసం ఒంటికి హత్తుకునే జంప్‌సూట్ వేసుకోవాలి. ఆకర్షణీయమైన శరీరాకృతి కలిగిన వాళ్లు ర్యాప్ జంప్‌సూట్ వేసుకోవచ్చు. ఇక అవర్‌గ్లాస్ శరీరాకృతి కలిగిన వాళ్లు బెల్టెడ్ జంప్‌సూట్ ఎంచుకోవాలి. మిక్సింగ్, మ్యాచింగ్ ఇబ్బంది లేదు కాబట్టి నచ్చిన జంప్‌సూట్స్‌ను అందుబాటులో ఉంచుకుంటే, చటుక్కున అందుకుని క్షణాల్లో సిద్ధమైపోవచ్చు.

శిక్షణ ఇస్తే... వాళ్లూ మెరికలే

ఆదివాసీ పిల్లల దుర్భర పరిస్థితులను చూసి ఆమె చలించిపోయారు. సరైన దిశానిర్దేశం ఉంటే వారూ మెరికల్లా తయారవుతారని భావించారు. అందుకు ఒక సంస్థను నెలకొల్పి... దాని ద్వారా వేలమంది అణగారిన వర్గాలవారికి ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. 'బొల్లినేని మెడ్‌స్కిల్స్' వ్యవస్థాపకుల్లో ఒకరు, సంస్థ అకడమిక్ డైరెక్టర్... లక్ష్మీపద్మజతో 'నవ్య' మాటామంతి.

సంకల్పం



"సరిగ్గా పదేళ్ల కిందట... అప్పుడు మేం హైదరాబాద్‌లో ఉండేవాళ్లం. మా అమ్మాయి ఇంటర్ పూర్తయింది. ఎంసెట్ రాస్తే శ్రీకాకుళం మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. మాకు ఒక్కతే అమ్మాయి. తనను ఒంటరిగా పంపడం ఇష్టంలేక మేం కూడా శ్రీకాకుళం వచ్చాం. ఇక్కడకు వచ్చాక ఆదివాసీలు, అణగారిన వర్గాల వారి జీవన స్థితిగతులు ప్రత్యక్షంగా చూశాం. ముఖ్యంగా బంగరు భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలు ఆరంభంలోనే మసిబారిపోతున్నాయి. ఇది నన్ను కలచి వేసింది. దీనికి కారణాలు అన్వేషిస్తున్న క్రమంలో ప్రధానంగా నేను గమనించింది ఏంటంటే... వాళ్లల్లో నైపుణ్యానికి కొదవ లేదు. కానీ కెరీర్‌కు సంబంధించి సరైన మార్గనిర్దేశం లేక వెనకబడిపోతున్నారు. ఎవరో ఏదో కోర్సు చేస్తున్నారంటే ఆ ప్రాంతంలో మిగిలినవారు కూడా మరో ఆలోచన లేకుండా అటే పరుగెత్తేవారు. అలా కాకుండా వారిలోని నైపుణ్యాన్ని బయటకు తీసి, సరైన దారిలో నడిపించ గలితే మంచి ఫలితాలు వస్తాయనిపించింది. దీని కోసం ఒక సంస్థను నెలకొల్పాలని నేను, మావారు నాగేశ్వరరావు అనుకున్నాం. మా ఆలోచనను 'కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్' ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు గారితో పంచుకున్నాం. ఆయన మార్గదర్శకత్వంలో 'బొల్లినేని మెడ్‌స్కిల్స్'ను 2016లో నెలకొల్పాం. హెల్త్‌కేర్ కోర్సులు అందించే ఉద్దేశంతో ఏర్పాటైన సంస్థ ఇది. దీని ద్వారా ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. బతుకు బండి నడవడానికి ఉద్యోగం చేసుకొంటూనే చదువుకొనేలా ఇక్కడ కోర్సులు డిజైన్ చేశాం.

ఉద్యోగాలు వదిలేసి...

మా స్వస్థలం కృష్ణాజిల్లా చినఓగిరాల. అయితే నా చిన్నప్పుడే మా కుటుంబం బళ్లారి జిల్లా కంప్లీకి వెళ్లిపోయింది. అమ్మ ధనలక్ష్మి, నాన్న వీరచందర్‌రావు... ఇద్దరూ వ్యవసాయం చేసేవారు. నాకు ఇద్దరు అన్నలు. నా పాఠశాల విద్యాభ్యాసం అంతా సండూరు రెసిడెన్షియల్ హాస్టల్‌లోనే సాగింది. ధార్వాడ్‌లో బీఎస్సీ బీజెడ్‌సీ చదివాను. గోల్డ్ మెడల్ సాధించాను. మా గ్రామంలో మొట్టమొదటి గ్రాడ్యుయేట్‌ను నేనే. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో, కోచింగ్ కోసం ఢిల్లీ వెళ్లాను. మా అమ్మ ధనలక్ష్మి మద్దతు లేకపోతే అది సాధ్యమయ్యేది కాదు. ఐఎఫ్‌ఎస్ మెయిన్స్ వరకు వెళ్లాను. కానీ ఇంటర్వ్యూలో పోయింది. కోచింగ్ తీసుకొంటూనే ఢిల్లీ వర్సిటీలో ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ కోర్సు చదివాను. పీజీ అయ్యాక నాకు పెళ్లి చేశారు. నేను, మావారు మంచి ఉద్యోగాల్లో ఉన్నాం. కానీ ఎందుకో అందులో మాకు సంతృప్తిగా అనిపించలేదు. నేర్చుకున్నది తిరిగి ఈ సమాజానికి ఇవ్వాలనే తపన నాది. ఆయన ఆలోచనలు కూడా కలవడంతో 'మెడ్‌స్కిల్స్' సంస్థ పురుడు పోసుకుంది. ప్రస్తుతం దానికి నేను అకడమిక్ డైరెక్టర్‌గా ఉన్నాను. మార్కెటింగ్ లాంటివి మావారు చూస్తారు.

వర్సిటీలకు అనుబంధంగా...

మా సంస్థ ద్వారా దాదాపు 52 హెల్త్‌కేర్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నాం. తదనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. నాలుగు నెలల నుంచి నాలుగున్నర ఏళ్ల వరకు పారామెడికల్ డిప్లమో, పీజీ కోర్సులు, హెల్త్‌కేర్ రంగానికి సంబంధించిన నైపుణ్య శిక్షణ తరగతులు ఇందులో ఉన్నాయి. ఎన్‌టీఆర్, కాళోజీ నారాయణ, ఆంధ్రా, అంబేడ్కర్ తదితర విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా కోర్సులు అందిస్తున్నాం. అలాగే టాటా, టెక్ మహీంద్రా, జీఈ హెల్త్‌కేర్, ఏపీ పారామెడికల్ కౌన్సిల్‌తో కూడా కలిసి పని చేస్తున్నాం. శ్రీకాకుళంలో ప్రారంభమైన 'మెడ్‌స్కిల్స్' ఇప్పుడు దేశ వ్యాప్తంగా పదకొండు ప్రాంతాల్లో విస్తరించింది.

ఉన్నతంగా తీర్చిదిద్దాలి...



ఎంత పని ఒత్తిడి ఉన్నా... నేను కూడా పాఠాలు చెబుతుంటాను. ఇక్కడకు రాకముందు 'ఫిట్జీ'లో బోధించేదాన్ని. అలాగే కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్ ఇస్తాను. వేరే కళాశాలలకు కూడా వెళుతుంటాను. ఇక మా అమ్మాయి 'యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ ఫ్లోరిడా'లో పీజీ చేస్తోంది. సైన్స్‌కు సంబంధించి మూడు పుస్తకాలు కూడా రాశాను. బయాలజీ, కెమిస్ట్రీ టెస్ట్ పేపర్స్ చేశాను. పలు పబ్లిషింగ్ హౌస్‌ల కోసం కంటెంట్ ఇచ్చాను. ఎన్సీఈఆర్టీ తదితర పరీక్షలకు ప్రశ్నపత్రాలు తయారు చేశాను. కొన్ని సంస్థలు గౌరవ సత్కారాలు, పురస్కారాలూ ఇచ్చాయి. ఈ సంస్థను మరింత విస్తరించి, మరింతమంది పేదలు, మహిళలకు ఉన్నతమైన కెరీర్ అందించాలనేది నా లక్ష్యం.

విదేశాల్లో స్థిరపడ్డారు...

ఇప్పటివరకు పన్నెండు వేల మందికి పైగా శిక్షణ తీసుకున్నారు. వారిలో తొంభై శాతం మంది హెల్త్‌కేర్ రంగంలో స్థిరపడ్డారు. నాలుగు వేల మంది ఆదివాసీ యువతకు శిక్షణ ఇచ్చాం. సంపాదిస్తూ చదువుకోవాలనేది మా కోర్సుల ప్రధాన ఉద్దేశం. ఆర్థికంగా వెనకబడినవారికి నైపుణ్య శిక్షణ ఉచితంగానే అందిస్తున్నాం. ఇటీవలే మా విద్యార్థులు ఇద్దరు లండన్ వెళ్లారు. నెలకు మూడు లక్షల జీతం పొందుతున్నారు. ఇంకొక అమ్మాయి సింగపూర్‌లో పని చేస్తోంది. ఇలా చాలామంది ఉన్నారు. కొబ్బరికాయలు కొట్టే ఒక వ్యక్తి వచ్చి... 'మా అమ్మాయి మంచి ఉద్యోగంలో స్థిరపడిందండి' అని చెబుతుంటే నా గుండె ఆనందంతో ఉప్పొంగుతుంది. ఇదే మేం కోరుకున్న మార్పు. ఇంతకుమించిన సంతృప్తి, సంతోషం ఏముంటుంది!

మహిళా సాధికారతకు...

ప్రస్తుతం అన్ని కేంద్రాలలో కలిపి రెండు వేల మందికి పైగా విద్యార్థులున్నారు. వాళ్లల్లో మహిళలు 73 శాతం, గిరిజనులు యాభై శాతానికి పైగా ఉంటారు. మహిళలను సాధికారత దిశగా అడుగులు వేయించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. అలాగే అనీమియా, పీసీఓడీ, నెలసరి సమయంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. పెళ్లయిన మహిళలకు వారి సౌకర్యాన్నిబట్టి శిక్షణ ఇచ్చి, ఇంటి వద్ద నుంచే పని చేసే వెసులుబాటు కల్పిస్తున్నాం. పదేళ్ల కిందట ఇక్కడ మా కార్యకలాపాలు ప్రారంభించేనాటికి... గిరిజనుల అమ్మాయిలు ఉద్యోగాల కోసం వేరే ఊళ్లకు వెళ్లేందుకు వెనుకాడేవారు. కానీ ఇప్పుడు నిస్సంకోచంగా వెళ్లగలుగుతున్నారు. మేం గమనించిన అతి పెద్ద మార్పు ఇది."

• హనుమా

పిల్లలు ఎప్పుడూ ఆడుతూ పాడుతూ ఉల్లాసంగా ఉండాలని తల్లిదండ్రులు కోరుకుంటూ ఉంటారు. అందుకు తల్లిదండ్రులు ఈ చిట్కాలు పాటిస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

రోజంతా ఉల్లాసంగా..

- పిల్లలకు కనీసం ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. అందుకే వాళ్లను రాత్రిపూట త్వరగా పడుకోబెట్టి ఉదయాన్నే నిద్ర లేపాలి. అప్పుడే వాళ్ల శరీరం, మెదడు విశ్రాంతి పొందుతాయి. పిల్లలు రోజంతా చురుకుగా ఉంటారు.
- పెద్దలకే కాదు పిల్లలకు కూడా వ్యాయామం అత్యవసరం. రోజూ కనీసం 20 నిమిషాలపాటు ప్రాణాయామం, సైక్లింగ్, స్కిప్పింగ్ లాంటివి చేయించాలి. దీంతో శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడి రోజంతా ఉత్సాహంగా ఉంటారు.
- రోజూ పోషకాలతో నిండిన అల్పాహారం తినిపించాలి. దీనివల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఎదుగుతారు.
- పిల్లల్లో చురుకుదనం, ఏకాగ్రత పెరగాలంటే శారీరక శ్రమతోపాటు ఆలోచన తీరుని మెరుగుపరచి, బుర్రకు పదునుపెట్టే ఆటలను ఆడించాలి. టెన్నిస్, చదరంగం, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, కరాటే లాంటివి ఇందుకు దోహదం చేస్తాయి. తోటి



వారితో ఆడుతూ ఉంటే పిల్లలు ఎప్పుడూ ఉత్సాహంగానే ఉంటారు.
- పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వాళ్లను చిన్నచిన్న పనుల్లో భాగస్వాములను చేయాలి. ఒత్తిడి, ఆందోళన లేకుండా చదువుకునేలా ప్రోత్సహించాలి. పడుకునేముందు కథలు చెప్పాలి.
- పిల్లలు ఏదైనా తప్పు చేసినా కోప్పడకుండా మెల్లగా వివరించి చెప్పాలి. సమస్య వచ్చినప్పుడు నేర్పుగా పరిష్కరించుకునే విధానాలను తెలియజెప్పాలి. దీంతో పిల్లలు చిన్న విషయాలకే ఆందోళన పడకుండా ధైర్యంగా ఉండగల్గుతారు.

మంచి అలవాట్లతో శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి అనారోగ్యమూ దరి చేరదు. అందంగా ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు ఇవే.

- చేతులను తరచూ శుభ్రం చేసుకుంటూ ఉండాలి. సబ్బు లేదా హ్యాండ్ వాష్‌తో కనీసం ఇరవై సెకన్లు రుద్దుతూ కడుక్కోవాలి. అప్పుడే చేతులపై ఉండే హానికర బ్యాక్టీరియాలు, వైరస్‌లు నశిస్తాయి.

అందంగా.. ఆరోగ్యంగా..

- రోజుల తరబడి తువాళ్లను ఉతకకుండా ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరం. రెండు రోజులకు ఒకసారి తువాళ్లను ఉతకాలి. తడి తువాలుతో తుడుచుకోవడం కూడా మంచిది కాదు. ఒకసారి ఉపయోగించిన తరవాత తువాలును ఎండలో ఆరవేయాలి.
- గోళ్లను వారానికి ఒకసారి కత్తిరించుకోవాలి. గోళ్లలో మురికి చేరకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. గోళ్ల విషయంలో అశ్రద్ధ కనబరిస్తే శరీరంలోకి హానికారక క్రిములు ప్రవేశిస్తాయి.
- టూత్‌బ్రష్‌లో కూడా హానికర బ్యాక్టీరియాలు చేరుతూ ఉంటాయి. కాబట్టి టూత్‌బ్రష్‌ను కనీసం మూడు నెలలకు ఒకసారి మార్చుకుంటూ ఉండాలి. రోజుకి రెండుసార్లు బ్రష్ చేయాలి.
- ముఖాన్ని చేతులతో పదేపదే తాకకూడదు. చేతుల మీద ఉండే క్రిములవల్ల ముఖంపై మొటిమలు, బ్లాక్‌హెడ్స్ ఏర్పడతాయి. రోజూ ముఖాన్ని సున్నిపిండితో రుద్ది చల్లని నీళ్లతో కడుక్కోవాలి.



- మేకప్ కిట్స్, రేజర్లు, దువ్వెనలు, తువాళ్లు, చేతి రుమాళ్లు ఇతరులతో పంచుకోవద్దు. దీనివల్ల వ్యక్తిగత శుభ్రత మెరుగుపడుతుంది.
- బజారు నుంచి తీసుకొచ్చిన పళ్లు, కూరగాయలను ఉప్పు, పసుపు వేసిన నీళ్లతో కడగడం మంచిది. దీనివల్ల వాటిపై ఉండే పురుగుమందుల అవశేషాలు, హానికారక క్రిములు నశిస్తాయి.
- షూస్, చెప్పులను ఇంట్లో ఉంచకూడదు. వారానికి ఒకసారి వీటిని శుభ్రం చేసుకోవాలి. సాక్స్‌ని ఉతకకుండా ధరించకూడదు. బకెట్ వేడి నీళ్లలో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా పసుపు వేసి కలిపి అందులో పాదాలు ఉంచి అరగంట తరవాత సబ్బుతో రుద్ది కడుక్కుంటే పగుళ్లు, అలెర్జీలు దరి చేరవు.



కిటికీల దగ్గర వీటిని ఉంచవద్దు..!

ఇంట్లో కిటికీల కింద అమర్చే చిన్న అరల మీద రకరకాల వస్తువులు పెడతాం. అయితే కిటికీల దగ్గర కొన్ని రకాల వస్తువులు ఉంచకూడదని నిపుణులు చెబుతున్నారు.

- కిటికీల దగ్గర డియోడరెంట్, పర్‌ఫ్యూమ్, స్ప్రే లాంటివి పెట్టకూడదు. అలా పెడితే బయటి నుంచి వచ్చే సూర్యరశ్మి వీటిపై పడి అవి ప్రభావితమవుతాయి. ఒక్కోసారి అవి పేలవచ్చు కూడా.
- అద్దాల తలుపులు ఉన్న కిటికీల దగ్గర దుప్పట్లు, దుస్తులు ఉంచవద్దు. అద్దం మీద సూర్యరశ్మి పడినప్పుడు మంటలు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.
- కిటికీ అరను వస్తువులతో నింపితే ఇంట్లోకి గాలి, వెలుతురు సరిగా ప్రసరించవు. అంతేకాకుండా బయటి నుంచి వచ్చే దుమ్ము, వాన నీటి వల్ల వస్తువులు పాడవుతాయి.
- కిటికీ అర మీద పెద్దవాళ్లు వేసుకునే మందు బిళ్లల షీట్లు, చిన్న పిల్లలు తాగే సిరప్ సీసాలను ఉంచకూడదు. బయటి నుంచి వచ్చే వేడి వల్ల అవి పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి.
- కొంతమంది కిటికీ అరను మొక్కలు పెంచే కుండీలతో నింపేస్తూ ఉంటారు. దీనివల్ల కిటికీని తరచూ శుభ్రం చేయడం వీలు కాకపోవచ్చు. కిటికీ మొత్తం దుమ్ము, ధూళితో నిండడంతో అపరిశుభ్రమైన గాలి ఇంట్లోకి వచ్చి అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది.
- వేసవికాలంలో కిటికీ అర మీద కొవ్వొత్తులు, లాంతర్లు లాంటి వాటిని పెట్టకూడదు.

నిందను మోసి... నిరపరాధిగా..

"పది మంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు. ఒక నిర్దోషికి మాత్రం శిక్ష పడకూడదు" అనేది సహజ న్యాయ సూత్రాల్లో ప్రధానమైనది. బాలీవుడ్ నటి రియా చక్రవర్తి కేసులో ఈ న్యాయ సూత్రం గెలిచిందనిపిస్తుంది. నాలుగున్నరేళ్ల క్రితం ప్రముఖ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య కేసులో రియా ప్రధాన నిందితురాలు. ఆమెను విలన్‌గా పేర్కొంటూ సోషల్ మీడియాలో కొన్ని వేల వీడియోలు సుడిగాలిలా వ్యాపించాయి. "నా తప్పు లేదు.." అని ఆమె ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఎవరూ వినిపించుకోలేదు. నాలుగున్నరేళ్ల విచారణ తర్వాత- సీబీఐ ఈ కేసులో రియా తప్పు లేదని తేల్చింది. దీనితో మళ్లీ మరోసారి ఆమె వార్తల్లో వ్యక్తి అయింది. ఇన్ని సంచలనాలకు కారణమైన రియా కథేమిటంటే...

బాలీవుడ్‌లో అవకాశాలు కోసం ముంబాయికి ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది వస్తూ ఉంటారు. అలాంటి వారిలో రియా కూడా ఒకరు. రియా తండ్రి ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేసేవారు. ఆర్మీ నేపథ్యం ఉంది కాబట్టి ఆమె దేశంలోని అనేక ప్రాంతాల్లో చదువుకుంది. చిన్నప్పటి నుంచే మోడలింగ్‌పై ఆసక్తి ఉన్న రియా... 2009లో 'ఎంటీవీ- టీవీఎస్ స్కూటీ టీన్ దీవా' అనే కార్యక్రమానికి యాంకర్‌గా ఎంపికయింది. ఆ తర్వాతి కాలంలో కొన్ని మోడలింగ్, వీడియో జాకీ (వీజే) అవకాశాలు లభించాయి. కానీ బాలీవుడ్‌లో మాత్రం ప్రవేశం దొరకలేదు. అయితే 2012లో తెలుగులో 'తూనీగ.. తూనీగ' సినిమాలో హీరోయిన్ అవకాశం లభించింది. ఆ తర్వాత ఆమెకు బాలీవుడ్‌లోనూ అవకాశాలు మొదయలయ్యాయి. కానీ అగ్రశ్రేణి నటిగా మాత్రం ఎదగలేకపోయింది. ఈ నేపథ్యంలో... అప్పుడప్పుడే బాలీవుడ్‌లో ఎదుగుతున్న సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆమెకు పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆరునెలలలోనే వారిద్దరూ సహజీవనం మొదలుపెట్టారు. రియా తమ్ముడు షవిక్‌తో కలిసి సుశాంత్ సింగ్- ' వివిడ్ రేజ్ రిహాలిటిక్స్' అనే ఒక స్టార్టప్‌ను కూడా ప్రారంభించాడు. అంతా సజావుగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో - 2020, జూన్ 14వ తేదీన సుశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త దేశాన్ని కుదిపేసింది. సుశాంత్ ఆత్మహత్య చేసుకోవటానికి ఒక వారం ముందే రియా వేరుగా వెళ్లిపోయిందని, సుశాంత్‌కు డ్రగ్స్ అలవాటు చేసింది ఆమే అనీ రకరకాల వార్తలు వ్యాపించాయి. ఆ తర్వాత సుశాంత్ తండ్రి... తన కుమారుడి మరణానికి రియా కారణమని పోలీసు కేసు పెట్టారు. కొన్ని రోజులకే దాన్ని సీబీఐకి బదిలీ చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డు (ఎన్‌సీబీ), ఈడీలతో కలిపి ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేయటం మొదలుపెట్టింది. దీనికి బదులుగా రియా కూడా సుశాంత్ సోదరీమణులు ప్రియాంక, మీతూ సింగ్‌లపై కేసులు పెట్టింది. సుశాంత్ మరణానికి దారి తీసిన పరిస్థితులకు వీరిద్దరే కారణమని ఈ కేసుల్లో పేర్కొంది.

అల్లకల్లోలం...

ఒక వైపు ఈ కేసుల్లో దర్యాప్తు జరుగుతుండగానే- మరో వైపు రియాను ఎన్‌సీబీ అరెస్ట్ చేసింది. దీనితో రియాపై మరోసారి సోషల్ మీడియాలో ట్రోలింగ్ ప్రారంభమయింది. ఒక వైపు జైల ు.. మరో వైపు సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌లతో ఆమె జీవితం అతలాకుతలమైపోయింది. బాలీవుడ్‌లో వచ్చిన అవకాశాలన్నీ మాయమైపోయాయి. ఈ సమయంలో రియాకు ఆమె కుటుంబమే అండగా నిలబడింది. "అలాంటి సమయంలో ఏ ఒక్క చిన్న తప్పు మాట మాట్లాడినా ఆమె జీవితంలో పెనుమార్పులు వస్తాయి. అందుకే రియా కుటుంబం మౌనంగా ఉండి.. ఆమెకు అవసరమైన ధైర్యాన్ని ఇచ్చింది. ఆమె కూడా చాలా ధైర్యంగా పోరాడింది" అంటారు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సతీష్ మణిషిండే.

వాన వెలిసి...



కొద్దికాలం తర్వాత కోర్టులో రియాకు బెయిల్ లభించింది. 'ఎంటీవీ రోడీస్'లో ఆమెకు మళ్లీ అవకాశం వచ్చింది. 'రియా- చాప్టర్ 2' అనే పాడ్‌కాస్ట్‌ను కూడా ప్రారంభించింది. పరిస్థితులు నెమ్మదిగా చక్కబడ్డాయి. ఈ సోమవారం రియాకు క్లీన్‌చిట్ ఇస్తూ... కోర్టులో సీబీఐ పిటిషన్ ఫైల్ చేసింది. దీనితో ఈ కేసు నుంచి రియాకు పూర్తిగా విముక్తి లభించినట్టయింది. గత ఆరేళ్లుగా న్యాయపోరాటాలతోనే కాలం గడిపిన ఆమెకు ఇకనైనా బాలీవుడ్‌లో అవకాశాలు లభిస్తాయో లేదో కాలమే చెప్పాలి.



ఐపీఎల్‌లో నేడు | వేదిక గువాహటి
రాజస్థాన్ x కోల్‌కతా | రా.7.30

'ఇంపాక్ట్' మంచిదే!



చెన్నై: ఐపీఎల్‌లో 'ఇంపాక్ట్ ఆటగాడి' నిబంధనపై ధోనీ అభిప్రాయం మారింది. 2023లో మెగా లీగ్‌లో తొలి సారి ఈ రూల్‌ను ప్రవేశపెట్టినప్పుడు మహీ దానిని వ్యతిరేకించాడు. అయితే ఆ నిబంధన టీ20ల పురోగతికి దోహదం చేసిందని అతడు ఇప్పుడు అంటున్నాడు. ఈ నిబంధనతో..పరిస్థితులకు తగ్గట్టుగా జట్లు అదనంగా ఓ బ్యాటర్‌నో లేదా బౌలర్‌నో తీసుకొని ప్రయోజనం పొందుతున్నాయి.

మహిళల ముక్కోణపు సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు

కొలంబో: ఎన్నికల కారణంగా మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్టు శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఆతిథ్య లంకతోపాటు భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఈ సిరీస్‌లో ఆడనున్నాయి. గతంలో మే 1, 4, 6, 8 తేదీల్లో షెడ్యూల్ చేసిన మ్యాచ్‌లను మే 2, 4, 7, 9 తేదీలకు మార్చారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ప్రేమదాస స్టేడియంలో మే 6న జరగాల్సిన మ్యాచ్ ఆ తర్వాతి రోజు అంటే 7వ తేదీ జరగనుంది. ముక్కోణపు సిరీస్ ఏప్రిల్ 27న శ్రీలంక-భారత్ మ్యాచ్‌తో మొదలవనుండగా.. 29న భారత్-దక్షిణాఫ్రికా, మే 2న శ్రీలంక-దక్షిణాఫ్రికా, 4న శ్రీలంక-భారత్, 7న భారత్-దక్షిణాఫ్రికా, 9న శ్రీలంక-దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. మే 11న ఫైనల్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు.

కాంస్య పతక రేసులో సునీల్

అమ్మాన్ (జోర్డాన్): భారత రెజ్లర్ సునీల్ కుమార్ ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచాడు. 87 కిలోల సెమీఫైనల్ బౌట్‌లో సునీల్ 1-3తో యాసిన్ (ఇరాన్) చేతిలో ఓడాడు. దీంతో సునీల్ ఇక కాంస్యం కోసం పోరాడనున్నాడు.

ఒక్క గోల్ కూడా లేకుండానే..

భారత్-బంగ్లా సాకర్ పోరు డ్రా

షిల్లాంగ్: ఏఎఫ్‌సీ ఆసియా కప్ (2027) మూడో రౌండ్ క్వాలిఫయింగ్ పోరులో భారత ఫుట్‌బాల్ జట్టుకు నిరాశే ఎదురైంది. మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ గోల్ చేయడంలో విఫలమైంది. ఇరుజట్లూ ఒక్క గోల్ కూడా నమోదు చేయకపోవడంతో మ్యాచ్ 0-0తో డ్రాగా ముగిసింది.

అయ్యారే.. పంజాబ్

త్రుటిలో శ్రేయాస్ సెంచరీ మిస్
పోరాడి ఓడిన గుజరాత్



శ్రేయాస్ అయ్యర్ (42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో 97 నాటౌట్)

అహ్మదాబాద్: ఉత్కంఠ విజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్‌లో శుభారంభం చేసింది. శ్రేయాస్ అయ్యర్ (42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97 నాటౌట్) బ్యాట్‌తో చెలరేగితే.. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పేసర్ విజయ్‌కుమార్ వైశాక్ (3-0-28-0) వ్యూహాత్మకంగా ప్రత్యర్థి జోరును అడ్డుకొన్నాడు. దీంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 243/5 స్కోరు చేసింది. ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 47), శశాంక్ సింగ్ (16 బంతుల్లో 44 నాటౌట్) రాణించారు. సాయి కిశోర్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో గుజరాత్ ఓవర్లన్నీ ఆడి 232/5 స్కోరు మాత్రమే చేసింది. సాయి సుదర్శన్ (74), బట్లర్ (54), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (46) పోరాటాలు వృథా అయ్యాయి. అర్ష్‌దీప్ రెండు వికెట్లు పడగొట్టాడు. శ్రేయాస్ అయ్యర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆఖర్లో.. అలా..: ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్, కెప్టెన్ గిల్ తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, ధాటిగా ఆడుతున్న గిల్‌ను మ్యాక్సీ క్యాచవుట్ చేయడంతో.. ఆరు ఓవర్లకు గుజరాత్ 61/1తో నిలిచింది. అనంతరం బట్లర్‌తో కలసి సుదర్శన్ స్కోరు బోర్డును నడిపించాడు. ఈ క్రమంలో 10వ ఓవర్‌లో సుదర్శన్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. గుజరాత్ స్కోరు సెంచరీ దాటింది. క్రీజులో కుదురుకొన్న బట్లర్ మ్యాక్సీ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో గేర్ మార్చాడు. అయితే, సుదర్శన్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రూథర్‌ఫోర్డ్ కూడా ధాటిగా ఆడడంతో టైటాన్స్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, 15 ఓవర్‌లో వైశాక్ బౌలింగ్‌కు రావడం మ్యాచ్ గతిని మార్చింది. బ్యాటర్‌కు అందకుండా వ్యూహాత్మకంగా బంతులేసిన వైశాక్.. పరుగుల జోరుకు కళ్లెం వేశాడు. జాన్సెన్ కూడా అతడినే అనుసరించడంతో క్రమంగా సాధించాల్సిన రన్‌రేట్ పెరిగింది. విజయానికి 18 బంతుల్లో 57 పరుగులు కావల్సి ఉండగా.. జాన్సెన్ బౌలింగ్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న బట్లర్ బౌల్డ్ అయ్యాడు. ఆఖరి ఓవర్‌లో గుజరాత్ గెలుపునకు 27 పరుగులు కావాల్సిన దశలో.. తెవాటియా (6), రూథర్‌ఫోర్డ్‌ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ పంజాబ్‌ను గెలిపించాడు.

బాదుడే.. బాదుడు: సూపర్ ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయాస్ సెంచరీ పూర్తి చేసుకోలేకపోయినా.. కీలక భాగస్వామ్యాలతో జట్టుకు భారీ స్కోరును అందించాడు. ప్రియాన్ష్ ఆర్యతో కలసి రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించిన అయ్యర్.. స్టొయినిస్ (20)తో కలసి ఐదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇక, డెత్ ఓవర్లలో శశాంక్‌తో కలసి ఆరో వికెట్‌కు అజేయంగా 28 బంతుల్లో 81 పరుగులు జోడించడంతో పంజాబ్ అలవోకగా 240 మార్క్ దాటింది. అరంగేట్రం ఓపెనర్ ఆర్య పవర్ హిట్టింగ్‌తో పంజాబ్ స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (5) స్వల్ప స్కోరుకే అవుటైనా.. అయ్యర్‌తో కలసి ప్రియాన్ష్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. ఐదో ఓవర్‌లో అర్షద్ బౌలింగ్‌లో ఆర్య 4,4,6,4తో మొత్తం 21 పరుగులు పిండుకోవడంతో.. పవర్‌ప్లేను పంజాబ్ 73/1తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రషీద్, సాయి కిశోర్ కట్టుదిట్టంగా బంతులేస్తూ పంజాబ్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. డేంజరస్‌గా ఆడుతున్న ఆర్యను రషీద్ క్యాచవుట్ చేయగా.. 11వ ఓవర్‌లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (16), మ్యాక్స్‌వెల్ (0)ను వరుస బంతుల్లో కిశోర్ అవుట్ చేయడంతో పంజాబ్ 105/4తో నిలిచింది. రన్‌రేట్ తగ్గుతున్న క్రమంలో 13వ ఓవర్‌లో కిశోర్ బౌలింగ్‌లో అయ్యర్ రెండు సిక్స్‌లు, ఫోర్‌తో ఒక్కసారిగా గేర్ మార్చాడు. ఆ తర్వాతి ఓవర్‌లో రషీద్ బౌలింగ్‌లో రెండు వరుస సిక్స్‌లతో శ్రేయాస్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. ఆల్‌రౌండర్ స్టొయినిస్‌ను కూడా కిశోర్ వెనక్కిపంపాడు. కానీ, డెత్ ఓవర్లలో అయ్యర్, శశాంక్ గుజరాత్ బౌలర్లను ఊచకోత కోశారు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన 17వ ఓవర్‌లో శ్రేయాస్ మూడు సిక్స్‌లు, ఫోర్‌తో 24 పరుగులు రాబట్టాడు. అనంతరం 6,4,6తో జోరు చూపిన శశాంక్.. ఆఖరి ఓవర్‌లో మరో ఐదు బౌండ్రీలతో శివాలెత్తాడు. దీంతో శ్రేయా‌స్‌కు శతకం పూర్తి చేసుకొనే చాన్స్ దక్కలేదు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) సాయి సుదర్శన్ (బి) రషీద్ 47, ప్రభ్‌సిమ్రన్ (సి) అర్షద్ (బి) రబాడ 5, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 97, అజ్మతుల్లా (సి) అర్షద్ (బి) సాయి కిషోర్ 16, మ్యాక్స్‌వెల్ (ఎల్బీ) సాయి కిషోర్ 0, స్టొయినిస్ (సి) అర్షద్ (బి) సాయి కిషోర్ 20, శశాంక్ సింగ్ (నాటౌట్) 44, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 243/5; వికెట్ల పతనం:** 1-28, 2-79, 3-105, 4-105, 5-162; **బౌలింగ్:** సిరాజ్ 4-0-54-0, రబాడ 4-0-41-1, అర్షద్ ఖాన్ 1-0-21-0, రషీద్ ఖాన్ 4-0-48-1, ప్రసిద్ధ్ కృష్ణ 3-0-41-0, సాయి కిషోర్ 4-0-30-3.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 74, గిల్ (సి) ఆర్య (బి) మ్యాక్స్‌వెల్ 33, బట్లర్ (బి) జాన్సెన్ 54, రూథర్‌ఫర్డ్ (బి) అర్ష్‌దీప్ 46, తెవాటియా (రనౌట్) 6, షారుక్ ఖాన్ (నాటౌట్) 6, అర్షద్ ఖాన్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 232/5; వికెట్ల పతనం:** 1-61, 2-145, 3-199, 4-217, 5-225; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-36-2, అజ్మతుల్లా 2-0-29-0, జాన్సెన్ 4-0-44-1, మ్యాక్స్‌వెల్ 2-0-26-1, స్టొయినిస్ 2-0-31-0, చాహల్ 3-0-34-0, విజయ్‌కుమార్ వైశాక్ 3-0-28-0.

'టాప్' లేపిన అనహత్



న్యూఢిల్లీ: స్క్వాష్ యువ క్రీడాకారిణి అనహత్ సింగ్ భారత్ తరఫున మహిళల్లో నెంబర్ వన్ ర్యాంకర్‌గా నిలిచింది. గత వారం చెన్నైలో జరిగిన ఇండియన్ టూర్ టైటిల్ గెలిచిన 17 ఏళ్ల అనహత్.. తాజాగా ప్రకటించిన ప్రపంచ ర్యాంకింగ్స్ మహిళల విభాగంలో ఏకంగా 14 స్థానాలు మెరుగై 68వ ర్యాంక్‌ను సాధించింది. దీంతో ఇప్పటిదాకా భారత్ నుంచి నెంబర్‌వన్ ర్యాంకర్‌గా ఉన్న ఆకాంక్ష సాలుంఖేను అనహత్ అధిగమించింది. జోష్న చినప్ప 133వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్-3లో ఉంది. పురుషుల విభాగంలో రమిత్ టాండన్ 33వ, వెలవన్ సెంథిల్ కుమార్ 39వ స్థానంలో కొనసాగుతున్నారు.

భర్తపై బాక్సర్ స్వీటీ 'పంచ్'లు!



హిసార్ (హరియాణా): వరల్డ్ చాంపియన్ బాక్సర్ స్వీటీ బూరా.. తన భర్త, కబడ్డీ ఆటగాడు దీపక్ హుడాపై పోలీస్ స్టేషన్ సాక్షిగా దాడి చేసింది. ఈ ఘటనకు సంబంధించి వీడియో తాజాగా నెట్టింట వైరల్ అవుతోంది. దీపక్ హుడా తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, దౌర్జన్యం కూడా చేస్తున్నాడని ఆరోపిస్తూ స్వీటీ విడాకుల కోసం దాఖలు చేసింది. అంతేకాదు..భర్తపై హిసార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసుకు సంబంధించి తన వివరణ ఇచ్చేందుకు దీపక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా..భర్తపై స్వీటీ దాడి చేసినట్టు తెలుస్తోంది. స్టేషన్‌లో రెండు కుటుంబాల సమక్షంలోనే.. ఒక్కసారిగా భర్త హుడాపైకి దూసుకెళ్లిన స్వీటీ అతడి గొంతు పట్టుకొని పిడి గుద్దులు కురిపించడం వీడియోలో కనిపించింది. దాంతో ఇరు కుటుంబాల సభ్యులు జోక్యం చేసుకొని స్వీటీని విడదీయాల్సి వచ్చింది. 'పోలీసులు నన్ను ప్రశ్నిస్తున్న సమయంలోనే స్వీటీ, ఆమె తండ్రి నన్ను దుర్భాషలాడారు. నాకు రెండు చోట్ల గాయాలయ్యాయి' అని దీపక్ తెలిపాడు. కాగా, భర్త నుంచి భరణాన్ని ఆశించడం లేదనీ, తనకు విడాకులు ఇస్తే చాలంటూ స్వీటీ ఓ వీడియో విడుదలజేసింది.

భారత షట్లర్లకు క్లిష్టమైన డ్రా

ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

నింగ్బో (చైనా): వచ్చేనెల 8 నుంచి 13 వరకు ఇక్కడ జరిగే ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగం పోటీల్లో భారత షట్లర్లకు క్లిష్టమైన డ్రా ఎదురైంది. పురుషుల సింగిల్స్ ఆరంభ రౌండ్లో లక్ష్యసేన్.. ఈ ఏడాది ఆల్‌ఇంగ్లండ్ ఓపెన్ ఫైనలిస్టు లీ చియా చావో (చైనీస్ తైపీ)తో తలపడనున్నాడు. ఇక, గువాంగ్ జూ లూ (చైనా)తో హెచ్‌ఎస్ ప్రణయ్, కంటఫాన్ వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)తో ప్రియాన్షు రజావత్, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ తొలి రౌండ్ ఆడనున్నారు. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్లో ఈస్తర్ నురుమి (ఇండోనేసియా)తో పీవీ సింధు, మాజీ ప్రపంచ చాంపియన్ ఇంటనాన్ రచానోక్ (థాయ్‌లాండ్)తో అనుపమ, ఫాంగ్ జి గావో (చైనా)తో మాళవిక అమీతుమీ తేల్చుకోనున్నారు. మహిళల డబుల్స్‌లో క్వాలిఫయర్ జంటతో గాయత్రి/ట్రీసా జాలీ జోడీ తమ పోరు ఆరంభించనుంది.

ఏటీఎం నుంచి డబ్బు తీస్తున్నారా...

మీ జేబుకి చిల్లే

మే 1 నుంచి కొత్త చార్జీలు



ఏటీఎం నుంచి డబ్బు తీసుకోవడం సామాన్య మానవులకి మరింత భారం కానుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రాయల్‌పై ఇంటర్ చేంజ్ ఫీజు పెంచడమే ఇందుకు కారణం. మే ఒకటో తేదీ నుంచి ఈ కొత్త చార్జీలు అమలులోకి వస్తాయని దూరదర్శన్ ఒక నివేదికలో తెలిపింది. తమ కస్టమర్లకు ఏటీఎం సేవలందిస్తున్నందుకు ఏదైనా బ్యాంకు.. ఏటీఎం నడుపుతున్న బ్యాంకుకు చెల్లించే ఫీజునే ఇంటర్ చేంజ్ ఫీజుగా వ్యవహరిస్తారు. నిర్వహణ వ్యయాలు పెరిగిపోయిన కారణంగా ఏటీఎం విత్‌డ్రాయల్ చార్జీలు పెంచాలన్న వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు చేసిన అభ్యర్థన మేరకు ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీడీ తెలిపింది.

ఉచిత లావాదేవీలెన్ని..

2014 అక్టోబరు 10వ తేదీన ఆర్‌బీఐ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం మెట్రో నగరాల్లో (ముంబై, న్యూఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్) ఒక బ్యాంకు కస్టమర్లు మరో బ్యాంక్ ఏటీఎం వద్ద చేసే ఉచిత లావాదేవీల సంఖ్య (ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ లావాదేవీలన్నీ కలిపి) నెలకి 5 నుంచి 3కి తగ్గింది. ఈ నగరాలు కాకుండా ఇతర ప్రాంతాల్లో అయితే నెలకి 5 ఉచిత లావాదేవీలను అనుమతిస్తున్నారు. అయితే ఫెయిల్ అయిన లావాదేవీలను మాత్రం అధీకృత లావాదేవీగా పరిగణించవద్దని కూడా ఆర్‌బీఐ బ్యాంకులకు స్పష్టం చేసింది.

ఎంత భారం పడుతుంది?

సాధారణంగా ప్రతి బ్యాంకు తమ కస్టమర్లకు నిర్దిష్ట పరిమితిలో ఉచిత ఏటీఎం విత్‌డ్రాయల్ సదుపాయం అందిస్తోంది. ఆ ఉచిత విత్‌డ్రాయల్ పరిమితి దాటి చేసే ఏ లావాదేవీపై అయినా ఈ అదనపు భారం తప్పదు. గతంలో ఒక్కో ఆర్థిక లావాదేవీకైతే (ఏటీఎం విత్‌డ్రాయల్) ఒక్కో దానిపై రూ.17 ఫీజు వసూలు చేసే వారు. దీన్ని తాజాగా రూ.19కి పెంచారు. నాన్ ఫైనాన్షియల్ లావాదేవీకైతే (బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్ వంటివి) ఒక్కో దానిపై రూ.6 వసూలు చేసే వారు. దీన్ని రూ.7కి పెంచారు. ప్రధానంగా చిన్న బ్యాంకుల కస్టమర్లపై ఈ భారం అధికంగా ఉంటుంది. ఏటీఎం మౌలిక వసతులు, సేవల కోసం చిన్న బ్యాంకులు పెద్ద ఆర్థిక సంస్థలపై ఆధారపడుతూ ఉండడమే ఇందుకు కారణం.

బిజినెస్

ఢిల్లీ హైకోర్టులో 'నాట్కో'కు ఊరట

ఎస్‌ఎంఏ ఔషధ తయారీకి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే నాట్కో ఫార్మాకు ఢిల్లీ హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే 'రిస్‌డిప్లాన్' అనే పేటెంట్ ఔషధాన్ని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జెనరిక్ రూపంలో తయారు చేసి విక్రయించేందుకు న్యాయమూర్తి జస్టిస్ మినిపుష్కరణ అనుమతించారు. ఈ ఔషధాన్ని ప్రస్తుతం స్విస్ ఫార్మా కంపెనీ రోచే భారత్‌లో మార్కెట్ చేస్తోంది. వెన్నుపూస, మెదడులోని నరాల క్షీణతకు కారణమయ్యే స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్‌ఎంఏ) అనే అరుదైన వ్యాధి చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారు. స్విస్ కంపెనీ ప్రస్తుతం ఈ ఔషధంతో కూడిన ఒక్కో సీసాను రూ.6 లక్షల చొప్పున విక్రయిస్తోంది. ఇరవై కిలోల కంటే ఎక్కువ బరువు ఉన్న ఒక్కో ఎస్‌ఎంఏ రోగికి ఈ సీసాలోని ఔషధం 12 రోజులకు మాత్రమే సరిపోతుంది. అంటే సంవత్సరానికి 30 సీసాల చొప్పున ఏటా రూ.1.8 కోట్లు కేవలం ఈ ఔషధం కొనుగోలుకే సరిపోతుంది. దీంతో విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాట్కో ఫార్మా జెనరిక్ రూపంలో చౌకగా ఈ ఔషధాన్ని తయారు చేసేందుకు అనుమతిస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

బ్యాంకుల్లోని అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.78,000 కోట్ల పైమాటే..

వీటిని క్లెయిమ్ చేసుకునేందుకు ఏప్రిల్ నుంచి సులభతర విధానం



న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకుల్లో అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.78,213 కోట్లు దాటాయని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకులు ఈ డిపాజిట్లను క్లెయిమ్ చేసుకునేందుకు సులభతర విధానాన్ని వచ్చే నెల నుంచి ప్రవేశపెట్టనున్నాయి. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. బ్యాంకులు తమ వెబ్‌సైట్‌లో అన్-క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను ఖాతదారుల వివరాలు, పబ్లిక్ సెర్చ్ ఫీచర్‌తో సహా ప్రదర్శించాల్సి ఉంటుంది. ఖాతాదారు లేదా నామినీ డిపాజిట్‌ను తిరిగి తీసుకునేందుకు స్టాండర్డ్ అప్లికేషన్‌తో పాటు డిక్లరేషన్ ఫామ్స్‌ను, సమర్పించాల్సిన డాక్యుమెంట్ల వివరాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి. డిపాజిట్ సొమ్మును క్లెయిమ్ చేసుకునే దరఖాస్తుదారు తన పేరు, మొబైల్ నంబరు, చిరునామా వంటి వివరాలను అప్లికేషన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. అనంతరం, సంబంధిత బ్యాంకు శాఖ దరఖాస్తును తనిఖీ చేసి, సొమ్మును సెటిల్ చేస్తుందని ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉన్నతోద్యోగి ఒకరు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా అన్-క్లెయిమ్డ్ డిపాజిట్ల రికవరీ విధానం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని ఉన్నతాధికారి పేర్కొన్నారు. ప్రస్తుతం అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లను ఆర్‌బీఐకి చెందిన ఉద్గమ్ పోర్టల్‌లో చెక్ చేసుకోవచ్చు. అనంతరం సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌ను సంప్రదించి సొమ్మును క్లెయిమ్ చేసుకోవచ్చు.

రూ.45,000 కోట్లు ప్రత్యేక ఫండ్‌కు బదిలీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు 2019-20 నుంచి 2024-25 (గత ఏడాది డిసెంబరు 31 వరకు) మధ్య కాలంలో రూ.45,000 కోట్లకు పైగా అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లను ఆర్‌బీఐ నిర్వహణలోని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేశాయి. కేంద్ర ఆర్థిక శాఖ స్వయంగా ఈ విషయాన్ని లోక్‌సభకు వెల్లడించింది. సేవింగ్, కరెంట్ ఖాతాల్లో 10 ఏళ్లపాటుగా క్రియారహితంగా ఉన్న సొమ్మును లేదా కాలపరిమితి ముగిసి 10 ఏళ్లయిన టర్మ్ డిపాజిట్లను బ్యాంక్‌లు అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లుగా వర్గీకరిస్తాయి.

గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌కు కేంద్రం స్వస్తి

బ్యాంకులు కొనసాగించవచ్చని ఆర్థిక శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మారుతున్న మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా బుధవారం నుంచి గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్)ను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. బ్యాంకులు మాత్రం 1-3 ఏళ్ల కాలపరిమితితో కూడిన స్వల్పకాలిక గోల్డ్ డిపాజిట్ పథకాలను కొనసాగించవచ్చని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. గత ఏడాది నవంబరు వరకు జీఎంఎస్ ద్వారా 31,164 కిలోల బంగారం సమీకరణ జరిగింది.

లాభాల స్వీకారంతో జోరుకు బ్రేక్

ముంబై: వరుసగా ఆరు రోజుల పాటు అద్భుతమైన ర్యాలీలో ట్రేడయిన ఈక్విటీ మార్కెట్ జోరుకు మంగళవారం బ్రేక్ పడింది. లాభాల స్వీకారంతో ప్రారంభ లాభాలు ఆవిరైపోగా ఈక్విటీ సూచీలు స్వల్ప లాభంతోనే ముగిశాయి. వరుసగా ఏడో రోజు కూడా అదే ఉత్సాహంతో ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 757.31 పాయింట్ల లాభంతో 78,741.69 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకింది. కాని చివరికి 32.81 పాయింట్ల స్వల్ప లాభంతో 78,017.19 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 10.30 పాయింట్ల లాభంతో 23,668.65 వద్ద క్లోజయింది.

● పశ్చిమ గోదావరి జిల్లాలోని అయ్యవరంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ల సర్వేను డ్రోన్లతో విజయవంతంగా నిర్వహించినట్లు 3ఎఫ్ ఆయిల్ పామ్ వెల్లడించింది. ఆయిల్ పామ్ సాగులో ఇది కొత్త ముందడుగని పేర్కొంది. సర్వేలో భాగంగా 530 రైతులకు చెందిన 800 ప్లాంట్లను కవర్ చేసినట్లు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	405
వరంగల్	397	గోదావరి	397
చిత్తూరు	470	విశాఖపట్నం	400
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	105
వరంగల్	99	గుంటూరు	108
కరీంనగర్	99	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	97
విశాఖపట్నం	99	అనంతపురం	97
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,290 ▼	81,850 ▼	1,10,000 ▼
విజయవాడ	90,500 ▼	84,000 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	87,970 ▼	80,640 ▼	98,960 ▲
రాజమండ్రి	89,290 ▼	81,850 ▼	1,00,300 ▼
ప్రొద్దుటూరు	89,950 ▼	83,290 ▼	99,400 ▼
ముంబై	87,751 ▲	80,380 ▲	97,922 ▲

సంగం డెయిరీ టర్నోవర్ రూ.2,000 కోట్లు



పొన్నూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో సంగం డెయిరీ రూ.2,000 కోట్ల టర్నోవర్ సాధించిందని చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం నాడిక్కడ జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంగం డెయిరీ తొలిసారిగా రూ.2,000 కోట్ల మైలురాయిని అధిగమించినట్లు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో రు.2,200 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలోని 52 చిల్లింగ్ సెంటర్ల ద్వారా ప్రతి రోజూ 10.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. రాబోయే కొద్ది రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరో 14 చిల్లింగ్ సెంటర్లను ప్రారంభించి అదనంగా రోజుకు లక్షన్నర లీటర్ల పాలను సేకరించే లక్ష్యంతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రైతులకు రూ.50 కోట్ల బోనస్ అందించాలని పాలకవర్గం ఆమోదించిందన్నారు. సంగం ఉత్పత్తులను చెన్నై వంటి ప్రాంతాలతో పాటు అరబ్, అమెరికా తదితర దేశాలకు ఎగుమతి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

గూగుల్, ఫేస్‌బుక్‌లకు ఊరట

డిజిటల్ ప్రకటనలపై పన్ను పోటు రద్దు

న్యూఢిల్లీ: వాణిజ్య చర్చల్లో అమెరికాను మెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో చర్య తీసుకుంది. గూగుల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఆన్‌లైన్ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వచ్చే ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ పేరుతో విధించే 6 శాతం పన్నును ప్రభుత్వం రద్దు చేసింది. గూగుల్ ట్యాక్స్‌గా పేరొందిన ఈ పన్నును ఏప్రిల్ 1 నుంచి రద్దు చేస్తున్నట్టు తెలిపింది. దీనికి సంబంధించి ఆర్థిక బిల్లు, 2025కు చేసిన సవరణకు పార్లమెంట్ కూడా ఆమోద ముద్ర వేసింది. దీంతో అమెరికా-భారత్ మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు సానుకూలంగా ముగిసే అవకాశాలు మరింత మెరుగయ్యాయని భావిస్తున్నారు. ఈ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో దేశీయ కంపెనీలు ఇచ్చే ప్రకటనలపై 2016లో ప్రభుత్వం ఈ పన్ను విధించింది. దీనిపై అమెరికా గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పన్నును వెనక్కి తీసుకోకపోతే భారత్ నుంచి దిగుమతయ్యే రొయ్యలు, బాస్మతి బియ్యంపై తామూ అదే స్థాయిలో పన్ను విధిస్తామని హెచ్చరించింది. తాజా చర్యతో ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై ప్రకటనల ఖర్చు తగ్గడంతో పాటు వాటి లాభాలూ పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై సీనియర్ సలహాదారు సుధీర్ కపాడియా ప్రభుత్వ చర్యను తెలివైన చర్యగా అభివర్ణించారు. అమెరికాతో తలెత్తిన వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఈ చర్య ఉపకరిస్తుందన్నారు.

ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్‌లోకి ప్యూర్

ప్యూర్‌పవర్ పేరుతో విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ ప్యూర్.. ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్‌లోకి అడుగుపెట్టింది. ప్యూర్‌పవర్ పేరుతో గృహ, వాణిజ్య, గ్రిడ్ విభాగాల కోసం ఈ స్మార్ట్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించింది. మంగళవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో నీతి ఆయోగ్ శాశ్వత సభ్యుడు వీకే సారస్వత్, ప్యూర్ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి, సహ వ్యవస్థాపకుడు రోహిత్ వధేరా ప్యూర్‌పవర్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిశాంత్ మాట్లాడుతూ.. సాధారణ ఇన్వర్టర్లతో పోల్చితే ఈ ఎనర్జీ సొల్యూషన్స్ పూర్తిగా ప్రత్యేకమైనవని అన్నారు. 3,5,15 కేవీఏ సామర్థ్యాల్లో తీసుకువచ్చిన ఈ ఎనర్జీ సొల్యూషన్స్‌తో ఏసీలు, గీజర్లు సహా హెవీ డ్యూటీ గృహోపకరణాలను వాడుకోవచ్చని నిశాంత్ తెలిపారు. ఏఐ యాప్ ఆధారిత మానిటరింగ్, ఉచిత మెయింటెనెన్స్, 10 ఏళ్లకు పైగా జీవితకాలం వీటి ప్రత్యేకత అని ఆయన చెప్పారు. అంతేకాకుండా ఈ ఎనర్జీ సొల్యూషన్స్‌ను సాధారణ విద్యుత్‌తో పాటు రూఫ్‌టాప్ సోలార్‌తో చార్జింగ్ చేసుకునే విధంగా డిజైన్ చేసినట్లు ఆయన వివరించారు. 3కేవీఏ ఎనర్జీ సొల్యూషన్స్ ధర రూ.74,999గా ఉండగా 5 కేవీఏ ధర రూ.99,999, 15కేవీఏ ధర రూ.1,74,999గా ఉన్నాయి. ఏప్రిల్ 1 నుంచి వీటి బుకింగ్స్‌ను ప్రారంభించి అదే నెల 30 నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నిశాంత్ తెలిపారు. హైదరాబాద్ ఐఐటీ సమీపంలోని ప్లాంట్‌లో వీటిని ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా వచ్చే ఏడాది గంటకు 4 మెగావాట్ల సామర్థ్యం గల భారీ ఎనర్జీ స్టోరేజీ సామర్థ్యం గల ప్యూర్‌పవర్ గ్రిడ్‌ను తీసుకురానున్నట్లు నిశాంత్ వెల్లడించారు.









రష్మిక సంతోషించారు

- శ్రీలీల



"రాబిన్‌హుడ్ చిత్రంలో హీరోయిన్‌గా రష్మిక చేయాల్సి ఉంది. ఆమెకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. కానీ డేట్స్ కుదరకపోవడం వల్ల దర్శకుడు వెంకీ కుడుముల నన్ను సంప్రదించారు. తను చేయల్సిన పాత్రను నేను చేసినందుకు రష్మిక ఎంతో సంతోషించారు" అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. ఈ చిత్రంలో ఆమె నితిన్‌కు జోడీగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీలీల మీడియాతో ముచ్చటించారు.

- ఇదొక ఫీల్‌గుడ్‌మూవీ. 'రాబిన్‌హుడ్' చిత్రంలో కథ విభిన్నంగా ఉంటుంది. ఇందులో పూర్తిస్థాయి వినోదం పంచే పాత్ర చేశాను. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్‌తో కాంబినేషన్ సీన్స్ ఆకట్టుకుంటాయి. నితిన్ నాకు మంచి మిత్రుడు. వెంకీ కథను మలిచిన తీరు ప్రేక్షకులను మెప్పిస్తుంది.
- 'పుష్ప 2' విడుదలయ్యాక 'కిస్సిక్' లాంటి ప్రత్యేక గీతాలు చేయమని చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ అంగీకరించలేదు. 'పుష్ప' సినిమాకు జాతీయ స్థాయిలో ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ప్రత్యేక గీతం చేశాను. ఇతర సినిమాల్లో అలాంటి గీతాల్లో నర్తించాలనుకోవడం లేదు. పాటల్లో నృత్యభంగిమలపై మహిళా కమీషన్ స్పందించడం, సమాజంలో చర్చ జరగడం ఆహ్వానించదగిన పరిణామం. నృత్యభంగిమలు అమ్మాయిలకు ఇబ్బందికరంగా ఉండకూడదు. ఒకవేళ అసభ్యకరంగా ఉంటే అది చిత్రీకరణ సమయంలోనే తెలిసిపోతుంది.
- గత ఏడాది చాలా బిజీగా గడిచింది. నేను నటించినవి అరడజనుకి పైగా సినిమాలు విడుదలయ్యాయి. అందుకే ఈ ఏడాది సినిమాలను తగ్గించాను. ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ కావడంతో చదువుపై దృష్టిపెట్టాను. చాలా మంచి సినిమాలు వదులుకున్నాను. ఇకపై వరుసగా సినిమాలు చేస్తాను. తెలుగు అమ్మాయిగా సందేశాత్మక చిత్రాలు చేయాలనుకుంటున్నాను.
- బోర్డర్ దాటిన వెంటనే గాలి మారదు కదా. తెలుగు ఇండస్ట్రీ నా సొంతిల్లు. హిందీ చిత్రాలకే పరిమితమవ్వాలనే ఆలోచన లేదు. అన్నీ బ్యాలన్స్ చేయాలనుకుంటున్నాను. ప్రస్తుతం రవితేజతో 'మాస్ జాతర' చిత్రం చేస్తున్నాను. తమిళంలో సుధ కొంగర దర్శకత్వంలో చేస్తున్న 'పరాశక్తి' చాలా గొప్ప ప్రాజెక్ట్ అవుతుంది. కన్నడలో 'జూనియర్' చిత్రం చేస్తున్నాను.

సెట్స్‌లో గొడవ.. ఇప్పుడంతా ఓ.కే!



నయనతార ప్రధాన పాత్రలో దర్శకుడు సుందర్.సి 'మూకుతి అమ్మన్ 2' (అమ్మోరు తల్లి 2) చిత్రాన్ని ఇటీవల ప్రారంభించిన సంగతి తెలిసిందే. 2020లో విడుదలై ఘనవిజయం సాధించిన మూకుతి అమ్మన్ (అమ్మోరు తల్లి) చిత్రానికి ఇది సీక్వెల్. అయితే షూటింగ్ ప్రారంభించిన కొన్ని రోజులకే సెట్స్‌లో నయనతారకు, అసిస్టెంట్ డైరెక్టర్‌కు మధ్య విభేదాలు వచ్చాయట. ఒక దశలో కోపాన్ని అణుచుకోలేక నయనతార ఆ అసిస్టెంట్ డైరెక్టర్‌పై పెద్దగా అరిచేశారట. దీంతో ఈ సమస్య సద్దుమణిగేవరకూ దర్శకుడు సుందర్ షూటింగ్‌ను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. ఇటువంటి సరిస్థితుల్లో ఇక నయనతారతో పని చేయడం కష్టమనీ, సినిమాలో ఆమెకు బదులుగా తమన్నాను తీసుకుంటే బాగుంటుందేమో అనే ఆలోచన దర్శకుడు సుందర్‌కి వచ్చినట్లు చెబుతున్నారు. అయితే చిత్ర నిర్మాత ఇషారి.కె.గణేశ్ జోక్యం చేసుకోవడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయనీ... షూట్ కూడా తిరిగి ప్రారంభమైందని తాజా సమాచారం. ఈ సినిమా కోసం నయనతార నాన్ వెజ్ కూడా మానేసి భక్తి శ్రద్ధలతో పాత్రను పోషిస్తుండడం గమనార్హం.

పవన్‌కల్యాణ్ కరాటే గురువు
షిహాన్ హుసైని కన్నుమూత



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చిన షిహాన్ హుసైని(60) మరణించారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. షిహాన్ హుసైని 1986లో విడుదలైన 'పున్నగై మన్నన్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయం అయ్యారు. కాగా, షిహాన్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పోస్టు పెట్టారు. 'షిహాన్ హుసైని' తుదిశ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు గురయ్యాను. ఆయన వద్ద కరాటేలో శిక్షణ పొందాను. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని నాలుగు రోజుల క్రితమే తెలిసింది. ఈనెల 29న చెన్నై వెళ్లి పరామర్శించాలని అనుకున్నా. ఈలోపే దుర్వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదు. 'తమ్ముడు' సినిమాలో సన్నివేశాలకు ఆయన ఇచ్చిన శిక్షణే ఉపయోగపడింది' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

భారతీరాజా కుమారుడు మనోజ్ ఇకలేరు

- కార్డియాక్ అరెస్ట్‌తో హఠాన్మరణం



తమిళ దర్శక దిగ్గజం భారతీరాజా కుమారుడు, నటుడు, దర్శకుడు మనోజ్(48) హఠాన్మరణం చెందారు. కొన్ని నెలల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ ఆయన చేయించుకున్నారు, మంగళవారం సాయంత్రం కార్డియాక్ అరెస్ట్ కావడంతో చెట్‌పట్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1999లో 'తాజ్‌మహల్' అనే చిత్రం ద్వారా వెండితెరకు హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'సముద్రం', 'కడల్ పూక్కల్', 'సముద్రం, 'అల్లి అర్జున', 'వరుష మెల్లాం వసంతం', 'ఈర నిలమ్' వంటి పలు విజయవంతమైన తమిళ చిత్రాల్లో హీరోగా నటించారు. 2023లో 'మార్గళి తింగల్' అనే సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. మలయాళ నటి అశ్వతి అలియాస్ నందనను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆయనకు అర్షిత, మదివదని అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, మనోజ్ మరణవార్త తెలియగానే కోలీవుడ్ చిత్రపరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. మనోజ్ ఆకస్మిక మృతిపట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

భావోద్వేగాలు అలరిస్తాయి



మాధవన్, నయనతార, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ ప్రధాన తారాగణంగా రూపొందిన క్రీడా నేపథ్య చిత్రం 'టెస్ట్'. ఎస్. శశికాంత్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఏప్రిల్ 4న తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకొస్తోంది. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా మాధవన్ మాట్లాడుతూ 'అందరినీ కట్టిపడేసే భావోద్వేగాలు, అదరగొట్టే యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రంలో మిళితమై ఉంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రికెట్ ఆట నేపథ్యంలో తెరకెక్కిన చిత్రంగా మాత్రమే దీన్ని చూడొద్దు. సినిమాలో అంతకు మించి ఉంది. జీవితంలోని ఎత్తుపల్లాలు, మానవీయ విలువలను ప్రతిబింబించే కథ ఇది' అన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది

- సూర్యదేవర నాగవంశీ



'పుష్ప-2' ఘన విజయం తర్వాత అల్లు అర్జున్ చేయబోయే సినిమాలపై అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అల్లు అర్జున్ చేతిలో అట్లీ, త్రివిక్రమ్, సందీప్‌రెడ్డి వంగా సినిమాలు ఉన్నాయి. అయితే వీటిలో తొలుత ఏది సెట్స్‌పైకి వెళ్తుందనే విషయమై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. అట్లీ చిత్రం పక్కా కమర్షియల్ అని, అలాగే త్రివిక్రమ్ తెరకెక్కించనున్న సినిమాలో అల్లు అర్జున్‌ది సుబ్రమణ్యేశ్వర స్వామి పాత్ర అని టాలీవుడ్‌లో ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో నిర్మాత సూర్యదేవర నాగ వంశీ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. 'మ్యాడ్ స్క్వేర్' ప్రమోషన్‌లో భాగంగా తాజాగా తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'త్రివిక్రమ్, అల్లు అర్జున్‌లతో మైథాలజీ సినిమా చేస్తున్నాం. ఆ సినిమా చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది. మన పురాణాల్లో ఉన్న ఓ దేవుడి గురించి చూపించబోతున్నాం. అందరికీ తెలిసిన దేవుడు ఆయన. ఆయన కథతో ఈ సినిమా చాలా గ్రాండ్‌గా ఉండబోతుంది' అని తెలిపారు. కాగా, అల్లు అర్జున్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' సినిమాలు బాక్సాఫీసు వద్ద ఎంతటి ఘన విజయాలు నమోదు చేశాయో తెలిసిన విషయమే. తాజాగా నాగవంశీ ప్రకటనతో వీరిద్దరి సినిమాపై అంచనాలు తార స్థాయికి చేరుకున్నాయి.



వార్నర్‌కు రాజేంద్రప్రసాద్ క్షమాపణలు

ఆస్ట్రేలియన్ స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ క్షమాపణలు చెప్పారు. హీరో నితిన్- డేవిడ్ వార్నర్ నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డేవిడ్ వార్నర్‌పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈవెంట్‌కు తాగి వచ్చారా? అంటూ రాజేంద్రప్రసాద్‌పై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తప్పు తెలుసుకున్న రాజేంద్ర ప్రసాద్, డేవిడ్ వార్నర్‌కు బహిరంగ క్షమాపణలు చెబుతూ వీడియో విడుదల చేశారు. 'నేను ఉద్దేశపూర్వకంగా ఎవరినీ బాధించలేదు. నితిన్-వార్నర్ నాకు పిల్లల్లాంటి వారు. సరదాగా చేసిన ఆ వ్యాఖ్యల వల్ల ఎవరైనా ఇబ్బందిపడుంటే క్షమించండి' అని ఆ వీడియోలో పేర్కొన్నారు.



ట్రెండ్‌కు తగ్గ చిత్రం

వి.సముద్ర

వేణుగోపాల్, పార్థు, అనూష జైన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'సీతన్నపేట్ గేట్'. వై.రాజ్‌కుమార్ దర్శకత్వంలో ఆర్.శ్రీనివాస్ నిర్మించారు. ఏప్రిల్ 4న సినిమా విడుదలవుతోంది. మంగళవారం, చిత్రబృందం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ "ఇప్పటి ట్రెండ్‌కు సరిపోయే చిత్రమిది. ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "మానవ సంబంధాల చుట్టూ తిరిగే కథ ఇది. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించాం. ఊహించని మలుపులతో సినిమా ఉంటుంది" అని చిత్రదర్శకుడు వై.రాజ్‌కుమార్ చెప్పారు. "బలమైన కంటెంట్‌తో రూపొందిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ అందరినీ ఆకట్టుకుంటుంది" అని నిర్మాత ఆర్.శ్రీనివాస్ తెలిపారు.

ఆకట్టుకునే పాటలతో...



డాక్టర్ సాయివెంకట్ టైటిల్ పాత్ర పోషించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జయహో రామానుజ'. జో శర్మ కథానాయిక. సుమన్ కీలకపాత్రలో నటించారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మించారు. త్వరలో పలు భారతీయ భాషల్లో ఈచిత్రాన్ని విడుదల చేస్తున్నారు. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. సాయివెంకట్ మాట్లాడుతూ 'తెలుగు ప్రజలకు రామానుజాచార్యుల గొప్పదనాన్ని తెలియజేసేందుకు ఈ సినిమా చేశాను. ఈ చిత్రంలోని పాటలన్నీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది' అని తెలిపారు.

టైమంటే టైమే!

సుదీర్ఘ చర్చలకు సెలవు

- ఇప్పటివరకూ ఏం చేశారు?
- ఇకపై ఏం చేయబోతున్నారు?
- సుత్తి లేకుండా సూటిగా చెప్పండి
- ఏసీ గదుల్లో కూర్చుంటే పనులు కావు
- ప్రజల మధ్యకు వెళ్లి పనిచేయాలి
- సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- కొత్త పంథాలో కలెక్టర్ల సదస్సు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సుదీర్ఘ చర్చలు, అంతూపొంతూ లేని ప్రసంగాలకు ఫుల్‌స్టాప్ పడింది. టైమ్ అంటే టైమే. ఒక్క నిమిషం ఎక్కువ మాట్లాడినా గణగణ అంటూ బెల్ మోగాల్సిందే. 'ఇప్పటివరకూ ఏం చేశారు? ఇకపై ఏం చేయబోతున్నారో సుత్తి లేకుండా సూటిగా చెప్పండి...' అని సీఎం చంద్రబాబు స్పష్టంగా ఆదేశించారు. మంగళవారం మొదలైన జిల్లా కలెక్టర్ల రెండు రోజుల సదస్సులో ప్రభుత్వం కీలక మార్పును తీసుకొచ్చింది. ఏ విషయం పైనా సుదీర్ఘంగా మాట్లాడకుండా, అనవసరమైన చర్చలు లేకుండా అజెండాకే కట్టుబడి, నిర్దిష్ట సమయం పాటించేలా చంద్రబాబు తనదైన మార్పును ఆచరణలో చూపించారు. గతేడాది డిసెంబరులో జరిగిన కలెక్టర్ల సదస్సు సుదీర్ఘంగా సాగిన సంగతి తెలిసిందే. ఉదయం 10 నుంచి రాత్రి 11.45 గంటల వరకూ ఏకధాటిగా సాగిన ఆ సమావేశంలో అజెండా కూడా సరిగ్గా పాటించలేదు. నగటున ఒక్కో శాఖ రెండు గంటల చొప్పున ప్రజెంటేషన్ ఇచ్చి సమావేశాన్ని లక్ష్యానికి భిన్నంగా తీసుకెళ్లారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో సీఎం స్పందించారు. ఇకపై సుదీర్ఘ చర్చలు, ప్రజెంటేషన్లు ఉండవని, సమయ పాలనను పక్కగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం నాటి సమావేశంలో దీన్ని అక్షరాలా అమలు చేసి చూపించారు. అజెండా తయారీ నుంచి అన్నీ క్లుప్తంగా ఉండేలా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కో శాఖ ఐదారు స్లైడ్‌లకు వించకుండా ప్రజెంటేషన్‌లో ఉండేలా కట్టడి చేశారు. సమావేశం ప్రారంభంలోనూ, ఆయా శాఖలపై చర్చల సందర్భంలోనూ సమయపాలన గురించి సీఎం పదేపదే గుర్తుచేశారు, తన ప్రసంగం కూడా చాలా క్లుప్తంగా ఉండేలా జాగ్రత్తపడ్డారు. గంటసేపు మాట్లాడాల్సిన ముఖ్యమంత్రి 40 నిమిషాల్లోనే ముగించారు. 'సూటిగా మాట్లాడాలి? మీకేం కావాలో స్పష్టంగా చెప్పాలి?' అని చంద్రబాబు పలుమార్లు కార్యదర్శులకు చురకలంటించారు. ఈసారి కలెక్టర్లతో మాట్లాడించే ప్రయత్నం చేశారు.

కలెక్టర్ల పనితీరును ప్రత్యక్షంగా సమీక్షిస్తా

ఈ సమావేశం ఆద్యంతం చంద్రబాబు ఉత్సాహంగా, హుషారుగా కనిపించారు. రెవెన్యూ, వాతావరణ పరిస్థితులు, సంక్షేమం, శాంతిభద్రతలు తదితర అంశాలపై సూటిగా ప్రశ్నలు అడిగారు. అజెండాలోని పలు అంశాల్లో లోపాలను ఎత్తిచూపి సంబంధిత కార్యదర్శులను ప్రశ్నించారు. ఏసీ గదుల్లో కూర్చొంటే పనులు కావని, ప్రజల మధ్యకు వెళ్లి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 'ఏజెన్సీలో ఆదాయం తీసుకొచ్చే వాణిజ్య పంటలను సాగు చేసేందుకు మీ దగ్గర ఉన్న ప్రణాళికలు ఏమిటి?' అని సీఎం ప్రశ్నించారు. స్ట్రాబెర్రీ, అవకాడో, జాక్ ఫ్రూట్ పంటల సాగు, ధరలు, ఆదాయం గురించి వివరాలు కోరగా అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. ఇకపై కలెక్టర్ల పనితీరును ప్రత్యక్షంగా సమీక్షిస్తానన్నారు.



ఉపాధి నిధుల విడుదలలో వివక్ష లేదు

» బెంగాల్‌లో ఉపాధి నిధుల దుర్వినియోగం: పెమ్మసాని

న్యూఢిల్లీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపడం లేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ కంటే తమిళనాడుకు అధికంగా నిధులు ఇచ్చామని చెప్పారు. తమిళనాడుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.7,300 కోట్లు వచ్చాయన్నారు. మంగళవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు ఉపాధి హామీ నిధుల విడుదలలో వివక్ష చూపుతున్నారని ప్రశ్నించగా కేంద్ర మంత్రి ఈమేరకు సమాధానం ఇచ్చారు. "తమిళనాడు జనాభా 7 కోట్లు, ఉత్తరప్రదేశ్ జనాభా 20 కోట్లకుపైగానే ఉంది. కానీ, ఉపాధి నిధుల్లో తమిళనాడుకే ఎక్కువగా ఇస్తున్నాం. తమిళనాడుకు రూ.10 వేల కోట్లు ఇస్తుండగా, యూపీకి రూ.10 వేల కోట్ల లోపే ఇస్తున్నాం" అని వివరించారు. పశ్చిమబెంగాల్‌కు ఇస్తున్న ఉపాధి నిధులు దుర్వినియోగం అవుతున్నాయని మంత్రి చెప్పారు.

వైసీపీ కార్యాలయానికి వేగంగా స్థలం

» టీడీపీ అడుగుతుంటే స్పందించని అధికారులు: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ వచ్చేది రాజమండ్రి సెంట్రల్ జైలుకే అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. 'జగన్ హయాంలో జరిగిన మైనింగ్, లిక్కర్ కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. జగన్ జైలు ఊచలు లెక్కపెట్టడం ఖాయం. గతంలో వైసీపీ కార్యాలయానికి వేగంగా స్థలాన్ని కేటాయించిన అధికారులు.. ఇప్పుడు టీడీపీ ఆఫీసుకోసం స్థలం అడుగుతుంటే ఇవ్వడంలేదు' అన్నారు.

పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించండి: షర్మిల

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఇంధన ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి. పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. "గడచిన పదేళ్లుగా టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు రెండూ రూ.50,000 కోట్ల మేర పెట్రో ఉత్పత్తులపై భారాన్ని మోపాయి. పన్నులతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు, జగన్ లూటీ చేశారు. పెట్రో ఉత్పత్తులపై లీటరుకు రూ.17 తగ్గించి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలి. పెట్రో ధరలు ఎప్పుడు తగ్గిస్తారో చెప్పాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

జనగణనలో కులగణన చేపట్టాలి: రామకృష్ణ

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగానే కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేతి వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా ప్రస్తుతం కులగణనపై చర్చ జరుగుతుంటే.. ఏపీలో దీనిపై ఎలాంటి చర్చ లేకపోవడం బాధాకరం' అని రామకృష్ణ అన్నారు.

డీలిమిటేషన్.. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

» జస్టిస్ వర్మ ఉదంతం న్యాయవ్యవస్థకు కళంకం: సీపీఐ నారాయణ

న్యూఢిల్లీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఫెడరల్ స్ఫూర్తికి డీలిమిటేషన్ విఘాతమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నిర్ణయం దేశాన్ని ఉత్తర, దక్షిణాలుగా విభజిస్తోందని విమర్శించారు. కాగా, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ అవినీతి ఉదంతం దేశ న్యాయ వ్యవస్థకే కళంకంగా మారిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కోల్పోతోందన్నారు.

పీఎం కిసాన్‌తో ఏపీలో 41 లక్షల మందికి లబ్ధి

న్యూఢిల్లీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ కింద 19వ విడత (2024 డిసెంబరు-మార్చి 2025) నిధుల విడుదలలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.854.28 కోట్లు ఇచ్చామని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. దీనివల్ల ఏపీలో 41,27,619 మంది రైతులు లబ్ధి పొందారని వివరించారు. లోక్‌సభలో ఎంపీ బెన్నీ బెహనన్ మంగళవారం అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

సీమ, దక్షిణ కోస్తాలో మండిన ఎండలు

» నేటి నుంచి మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్ర, కర్ణాటక మీదుగా తమిళనాడు వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో మంగళవారం ఉత్తరకోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో మాత్రం ఎండ తీవ్రత కొనసాగింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత పెరుగుతుందని, పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. కాగా మంగళవారం నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.6, ప్రకాశం జిల్లా దరిమడుగులో 41.1, నెల్లూరు జిల్లా సోమశిలలో 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 15 మండలాల్లో వడగాడ్పులు వీచాయి.

రేపు పోలవరానికి సీఎం

సీఎం చంద్రబాబు గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. కాగా, పోలవరం భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలపై మంగళవారం విజయవాడలో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించారు. వచ్చే నెలాఖరుకు పునరావాస కాలనీల నిర్మాణానికి టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఐదుగురు నక్సల్స్ మృతి

» మృతుల్లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు

చింతూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురి మృతదేహాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడితో పాటు అతని ఇద్దరు అంగరక్షకులు ఉన్నారు. దంతెవాడ జిల్లా ఘీదం పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం మేరకు 500 మంది జవాన్లు అక్కడకి చేరుకున్నారు. వీరిలో బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. ఈ క్రమంలో ఉదయం 8 గంటలకు నుంచి ప్రారంభమైన ఎదురు కాల్పులు మధ్యాహ్నం 1 వరకు జరిగాయి. ఆ తర్వాత గాలింపు చేపట్టిన జవాన్లు ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను కనుగొన్నారు. మరో ఇద్దరు మావోయిస్టులు కూడా మృతి చెంది ఉంటారని అక్కడి ఆనవాళ్లను బట్టి అంచనా వేస్తున్నారు. మృతుల్లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సుధీర్ అలియాస్ సుధాకర్, అలియాస్ సోన్సే, అలియాస్ మురళి ఉన్నారు.

అవినాశ్ డైరెక్షన్ కృష్ణారెడ్డి యాక్షన్

(మొదటి పేజీ తరువాయి)

నివేదించింది. వివేకా హత్య కేసును తారుమారు చేసేందుకు వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మార్గదర్శకత్వంలో రిటైర్డ్ అదనపు ఎస్పీ రాజేశ్వర్‌రెడ్డి, ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి ప్రయత్నించిన తీరును సోదాహరణంగా వివరించింది. కృష్ణారెడ్డి ప్రైవేటు ఫిర్యాదుపై జరిపిన దర్యాప్తు వివరాలతో ప్రస్తుత దర్యాప్తు అధికారి, పులివెందుల ప్రస్తుత డీఎస్పీ బి.మురళి పులివెందుల కోర్టుకు తుది నివేదికను సమర్పించారు. ఆ నివేదికను రాష్ట్రప్రభుత్వం తన అఫిడవిట్‌కు జతచేసింది. లోతైన దర్యాప్తుతో వెలుగులోకి వచ్చిన అదనపు వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని తగు ఆదేశాలు జారీచేయాలని డీఎస్పీ కోర్టును అభ్యర్థించారు. వివేకా హత్య కేసును తప్పుదోవ పట్టించేందుకు అవినాశ్‌రెడ్డి నిర్దేశం మేరకు రిటైర్డ్ అదనపు ఎస్పీ రాజేశ్వర్‌రెడ్డి, ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి ప్రయత్నించారని.. రాంసింగ్(ఏ-1), నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి (ఏ-2), సునీత(ఏ-3)లపై తప్పుడు కేసు నమోదు చేశారని ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. ఉద్దేశపూర్వకంగా కేసును తారుమారు చేసేందుకు కుట్ర జరిగిందని తెలిపింది. కృష్ణారెడ్డిని రాంసింగ్ విచారించనేలేదనడానికి సీసీటీవీ ఫుటేజీలతోపాటు పలు సాక్ష్యాలను కోర్టుకు సమర్పించింది. తనను రాంసింగ్ హింసించారని.. సునీత, రాజశేఖర్‌రెడ్డి తనను బెదిరించారని ఆయన చేసిన ఆరోపణలన్నీ కట్టుకథలేనని స్పష్టం చేసింది. అఫిడవిట్‌లో ఏమున్నదంటే..

సీఐని బెదిరించి సంతకం చేయించారు..

రాంసింగ్, రాజశేఖర్‌రెడ్డి, సునీతపై కేసుకు సంబంధించి మొదట దర్యాప్తు చేసిన జి.రాజు ప్రొఫెషనల్‌గా విచారణ జరుపలేదు. పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు 2023 డిసెంబరు 15న రాంసింగ్, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సునీతలపై వివిధ సెక్షన్ల కింద ఆయన కేసు నమోదుచేశారు. ఆ వెంటనే రిటైర్డ్ అదనపు ఎస్పీ రాజేశ్వరరెడ్డి, పులివెందుల ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి రంగంలోకి దిగారు. దర్యాప్తును అనధికారికంగా తమ చేతుల్లోకి తీసుకున్నారు. 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రాథమిక చార్జిషీటుకు రూపకల్పన చేశారు. పలువురు సాక్షులను రామకృష్ణారెడ్డి ఇంటికే పిలిపించి.. ల్యాప్‌టాప్‌లో వారి వాంగ్మూలాలు రికార్డు చేశారు. వాటిపై రామకృష్ణారెడ్డి వారితో బలవంతంగా సంతకాలు చేయించారు. ఆ సాక్షుల్లో కొందరు తనకు తెలుసని, అయితే ఈ కేసులో వారినెప్పుడూ తాను విచారించలేదని సీఐ జి.రాజు తాజా వాంగ్మూలంలో స్పష్టం చేశారు. కేసులో వాస్తవాలను ఎక్కడా బహిర్గతం చేయొద్దంటూ బీసీనైన తనను ఏఎస్ఐ, అదనపు ఎస్పీ హెచ్చరించారని, మానసికంగా ఆందోళనకు గురిచేశారని, వాస్తవాలను ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌లో నమోదు చేయొద్దని కూడా ఒత్తిడి తెచ్చారని ఆయన తెలిపారు. అలాగే క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్)లో కూడా సీడీలను అప్‌లోడ్ చేయొద్దని వారు హెచ్చరించినట్లు వెల్లడించారు. వివేకా హత్య కేసు తీవ్రతను తగ్గించేందుకు.. ఆ కేసు క్రైం సీనుపై.. పై ముగ్గురిపై పెట్టిన కేసు ముసుగులో రామకృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి చర్చించారు. తద్వారా సీబీఐ దర్యాప్తును తారుమారు చేయడానికి ప్రయత్నించారు. హత్య రోజు క్రైమ్ సీను పరిశీలనకు సంబంధించి తొలుత ఏపీ పోలీసులు, తర్వాత సీబీఐ జరిపిన విచారణకు వ్యతిరేకంగా వేరే కథనం సృష్టించి.. భవిష్యత్‌లో జరిగే సీబీఐ కోర్టు ట్రయల్‌లో దానిని తమకు అనుకూలంగా వాడుకునేందుకు ప్రయత్నించారు. విచారణ పూర్తయ్యాక కేసు డైరీపై సంతకం చేయడానికి రాజు నిరాకరించారు. రామకృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి ఆయన్ను ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇంటికి తీసుకెళ్లారు. తాము చెప్పినట్లు చేయకపోతే తీవ్ర పరిణామాలుంటాయని అక్కడ హెచ్చరించారు. ఒత్తిళ్లకు లొంగి కేసు డైరీపై సంతకం చేశానని ఆ అధికారి వెల్లడించారు. అంతేకాదు.. రాంసింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డి కోర్టును ఆశ్రయిస్తారన్న భయంతో.. కేసు దర్యాప్తు పూర్తికాక ముందే హడావుడిగా ప్రాథమిక చార్జిషీటు సైతం దాఖలుచేశారు. ఈ కుట్రలో రాజేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డిలే ప్రధాన పాత్రధారులు.



కృష్ణారెడ్డి

కృష్ణారెడ్డిని రాంసింగ్ ప్రశ్నించలేదు..

రాంసింగ్ 2021 ఆగస్టు 12న తనను పులివెందులలోని అర్‌అండ్‌బీ అతిథిగృహానికి పిలిచి.. సునీతారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ప్రోద్బలంతో.. దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిల పేర్లు చెప్పాలంటూ తన పాదంపై లాఠీతో కొట్టారని కృష్ణారెడ్డి ఆరోపణ. తన అరుపులను గెస్ట్‌హౌస్ డ్రాయింగ్ రూంలో ఉన్న 16వ సాక్షి ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి కూడా విన్నారని చెప్పారు. అలాగే అదే ఏడాది నవంబరు 30న తన ఇద్దరు కుమారులతో కలిసి కడప సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్‌కు వెళ్లానని.. అక్కడ మళ్లీ శివశంకర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పేర్లు చెప్పాలని.. లేకపోతే జైలుకు వెళ్తావని రాంసింగ్ బెదిరించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని కృష్ణారెడ్డి ఆరోపించారు. నాటి పులివెందుల సీఐ రాజు 2023 డిసెంబరు 15, 17 తేదీల్లో పోలీసు స్టేషన్లో తనను విచారించారని కృష్ణారెడ్డి చెప్పారు. అయితే స్టేషన్ సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తే ఆ తేదీల్లో ఆయన అక్కడకు రానేలేదని తేలింది. విచారణ కోసం 2021 మార్చి 3, 31 తేదీల్లో తనను సీబీఐ ఢిల్లీ పిలిపించిందని.. దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి చెబితేనే నేరస్థలమైన వివేకా ఇంట్లో బెడ్రూం, బాత్‌రూంలను శుభ్రం చేయడం, వివేకా నుదుటిపై రక్తం తుడిచేయడం.. మృతదేహాన్ని బాత్రూం నుంచి బయటకు తీసుకొచ్చామని చెప్పాల్సిందిగా రాంసింగ్ అక్కడ తనపై థర్డ్ డిగ్రీ, చిత్రహింసలకు గురిచేశారన్నది కృష్ణారెడ్డి చేసిన మరో ప్రధాన ఆరోపణ. ఈ విషయాన్ని రాజశేఖర్‌రెడ్డికి, సునీతకు చెబితే.. సీబీఐకి సహకరిస్తే ఇలాంటి సమస్యలు ఉండవని వారు అన్నారని తెలిపారు. 2021 అక్టోబరు 18న రాజశేఖర్‌రెడ్డి తనకు ఫోన్ చేస్తే హైదరాబాద్‌లోని సునీత, రాజశేఖర్‌రెడ్డిల ఆఫీసుకు వెళ్లానని.. రాజశేఖర్‌రెడ్డి తన 2 ఫోన్లను తీసుకున్నారని.. రాంసింగ్ చెప్పినట్లు చేయాలంటూ తనను ఒత్తిడి చేశారని.. తాను తిరస్కరించానని కృష్ణారెడ్డి చెప్పారు. వివేకా భార్య సౌభాగ్యమ్మను కలిస్తే ఆమె తన కారులో తమను కడపకు పంపారని తెలిపారు. అయితే ఇందులో ఒక్క నిజం కూడా లేదు. సీసీటీవీ ఫుటేజీలు, కాల్‌డేటాను లోతుగా పరిశీలించాక.. సాక్షులను విచారించాక.. కృష్ణారెడ్డి చెప్పిన తేదీల్లో ఆయన పోలీసు స్టేషన్‌కే వెళ్లలేదని తేలింది. రాంసింగ్ గానీ, మరే సీబీఐ అధికారి గానీ ఆయన్ను చిత్రహింసలకు గురిచేశారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. పైగా తనను టార్చర్‌కు గురిచేశారని సీబీఐ ఉన్నతాధికారులకు ఆయన ఫిర్యాదు చేయలేదు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు కూడా చెప్పలేదు. గాయపడినట్లు సర్టిఫికెట్లో, ఆ గాయాల ఫొటోలో కూడా చూపలేదు. పులివెందుల గెస్ట్‌హౌస్‌లో కృష్ణారెడ్డిని రాంసింగ్ ఎప్పుడూ విచారించలేదు. 2021 అక్టోబరు 12న ఆయన్ను ప్రశ్నించింది సీబీఐ ఎస్ఐ దేవేందర్ మీనా. పైగా సీబీఐకి అనువాదకుడిగా వ్యవహరించిన పోలీసు కానిస్టేబుల్ కమ్రుద్దీన్ సమక్షంలో ఆయన్ను విచారించారు. గెస్ట్‌హౌస్ కేర్ టేకర్, స్వీపర్ ఇచ్చిన వాంగ్మూలాలు కూడా కృష్ణారెడ్డి ఆరోపణలను బలపరచడం లేదు. ఆ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలోనే పోలీసుస్టేషన్, కోర్టు, ఆస్పత్రి కూడా ఉన్నాయి. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటూ కృష్ణారెడ్డి వాటిని ఆశ్రయించిన దాఖలాలులేవు. దేవేంద్ర మీనా వాంగ్మూలం ప్రకారం.. ఆ సమయంలో వివేకా హత్య కేసుకు సంబంధించి రాంసింగ్ పులివెందుల కోర్టులో ఉన్నారు. ఆయన గెస్ట్‌హౌస్‌కు రాలేదని అక్కడి సిబ్బంది కూడా స్పష్టంచేశారు. అలాగే కృష్ణారెడ్డిని రాంసింగ్ ఎప్పుడూ ఢిల్లీలో విచారించలేదు. అయితే 2012 మార్చి 10న సీబీఐ డీఎస్పీ దీపక్ గౌర్, 11, 12 తేదీల్లో ఇన్‌స్పెక్టర్ ఆర్‌పీ శుక్లా ఆయన్ను ప్రశ్నించారు. అలాగే రాంసింగ్ ఆయన్ను 2021 నవంబరు 31న కడప జైలు గెస్ట్‌హౌస్‌లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ తోట హరికృష్ణ సమక్షంలో విచారించారు. ఆరోజు రాంసింగ్ తనను అరగంట పాటు తొడలపైన, చేతులపైనా కొట్టారని చేసిన ఆరోపణలకు కూడా కృష్ణారెడ్డి ఆధారాలు సమర్పించలేదు. ఆయన, పక్క గదిలోనే ఉన్న ఆయన కుమారు లు సదరు గాయాల ఫొటోలను గానీ, మెడికల్ సర్టిఫికెట్లు గానీ చూపలేకపోయారు. కృష్ణారెడ్డి లోపలకు వెళ్లేటప్పుడు, బయటకు వచ్చినప్పుడు పూర్తి ఆరోగ్యం తో ఉన్నారని జైలు గెస్ట్‌హౌస్ గార్డులు కూడా వాం గ్మూలం ఇచ్చారు. అందుచేత రాంసింగ్ ఆయనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనడం సత్యదూరం. అలాగే కృష్ణారెడ్డిని రాజశేఖర్‌రెడ్డి, సునీత బెదిరించడారనడానికి ఆధారాల్లేవు. అలాగే కృష్ణారెడ్డి, ఆయన కుమారుడు హైదరాబాద్‌లో తననెప్పుడూ కలవలేదని, తన కారు కూడా ఇవ్వలేదని సౌభాగ్యమ్మ చెప్పారు. అసలా రోజు (2021 అక్టోబరు 18) వారిద్దరూ సునీత ఆఫీసుకే వెళ్లలేదని రుజువైంది.

- తన కుమారుడు త్రిలోక్‌రెడ్డికి తమ కుమార్తెను ఇచ్చి పెళ్లిచేసేందుకు అంగీకరించిన గుంటూరుకు చెందిన అచ్చిరెడ్డిని కూడా రాంసింగ్, రాజశేఖర్‌రెడ్డి, సునీత బెదిరించారని, దాంతో పెళ్లి సంబంధం రద్దయిందని కృష్ణారెడ్డి ఆరోపణ చేశారు. ఆ ముగ్గురూ తమను బెదిరించలేదని అచ్చిరెడ్డి, పెళ్లిపెద్ద బొంతు నాగిరెడ్డి స్పష్టం చేశారు. వివేకా హత్యతో కృష్ణారెడ్డికి సంబంధం ఉందని మీడియాలో చూశాక తామే రద్దుచేసుకున్నామన్నారు.
- కృష్ణారెడ్డి తాను చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపడంలో విఫలమయ్యారు. గత ఏడాది అక్టోబరు 17న సీఐ రాజును విచారించినపుడు.. నేరాలు జరిగినట్లు కృష్ణారెడ్డి చెప్పిన పులివెందుల ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, కడప సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్, ఢిల్లీ సీబీఐ హెడ్ క్వార్టర్స్‌లకు గానీ, హైదరాబాద్‌లోని సునీత కార్యాలయానికి గానీ తాను వెళ్లలేదని.. సాక్షులను విచారించలేదని ఆయన తెలియజేశారు. ఈ కేసును రాజు దర్యాప్తు చేయలేదని, అనధికారికంగా రాజేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి నేరపూరిత కుట్రతో, దురుద్దేశపూర్వకంగా తమ చేతుల్లోకి తీసుకుని.. విచారణను తప్పుదోవ పట్టించారని, రికార్డులు తారుమారుచేశారని.. కేసు ఫైలుపైగా బలవంతంగా రాజుతో సంతకాలు చేయించారని స్పష్టమవుతోంది. వివేకా హత్య కేసు నిందితులకు సానుకూలత ఏర్పరచడానికి రాజేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి వ్యవహరించిన తీరు దుష్ప్రవర్తన కిందకు వస్తుంది. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు.

స్థానికతపై దారెటు?

ఇంకా ఎటూ తేల్చని ఉన్నత విద్యాశాఖ

» స్థానికత తేల్చకుండానే ఈఏపీసెట్ నోటిఫికేషన్

» ప్రభుత్వ నిర్ణయం ఆధారంగా అడ్మిషన్లు అని నిబంధన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

స్థానికత అంశంపై ఉన్నత విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఓవైపు పక్క రాష్ట్రం తెలంగాణ నెల రోజుల ముందే ఏపీ విద్యార్థులకు కోటా లేదని తేల్చేయగా... ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ మాత్రం ఇంకా ఆలోచన స్థాయిలోనే ఉంది. ఫలితంగా స్థానికతపై స్పష్టత ఇవ్వకుండానే ఈఏపీసెట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. పరీక్ష రాయడానికి తెలంగాణ విద్యార్థులు కూడా అర్హులే అయినా.. సీటు కేటాయింపుపై మాత్రం గ్యారెంటీ లేదని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా సీట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేసింది. అయితే ఏపీఈఏపీసెట్ రాసిన తెలంగాణ విద్యార్థులు అర్హత సాధించాం కాబట్టి సీటు ఇవ్వాలని పట్టుబడితే పరిస్థితి ఏమిటనేది అర్థం కావట్లేదు..!

ఏపీ విద్యార్థులకు కోటా రద్దు

ఉన్నత విద్యలో ప్రాంతాల ఆధారంగా అన్‌రిజర్వ్‌డ్ కోటా అమలవుతుంది. రాష్ట్రపతి ఉత్తర్వులు 371(డి) ప్రకారం ఉమ్మడి ఏపీలో ప్రాంతాల వారీగా రిజర్వేషన్లు అమలు చేశారు. ఆంధ్రా, శ్రీవెంకటేశ్వర, ఉస్మానియా వర్సిటీలు ఇందులో ఉన్నాయి. ఉస్మానియా రీజియన్ పరిధి తెలంగాణ మొత్తం ఉంటుంది. ఏపీలో 2 భాగాలుగా ఆంధ్రా, శ్రీవెంకటేశ్వర ఉన్నాయి. ఈ 3 వర్సిటీలను రీజియన్లుగా తీసుకుంటారు. ఇందులో ప్రతి వర్సిటీకి 85 శాతం స్థానిక కోటా ఉంటుంది. 15 శాతం సీట్లు మిగిలిన 2 రీజియన్లకు అన్‌రిజర్వ్‌డ్ కోటా కింద ఉంటాయి. అంటే ఆ 15శాతం సీట్లకు 3 యూనివర్సిటీల పరిధిలోని విద్యార్థులూ పోటీపడొచ్చు. దీంతో ప్రతి యూనివర్సిటీలోని 15శాతం సీట్లను మిగిలిన 2 యూనివర్సిటీల రీజియన్ల పరిధిలోని విద్యార్థులు పొందవచ్చు.

విభజనకు సంబంధం లేకపోయినా..

ఈ మూడు రీజియన్ల రిజర్వేషన్ విధానానికి, రాష్ట్ర విభజనకు ఎలాంటి సంబంధం లేదు. అయితే రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటిందనే కారణం చూపుతూ తెలంగాణ ప్రభుత్వం ఓయూ రీజియన్ అన్‌రిజర్వ్‌డ్ కోటాలో ఏయూ, ఎస్వీయూలను తొలగించింది. దీంతో ఏపీ విద్యార్థులకు ఓయూ పరిధిలో సీట్లు రావు. దీనిపై వెంటనే స్పందించిన ఏపీ ప్రభుత్వం కూడా అచ్చం అలాగే ఏయూ, ఎస్వీయూల పరిధిలో ఓయూ రీజియన్‌ను రద్దుచేయాలనే నిర్ణయం తీసుకుంది. కానీ.. ఉత్తర్వులు జారీకాలేదు. మరోవైపు ఇంటర్ పరీక్షలు ముగియడం, ఇంజనీరింగ్, ఫార్మసీల్లో సీట్లకు ఈఏపీసెట్ గడువు సమీపించడంతో సెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని అందులో నిబంధన పెట్టింది. 'ఇతర రాష్ట్రాలు' ఆప్షన్ ద్వారా తెలంగాణ విద్యార్థులకూ ఏపీఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

కోర్టులో వీగిపోతుందనే వాదన

ఉన్నత విద్యలో రీజియన్ల ఆధారిత కోటా రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అమలవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రాంతాల విద్యార్థులకు సమ న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఈ కోటా అమల్లోకి వచ్చింది. కానీ దీన్ని రాష్ట్ర విభజనతో ముడిపెట్టిన తెలంగాణ ప్రభుత్వం కోటా రద్దుచేసింది. అలాగే ఏపీ కూడా చేస్తే అది న్యాయస్థానంలో వీగిపోతుందనే అభిప్రాయంలో ఉన్నట్లు తెలిసింది. అందుకే కోటాపై ఏపీ ప్రభుత్వం మూడు రకాలుగా ఆలోచన చేస్తోంది. మొదటిది తెలంగాణ తరహాలోనే పూర్తిగా ఓయూని తొలగించి ఏపీని ఒకే యూనిట్‌గా రిజర్వేషన్ అమలుచేయడం. రెండోది ఓయూ లేకుండా ఏయూ, ఎస్వీయూ రీజయన్లు అలాగే ఉంచి రెండూ ఒకదానికి ఒకటి నాన్ లోకల్ అయ్యేలా మొత్తం సీట్లు ఏపీ విద్యార్థులకే కేటాయించడం. మూడోది ఏపీ విద్యార్థులకు 85శాతం సీట్లు కేటాయించి, మిగిలిన 15శాతం సీట్లకు ఇతర రాష్ట్రాలు అని పేర్కొనడం. అయితే ఇతర రాష్ట్రాలు అంటే తెలంగాణ ఒక్కటేనా, మిగిలిన రాష్ట్రాల విద్యార్థులు కూడా ఉంటారా? అనే దానిపై స్పష్టత లేదు. కానీ.. దీనిపై ఇప్పటికే ఏదొక నిర్ణయం తీసుకుని ఉంటే నోటిఫికేషన్ అందుకు అనుగుణంగా విడుదల చేసేవారు. ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకోకపోవడం వల్ల నోటిఫికేషన్‌లో తెలంగాణ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించారు.

మన సీట్లు మనకే..!

తెలంగాణ తరహాలోనే వెళ్లే యోచన..

త్వరలో ఉత్తర్వులు

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య సీట్లపై ప్రభుత్వం పాత ప్రతిపాదనే మళ్లీ తెరపైకి తెచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ఏపీ కోటాను రద్దు చేయడంతో అదే తరహాలో వెళ్లాలని తొలుత నిర్ణయం తీసుకుంది. కానీ, దానిపై వెనకడుగు వేసింది. అయితే ఇప్పుడు అదే నిర్ణయాన్ని అమలుచేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు తాజాగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. తాజా ప్రతిపాదనల ప్రకారం రీజియన్ స్థాయి యూనివర్సిటీల్లో 85 శాతం సీట్లు స్థానికులకు, 15 శాతం సీట్లు రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల విద్యార్థులకు ఇస్తారు. ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్‌కు శ్రీవెంకటేశ్వరా యూనివర్సిటీ రీజియన్ నాన్‌లోకల్ అవుతుంది. అలాగే ఎస్వీయూకు ఏయూ నాన్ లోకల్ అవుతుంది. ఇప్పటివరకూ నాన్ లోకల్ కోటాలో ఉస్మానియా వర్సిటీ ఉండగా దాన్ని తొలగిస్తారు. దీనిపై త్వరలో ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉంది.



గుంటూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై మిర్చి రైతుల ఆందోళన

మిర్చి ధర భారీగా పతనం

» వ్యాపారుల మాయాజాలం

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విదేశాలకు ఎగుమతి జరిగే తేజ రకం ఎండుమిర్చి ధర భారీగా పతనమైంది. రెండేళ్ల క్రితం క్వింటాల్ రూ.23 వేలు ఉన్న ధర నేడు రూ.9 వేలు కూడా రాని పరిస్థితి! దీంతో మిర్చి రైతులు మంగళవారం గుంటూరులోని మిర్చి యార్డు వద్ద ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి గుంటూరు-హైదరాబాద్ హైవే దిగ్బంధించారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ రాస్తారోకోతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ సీజన్ ప్రారంభంలో క్వింటాల్ మిర్చి రూ.10 వేలు ఉండగా.. సంక్రాంతి తర్వాత రూ.13 వేల వరకు వెళ్లింది. అయితే కొద్ది రోజుల నుంచి మిర్చిలో తాలు, తేమ శాతం అధికంగా ఉంటోందని, కాయ సైజు చిన్నదిగా ఉంటోందని కొనుగోలుదారులు ధర కోసేస్తున్నారు. కర్ణాటకలోని రాయ్‌చూర్, బళ్లారి, హుబ్లీ, కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం, దోర్నాల, యర్రగొండపాలెం, పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి, వినుకొండ తదితర ప్రాంతాల నుంచి రైతులు నిత్యం లక్షా 20 వేలకు పైగా మిర్చి బస్తాలను విక్రయించేందుకు గుంటూరుకు తీసుకొస్తున్నారు. అయితే తొలి రోజున వ్యాపారస్తులు కొనుగోళ్లు చేయకుండా రైతులను నిరీక్షించేలా చేస్తున్నారు. రెండో రోజు ఎగుమతిదారు వచ్చి తొలుత ఒక రేటుకి ఒప్పందం చేసుకుంటున్నాడు. కాసేపటికి ఆయన గుమాస్తా వచ్చి శాంపిల్ కాయలు తీయించి, నాణ్యత లేదని క్వింటాల్‌కు రూ.వెయ్యి కోత పెడుతున్నాడు. దీంతో క్వింటాల్‌కు బట్టి రూ.7 వేల నుంచి రూ.9 వేల ధర మాత్రమే చెల్లిస్తున్నారు.

అధికారుల చర్చలు.. ఆందోళన విరమణ

వ్యాపారులు కూడబలుక్కొని ధర తగ్గించేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఈ విషయం మార్కెటింగ్ శాఖ దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, మిర్చియార్డు సెలెక్షన్‌గ్రేడ్ సెక్రటరీ చంద్రిక వచ్చి రైతులతో చర్చలు జరిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పీ ధర క్వింటాల్‌కు రూ.11,781 చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. దీనిపై జేసీ స్పందించి.. సమస్యలను ప్రభుత్వానికి నివేదించి ఆదుకొంటామని చెప్పి ఆందోళనను విరమింపచేశారు.



జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్లు, ఎస్పీలు

మాట ఇచ్చినట్టే మంచి పాలన

(మొదటి పేజీ తరువాయి)

శాశ్వత ముద్ర వేస్తాయి." అని కలెక్టర్లను ఉద్దేశించి సీఎం అన్నారు. 26 జిల్లాల కలెక్టర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. అన్నిశాఖల తీరుతెన్నులను ఈ సదస్సు తొలిరోజు ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

ప్రతి పనినీ సమీక్షిస్తున్నాం

"సంక్షేమ ఫలాలు సక్రమంగా ప్రజలకు అందాలి. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమమూ చివరిస్థాయి వరకు చేరాలి. ప్రతి అధికారీ బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజలే ఫస్ట్ విధానంతో ముందుకెళ్లాలి. మీరు చేసే ప్రతి పనినీ సమీక్షిస్తున్నాం. పౌరులకు అందించే 22 సేవల పై అభిప్రాయాలు తీసుకుంటున్నాం. ఈ ప్రభుత్వం మా కోసమే పని చేస్తోందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలి."

అభివృద్ధి, సంక్షేమంతోనే సంతోషం

"16,347 టీచర్ పోస్టుల భర్తీ ఫైలుపైనే మొదటి సంతకం చేశాం. ఏప్రిల్ మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాం. పగడ్బందీగా నిర్వహించాలి. పాఠశాలలు ప్రారంభించే సమయానికి నియామకాలు పూర్తవ్వాలి. గతంలో రాష్ట్రంలో 1.5 లక్షల టీచర్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిది. స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌లో 10 సూత్రాలు రూపొందించాం. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయం వరకు ప్రణాళికలు ఉండాల్సిందే. ప్రజలు సంతోషంగా ఉండాలంటే సంక్షేమ కార్యక్రమాల అమలు తప్పనిసరి. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే తగినంత ఆదాయం రావాలి. అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తే స్థిరంగా కొనసాగవు. గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఈ అప్పులు తీర్చాలి, వడ్డీలు కట్టాలి. రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చడానికి ఏర్పాటుచేసిన 204 అన్నా క్యాంటీన్లను కలెక్టర్లు సందర్శించాలి. పోలవరాన్ని కేంద్ర సహకారంతో గాడినపెట్టాం. 2027 నాటికి పూర్తిచేస్తాం. రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్. ప్రపంచలోనే బెస్ట్‌మోడల్‌గా అభివృద్ధి చేస్తున్నాం. నక్కపల్లి స్టీల్‌ప్లాంట్ నిర్మాణంలోనూ ఈ తరహా మోడల్స్ చేపట్టాలి. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం అమరావతితో ప్రారంభమైంది. రూ.861 కోట్లతో 20,000 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చివేస్తున్నాం. 95 శాతం పనులు పూర్తయ్యాయి. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకునే వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తాయి. రాష్ట్రంలో 20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతి అసెంబ్లీ నియోకవర్గంలోనూ పదివేల రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేశాం. రూ.4,000 కోట్లతో 40వేల పనులను పల్లె పండగ కింద ప్రారంభించాం. మే నెలలో తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15,000 అందిస్తాం. పీ4లో భాగంగా అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయనున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ ప్రెన్యూర్ అనే నినాదాన్ని ముందుకు తీసుకొచ్చాం.

అదనంగా లక్ష ఎకరాల్లో అరకు కాఫీ సాగు

గిరిజన సంక్షేమంలో భాగంగా అరకు కాఫీని ప్రోత్సహించాలి. ఐదేళ్లలో అదనంగా లక్ష ఎకరాల్లో సాగు చేపట్టాలి.

వ్యాధులతో జాగ్రత్త..

"సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన నిధులను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధం. మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలి. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.50 లక్షల బోర్లను ముందుగానే ఫ్లష్ అవుట్ చేయించాలి. మంత్రుల కమిటీ నాణ్యమైన ఆహార సరఫరాపైనా దృష్టి సారించాలి."

తాగునీరు లేదనే మాట రానీయొద్దు..

"ఈ వేసవి కాలంలో వడదెబ్బ తగిలి ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదు. ఎక్కడా తాగునీరు లేదనే మాట రాకూడదు. వేసవి పూర్తయ్యే వరకు జిల్లాల్లో తాత్కాలిక కాల్‌సెంటర్లు ఏర్పాటు చేయాలి. మంచి నీటి సమస్య ఎక్కడ తలెత్తినా రియల్‌టైంలో పర్యవేక్షించి పరిష్కరించాలి. చలివేంద్రాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట ఓఆర్ఎస్ ప్యాకెట్లను, మజ్జిగ ప్యాకెట్లను సరఫరా చేయాలి. రాష్ట్రంలోని అన్ని చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు పూర్తి చేసుకోవాలి. ఉపాధి నిధులు సక్రమంగా వినియోగించుకుని పనులు చేయాలి. ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ పని దినాలు కల్పించాలి. అటవీశాఖ కూడా ఉపాధి పథకాన్ని వినియోగించుకోవాలి."

డెయిరీ-డ్వాక్రా అనుసంధానం

"మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులు రావాలి. రాబోయే 5 ఏళ్లలో గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు సాధించేలా ముందుకెళ్తున్నాం. పర్యాటకంలో 20 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వయం సహాయక బృందాలను పాడి పరిశ్రమకు అనుసంధానం చేయాలి. డెయిరీ-డ్వాక్రా అనుసంధానంతో ఉత్తమ ఫలితాలుంటాయి. డెయిరీల్లో పాల సేకరణ బాధ్యతలను స్వయం సహాయక బృందాలకు అప్పగించాలి. వేసవిలో గ్రాసానికి ఇబ్బంది లేకుండా ఎండు గడ్డి, పచ్చి గడ్డి లభ్యతలో లోటు ఉంటే ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాలి. పశుపోషణపై ఆసక్తి ఉన్న బీపీఎల్ కుటుంబానికి 2 ఆవులు లేదా గేదెలు రాయితీపై అందించాలి."

థర్డ్ పార్టీతో ఆడిట్..

"ఈ ఏడాది జూన్ 15 నుంచి ఈ నెల 19వరకు రాష్ట్రంలో మొత్తం 8.26 లక్షల ఫిర్యాదులు రాగా, ఇప్పటి వరకు 7.22 లక్షల ఫిర్యాదులు పరిష్కరించాం. ఫిర్యాదులను కేవలం రొటీన్ విధానంలో పరిష్కరించడం కాకుండా ఆ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎక్కువ ఫిర్యాదులు వచ్చే శాఖలు మరింత దృష్టి పెట్టి పనిచేయాలి. సమస్యల పరిష్కారంపై థర్డ్ పార్టీతో ఆడిట్ చేయించాలి. రాష్ట్రంలో వక్ఫ్ భూములు, ఆస్తుల ద్వారా ముస్లింలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలి. హజ్ యాత్రికులకు వచ్చే ఏడాది నుంచి గన్నవరంలోనే ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

"విజన్ అమల్లో రాజకీయ ఒత్తిళ్లు తలెత్తకుండా జిల్లాలకు స్థానికేతర అధికారులను ప్లానింగ్ బోర్డు చైర్మన్లుగా నియమించాం. జీఎస్డీపీ పెరుగుదల ద్వారా జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. వచ్చే ఏడాదికి 15% తగ్గకుండా జీఎస్‌డీపీ సాధించేలా కలెక్టర్లు కృషిచేయాలి. వృద్ధిరేటు ఒక శాతం పెరిగితే రూ.15,000 కోట్ల ఆదాయం వస్తుంది. స్వర్ణాంధ్ర విజన్‌లో రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలనేది మన సంకల్పం."

జనాభాను పెంచాలి..

"ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో రూ.7,230 కోట్లను 9 నెలల్లో చెల్లించాం. ఉద్యోగులకు అలవెన్సులు చెల్లించకుండా గత ప్రభుత్వం రూ.20,637 కోట్లు బకాయిలు పెట్టింది. పీ4 కార్యక్రమంలో అధికారులు భాగస్వామ్యం కావాలి. వడ్డెర సామాజికవర్గానికి క్వారీలు ఇవ్వాలని సంకల్పించాజ చేనేతలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో జనాభా పెరగాల్సిన అవసరముంది. రాష్ట్రంలో ప్రస్తుతం 1.5 శాతం జననాల రేటు ఉంది. దానిని పెంచాలి. 77 శాతం పెట్టుబడులు ప్రైవేటు రంగం నుంచి రాబోతున్నాయి. వాటి ద్వారా సంపద సృష్టించడమే కాకుండా, సంక్షేమాన్ని కూడా చేపట్టబోతున్నాం." అని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులు సురేశ్‌కుమార్, శశిభూషణ్‌కుమార్, పీయూష్‌కుమార్, మైనార్టీ సంక్షేమం శాఖ కార్యదర్శి హర్షవర్ధన్, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

9552300009 నంబర్‌ను సేవ్ చేసుకోండి

ప్రతి ఇంటికీ వాట్సాప్ గవర్నెన్స్-మనమిత్ర

- ప్రజల్లో అవగాహన కోసం కలెక్టర్లు చొరవ తీసుకోవాలి
- మరో 15 రోజుల్లో 350 సేవలు అందిస్తాం
- ఐటీ, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ వాట్సాప్ గవర్నెన్స్-మన మిత్ర సేవలు అందుతాయని, ప్రజలు అందరూ 9552300009 సేవ్ చేసుకునేలా కలెక్టర్లు విస్తృత ప్రచారం చేయాలని ఐటీ, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ చెప్పారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం కలెక్టర్ల సదస్సు తొలిరోజున వాట్సాప్ గవర్నెన్స్‌పై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు జిల్లాల్లో కలెక్టర్లు చేపట్టాలన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం 210 ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, మరో 15 రోజుల్లో 350 సేవలు అందుతాయని భాస్కర్ వెల్లడించారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై నిరంతర శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. వర్క్ ఫ్రమ్ హోం కార్యక్రమం కార్యాచరణ దాదాపు పూర్తయిందని వెల్లడించారు. ఎవరెవరికి ఏయే విద్యార్హతలు ఉన్నాయో వర్గీకరణ చేశామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక సర్వేను నిర్వహించామన్నారు. యువత నైపుణ్య స్థాయిని బట్టి వారికి శిక్షణా కార్యక్రమాలు కూడా ఇస్తామన్నారు. జిల్లాల్లో నిర్మిస్తున్న ఆర్టీజీఎస్ భవనాల పరిరక్షణకు కూడా కలెక్టర్లు ప్రాధాన్యం ఇవ్వాలని భాస్కర్ ఆదేశించారు.



మహిళలకు పింక్ టాయిలెట్స్

బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు పింక్ టాయిలెట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్లను మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి కోరారు. బహిరంగ ప్రదేశాల్లో బేబీ ఫీడింగ్, చైల్డ్ కేర్ రూమ్‌ల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను సాక్షం అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలన్నారు.

ప్రైవేటు భూములేవీ 22ఏలో ఉండకూడదు

ఆ దిశగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలి : మంత్రి అనగాని

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు భూములేవీ కూడా 22 ఏలో ఉండకూడదనేదే ప్రభుత్వ ఆశయమని, ఆ దిశగా జిల్లా కలెక్టర్లు పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల మంత్రి అనగాని సత్యప్రసాద్ నిర్దేశించారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ ప్రజలకు భూమి అనేది సెంటిమెంట్‌తో కూడుకున్న వ్యవహారమని, పేదలకైతే అది ఒక భరోసా అని తెలిపారు. ప్రజల భూ వివాదాల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. జిల్లాల్లో ప్రత్యేకించి ఒక రియల్‌ఎస్టేట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, జిల్లా, రెవెన్యూ, మునిసిపాలిటీ, పంచాయతీ, పట్టణాభివృద్ధి సంస్థలు, బ్యాంకర్లు అందరూ ఈ కమిటీలో సభ్యులుగా ఉండేలా చూడాలని నిర్దేశించారు. ఈ కమిటీ నెల, రెండు నెలలకోసారి సమావేశమై ఆయా జిల్లాల్లో ప్రభుత్వ భూముల వివాదాలు పరిష్కరించాలని కోరారు.ప్రజలే ముందు అనే నినాదంతో చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాల సాధన లక్ష్యంగా రాష్ట్రస్థాయిలో సీఎం కార్యాలయం పనిచేస్తోందని, అదే తరహాలో జిల్లాస్థాయి సీఎంవోలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలు ఎంతో శక్తిమంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

బెట్టింగ్‌కు చెక్

ప్రత్యేక చట్టం తెస్తాం: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపులో ఉంచాలని, లేదంటే ప్రభుత్వ విశ్వసనీయతను అందరూ ప్రశ్నిస్తారని, ఆ పరిస్థితి రాకూడదని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కలెక్టర్ల సదస్సులో శాంతి భద్రతల అంశంపై చర్చ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. 'రాష్ట్రంలో ఇతర నేరాలు తగ్గాయి. కానీ ఆర్థిక నేరాలు పెరిగాయి. గంజాయి సాగు బాగా తగ్గింది. వినియోగం ఇంకా తగ్గించాలి. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపేందుకు ప్రత్యేక చట్టం తీసుకొద్దాం. అది గ్యాంబ్లింగ్‌ను సైతం అరికట్టేలా ఉంటుంది. నేరస్థులు చాలా తెలివిగా సాక్ష్యాలు దొరక్కుండా మాయం చేస్తారు. పారిపోయే వారు కొందరైతే, పక్కవారిపై నేరాన్ని తోసేవారు మరికొందరు. వివేకానందరెడ్డి హత్య కేసు అందుకు ఉదాహరణ. ఐవోలు అప్రమత్తంగా ఉంటూ ఫోరెన్సిక్ ఎవిడెన్స్ సేకరణలో జాగ్రత్తగా ఉండాలి. మావోయిస్టుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. నేరాలు తగ్గించేందుకు వీలైనంత ఎక్కువగా అధునాతన టెక్నాలజీని వినియోగించుకోవాలి. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం తీసుకోవాలి' అని ఆదేశించారు.

17 శాతం నేరాలు తగ్గుముఖం: డీజీపీ

రాష్ట్రంలో నేరాల తగ్గుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. సదస్సులో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరికి అంతకు ముందు ఏడాదితో పోల్చితే 17% నేరాలు తగ్గుముఖం పట్టాయి. 75,500 సీసీటీవీలు ఏర్పాటు చేసి 187 డ్రోన్లతో పెట్రోలింగ్ చేస్తున్నాం. 2023 జూన్ నుంచి 2024 జనవరి వరకూ మహిళలపై 18,114 నేరాలు జరిగితే 2024 జూన్ నుంచి 2025 జనవరి వరకూ 16,809 నేరాలు నమోదయ్యాయి. శక్తి యాప్ ద్వారా 164 బృందాలతో నిరంతరం రక్షణ కల్పిస్తున్నాం. గంజాయి సాగు 11 వేల ఎకరాల నుంచి 100 ఎకరాలకు తగ్గించ గలిగాం. గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న 2,911 మందిని అరెస్టు చేశాం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీజీపీపై సీఎం ప్రశంసలు కురిపించారు. 'నేరాల నియంత్రణ, పరిశోధన, ప్రజలకు భరోసా.. లక్ష్యంతో ఏపీ పోలీసులు పని చేయాలి. మీ 'లాఠీ టూ డేటా'ను మరింత ముందుకు తీసుకెళ్లండి' అని అన్నారు. శాంతి భద్రతలపై సీఎం సంతృప్తి వ్యక్తం చేయడంపై ఐపీఎస్ అధికారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

భూ సమస్యలపై యాక్షన్ ప్లాన్

- ఏప్రిల్ నెలాఖరులోగా సిద్ధం చేయండి
- కలెక్టర్ల సదస్సులో సీఎం స్పష్టీకరణ
- రెవెన్యూశాఖ నివేదికపై అసంతృప్తి, ఆగ్రహం

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంతగా భూమి సమస్యలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ వివాదాల పరిష్కారానికి గత కొన్ని నెలలుగా అనేక ప్రయత్నాలు చేస్తున్నా అవి కొలిక్కిరావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థ ఇప్పటికీ కంట్రోల్‌లోకి రాలేదన్నారు. ప్రజలెదుర్కొంటున్న అన్నిరకాల భూ సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపాలో నెలరోజుల్లోగా అధ్యయనం చేసి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. ఈ కార్యాచరణ ప్రణాళిక తయారీలో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, సీనియర్ ఐఏఎస్‌లు, ప్రత్యేకించి రెవెన్యూ నిపుణులను భాగస్వాములను చేయాలన్నారు. భూ సమస్యలపై భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) జయలక్ష్మి ప్రజంటేషన్ ఇవ్వగా మధ్యలోనే సీఎం జోక్యం చేసుకొని రెవెన్యూ ఇంకా కంట్రోల్‌లోకి రాలేదని తీవ్రంగా స్పందించారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కారం నిజంగానే కృషి చేస్తున్నారా? వాస్తవాలనే ప్రజంట్ చేస్తున్నారా? కలెక్టర్లు ఏం చేశారో మీరు స్పష్టంగా అడగండి. వారు జిల్లా స్థాయిలో ఏం చేశారో అడగండి. మీరేదో చెప్పి, వారేదో వివరించి రొటీన్‌గా మాట్లాడుకుంటే ఇలాంటి సమావేశాలకు అర్థమే లేదు. భూ సమస్యలపై ఏం చేస్తే బాగుంటుందో కలెక్టర్లు మాట్లాడండి' అన్నారు.

అవన్నీ సమస్యలు.. పరిష్కారాలేమిటి?

చిత్తూరు, కడప సహా పలు జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల పరిధిలో ఉన్న సమస్యలను ప్రస్తావించగా, అవన్నీ సమస్యలని, పరిష్కారాలు ఏమిటని సీఎం ప్రశ్నించారు. 'ఇక్కడున్న మంత్రులకే కాదు, చాలా మంది అధికారులకు భూ వివాదాలపై సరైన అవగాహన లేదు. తెలంగాణలో నిజాం పాలకుల వల్ల భూ సమస్యలు చాలా ఎక్కువ. ఒకే భూమిని అనేక మందికి ధారాదత్తం చేయడం వల్ల అక్కడ అనేక భూ వివాదాలున్నాయి. దీంతో భన్వర్‌లాల్ అనే ఐఏఎస్ అధికారిని కలెక్టర్‌గా నియమించి భూమి రికార్డులను ప్రక్షాళన చేయించా. ఆంధ్రా ప్రాంతం స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ పాలనలో ఉండటంతో రికార్డులను సరిగ్గానే నిర్వహించారు. కానీ, ఇటీవలి కాలంలో రికార్డులను తారుమారు చేశారు. రీ సర్వేలో భారీ అక్రమాలకు పాల్పడ్డారు. ప్రైవేటు భూములను కూడా నిషేధ జాబితా 22(ఏ)లో చేర్చారు. ప్రైవేటు భూములను ప్రభుత్వ జాబితాగా చూపించి రికార్డులు మార్చారు. ఇది అరాచకానికి పరాకాష్ఠ. ఎక్కడికి వెళ్లినా వందలు, వేల మంది నా వద్దకు వచ్చి నా భూమి రికార్డుల్లో నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు అంతం లేదా? అడ్డుకట్ట వేయలేమా? పరిష్కారం చూపలేమా? ఒక్కో జిల్లాలో ఒక్కో విధమైన సమస్యలున్నాయి. వీటిని ఎలా పరిష్కరించాలో కలెక్టర్లు సూచనలు, సలహాలు ఇవ్వండి. గతంలో చేసిన సర్వే రైతుల వద్ద ఉన్న రికార్డులతో సింక్ కావడం(సరిపోలడం) లేదు. కాబట్టి క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో కలెక్టర్లు అసలైన నిజాలను చెప్పండి. రోగం ఏమిటో తెలిస్తేనే మందు ఇవ్వగలరు. కాబట్టి సమస్యలు ఏమిటో స్పష్టంగా చెప్పి వాటికి పరిష్కారాలు కూడా సూచించండి' అన్నారు.



కలెక్టర్ల సదస్సుకు సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రులు అనగాని, పయ్యావుల

ప్రతి గ్రామంలో భూరికార్డుల పునఃపరిశీలన

ప్రతి గ్రామంలో భూమి రికార్డులను పునఃపరిశీలన చేయాలని సీఎం సూచించారు. ఇంతలో మంత్రి లోకేశ్ జోక్యం చేసుకొని భూమి వివాదాల పరిష్కారానికి సీనియర్ కలెక్టర్లతో టీమ్‌ను ఏర్పాటు చేసి అధ్యయనం చేయించాలని కోరారు. భూ వివాదాల వల్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన నెలకొందన్నారు. కాగా, గత ప్రభుత్వం వల్ల ప్రజల్లో తీవ్ర భయం వచ్చేసిందని సీఎం అన్నారు. 'రీ సర్వే చేస్తామని అక్రమాలు చేశారు. ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారు. రికార్డులను తారుమారు చేశారు. కాబట్టి గ్రామం వారీగా రికార్డుల భౌతిక పరిశీలన చేయాలి. వెబ్‌ల్యాండ్‌కు, రికార్డులకు చాలా తేడా ఉంది. ఈ విషయాలపై రెవెన్యూ ప్రమోటీ అధికారులకు బాగా పరిజ్ఞానం ఉంటుంది. వారితో మాట్లాడండి. అసలు రాష్ట్రంలో వివాదంలో ఉన్న భూములు ఎన్ని? వివాదంలో లేని భూములు ఎన్ని? సరిగ్గా అంచనా వేయండి. జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించి డేటా తీసుకోండి. లింకు డాక్యుమెంట్స్ లేని భూములు ఎన్ని? వాటి రికార్డుల పరిస్థితి ఏమిటో అధ్యయనం చేయండి' అని నిర్దేశించారు. ఈ విషయాలపై రాష్ట్రం, జిల్లా స్థాయిల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించి ఏప్రిల్ నెలాఖరు నాటికి యాక్షన్‌ప్లాన్ రెడీ చేయాలని రెవెన్యూశాఖను సీఎం ఆదేశించారు. ఆర్ఓఆర్ కేసులతోపాటు ఇతర కీలకమైన అంశాల్లో ఆర్డీవోలు, సబ్‌కలెక్టర్లకున్న అధికారాలను తొలగించి అన్నీ కలెక్టర్‌కే అప్పగించారని, దీని వల్ల కలెక్టర్ల వద్ద పరిష్కరించాల్సిన ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. దీని వల్ల భూ సమస్యల పరిష్కారం మరింత జాప్యమవుతోందని చెప్పారు. దీంతో రెవెన్యూ ప్రజంటేషన్‌పై చర్చ ఆగిపోయింది. యాక్షన్ ప్లాన్‌పై స్పష్టత వచ్చాకే అన్నీ మాట్లాడదామన్నారు. రెవెన్యూ మొండి సమస్యలకు ఏడాదిలోగా పరిష్కారం చూపాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు.

జగన్ మద్యం స్కాంపై క్షుణ్ణంగా దర్యాప్తు!

టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలుకు అమిత్‌షా హామీ

న్యూఢిల్లీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణానికి ఎన్నో రెట్లు అధికంగా గత జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీలో అక్రమ మద్యం వ్యాపారం జరిగిందని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం లోక్‌సభలో చేసిన తీవ్ర ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టి సారించారు. మంగళవారం పార్లమెంటు సమావేశాల మధ్యలోనే ఆయన్ను ప్రత్యేకంగా తన కార్యాలయానికి పిలిపించుకొని వివరాలు తెలుసుకున్నారు. ఏపీ కుంభకోణంతో పోల్చితే ఢిల్లీ కుంభకోణం నీటి బొట్టంతేనని ఈ సందర్భంగా లావు ఆయనకు వివరించారు. సంబంధిత కీలక పత్రాలను అందజేశారు. రూ.90వేల కోట్ల మద్యం వ్యాపారంలో రూ.18 వేల కోట్లు దుర్వినియోగమయ్యాయని, అవికాకుండా మరో రూ.4 వేల కోట్లు బినామీ పేర్లతో దుబాయ్, ఆఫ్రికాలకు తరలించారన్న ఆరోపణలపై హోంమంత్రి ఆరా తీశారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్.సునీల్‌రెడ్డి రూ.2 వేల కోట్లను దుబాయ్‌కి తరలించిన కీలకపత్రాలను లావు అందించారు. ఈ లావాదేవీలపై ఈడీ క్షుణ్ణంగా దర్యాప్తు జరిపితే అనేక కీలక వివరాలు బయటపడతాయన్నారు. ఈ విషయంపై తాము క్షుణ్ణంగా దర్యాప్తు జరిపిస్తామని అమిత్ ఆయనకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఏపీ మద్యం కుంభకోణం పర్యవసానాల వల్లే ఒక ఎంపీ రాజీనామా చేసి, రాజకీయాల నుంచి నిష్క్రమించారని కూడా లావు వివరించారు. రాష్ట్రంలోని 22 డిస్టిలరీలను చేజిక్కించుకుని అర్థంపర్థం లేని బ్రాండ్లతో 26 కొత్త కంపెనీలను ప్రారంభించారని, అంతర్జాతీయ బ్రాండ్లన్నింటినీ వెళ్లగొట్టారని తెలిపారు. ప్రభుత్వ దుకాణాలలో రూ.99 వేల కోట్ల మేరకు అమ్మకాలు జరిగితే, అందులో రూ.690 కోట్లు మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరిగాయని, మిగతా సొమ్ములో అత్యధిక భాగం జగన్, ఆయన అనుయాయులు కబళించారని వివరించారు. కాగా, సోమవారం లోక్‌సభలో 2025-26 ఆర్థిక బిల్లుపై లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ జగన్ మద్యం కుంభకోణాన్ని వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 20 మంది ప్రైవేట్ ఐఎంఎఫ్ఎల్‌లను, డిస్టిలరీలను అక్రమంగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకుని, 60శాతం ఉత్పత్తి సామర్థ్యాన్ని కొత్తగా ఏర్పాటైన కంపెనీలకు అప్పగించారని ఆరోపించారు. 2019-2024 మధ్య 38 కొత్త బ్రాండ్లను వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అవన్నీ అధికార పార్టీ అనుబంధ వ్యాపారులకు చెందినవని తెలిపారు. 26 కొత్త కంపెనీలు భారీ లాభాలు పొందాయని, రూ.20,356 కోట్ల విలువైన మద్యం అమ్మకాలను గోప్యంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మద్యం సేకరణను పూర్తిగా నియంత్రించిందని, అధికార పార్టీ సహచరుల నియంత్రణలో ఉన్న బ్రాండ్‌లకు మాత్రమే అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు. రూ.2,000 కోట్లు ఒక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ పేరుతో దుబాయ్‌కి మళ్లించారన్నారు. ఏపీలో మద్యం స్కాంకు కారణమైన వారిపై దర్యాప్తు చేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.



అవినాశ్‌రెడ్డి అనుచరుడు పవన్‌కు మరోసారి 41-ఏ నోటీసులు

పులివెందుల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి అనుచరుడు పవన్‌ను బుధవారం విచారణకు రావాలని ఆదేశిస్తూ పులివెందుల పట్టణ పోలీసులు మరోసారి 41-ఏ నోటీసులు జారీ చేశారు. మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-2 వై. సునీల్‌యాదవ్ పులివెందుల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల విడుదలైన 'హత్య' సినిమాలో తనను, తన తల్లిని కించపరిచే విధంగా సన్నివేశాలు చిత్రీకరించారని, ఆ సినిమాలోని సన్నివేశాలను పులివెందుల వైసీపీ నాయకులు, కార్యకర్తలు వాట్సప్ గ్రూప్‌లలో వైరల్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు, వైసీపీ కార్యకర్త పవన్ కుమార్ నిర్వహిస్తున్న 'వైఎస్ అవినాశ్ యూత్' వాట్సాప్ గ్రూప్‌లో 'హత్య' సినిమాలోని సన్నివేశాలను పదే పదే వైరల్ చేస్తున్నారని గుర్తించిన పోలీసులు ఆయనను ఈ కేసులో ఏ-1గా చేర్చారు. ఇప్పటికే పోలీసులు ఆయనను రెండు రోజులు విచారించారు. మరోసారి విచారణకు రావాలంటూ గతంలోనే నోటీసులు ఇచ్చినా మంగళవారం విచారణకు హాజరు కాలేదు. దీంతో మంగళవారం మరోసారి 41-ఏ నోటీసులు జారీ చేశారు. బుధవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసులలో పేర్కొన్నారు. ఇదిలావుంటే, మంగళవారం విచారణకు హాజరు కాకపోవడానికి కారణం.. గత విచారణ సమయంలో పోలీసులు తనను చిత్రహింసలు పెట్టారని మాజీ సీఎం జగన్‌కి పవన్ చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై కోర్టులో ప్రైవేట్ కంప్లైంట్ నమోదు చేసి న్యాయం జరగేలా చేస్తామని జగన్ హామీ ఇచ్చినట్టు తెలిసింది. విచారణ సందర్భంగా డీఎస్పీ, సీఐ తనను కొట్టారని, తనకు ఏపాపం తెలియదని జగన్‌కు వివరించినట్లు సమాచారం. దీనిపై జగన్ స్పందిస్తూ.. పోలీసుల చర్యను చూస్తూ ఊరుకోబోమన్నారు.




శ్రీశైలంలోని పాతాళగంగ వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



నల్లమల అటవీ మార్గంలో తరలివస్తున్న కర్ణాటక భక్తులు

చెట్టూ పుట్టా చుట్టేసి.. కొండా కోనా దాటేసి.. పోదాం మల్లన్న సన్నిధికి!



శ్రీశైలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అడుగులన్నీ మల్లన్న సన్నిధికే. ఆశలన్నీ తల్లి భ్రమరాంబవారిపైనే. అమ్మవారిని తమ ఆడబిడ్డగా భావించి సేవించే కన్నడిగులు కర్ణాటక ప్రాంతం నుంచి శ్రీశైలానికి తరలివస్తున్నారు. దీంతో శ్రీగిరి సందడిగా మారింది. శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం నుంచి ఉగాది మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 27న స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు.. 31న ముగుస్తాయి.కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం నాటికే వేలాది మంది స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా బుధవారంతో స్పర్శ దర్శనం నిలిపివేసి.. గురువారం నుంచి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నారు.

సీఎం హామీ.. పది రోజుల్లోనే అమలు

▸▸ ఏసమ్మకు రూ.లక్ష.. ఇంటి పట్టా అందజేత



ఏసమ్మకు పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఓ అభాగ్యురాలికి సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని అధికారులు పది రోజుల్లోనే అమలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి మార్చి 15న సీఎం వచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నందివాడ ఏసమ్మ తన కుటుంబ పరిస్థితిని, కుమారుడి వైకల్యాన్ని సీఎంకు వెళ్లబోసుకుని, కన్నీటిపర్యంతమయ్యింది. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఏసమ్మ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో ఇటీవలే రూ.లక్ష సీఎం సహాయ నిధిని ఏసమ్మకు కలెక్టర్ అందజేయగా, మంగళవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆమెకు ఇంటి పట్టా అందజేశారు.

'పాపవినాశనం' డ్యాంలో బోటింగ్..!

▸▸ ఆధ్యాత్మిక కేంద్రంలో పర్యాటకమా అంటూ విమర్శలు

తిరుమల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భక్తుల దాహార్తిని తీర్చే తిరుమలలోని పాపవినాశనం డ్యాంలో ఐదుగురు వ్యక్తులు మంగళవారం కయాక్ బోట్లలో తిరిగారు. తిరుమలలో పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా పాపవినాశనం డ్యాంలో బోటింగ్ ఏర్పాటు చేసేందుకు సర్వే జరిగినట్టు కొందరు ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు. ఈ విషయం బయటకు రావడంతో భక్తుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు మొదలయ్యాయి. భక్తుల తాగునీటిలో బోటింగ్ చేయడం ఏమిటి?' అంటూ భక్తులు విమర్శిస్తున్నారు. కాగా, పాపవినాశనం డ్యాంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం రావడంతోనే.. తనిఖీ చేయడానికి ఈ పడవలు ఉపయోగించామని జిల్లా అటవీ అధికారి వివేక్ వెల్లడించినట్టు టీటీడీ వెల్లడించింది.




అవార్డులు అందుకున్న విద్యార్థులతో కత్రినా నాప్, డాక్టర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం తదితరులు

భారత్, ఆస్ట్రేలియా మధ్య గాఢానుబంధం

▸▸ ఆస్ట్రేలియా వైస్ కాన్సుల్ జనరల్ కత్రినా నాప్

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య గాఢానుబంధం వుందని చెన్నైలోని ఆస్ట్రేలియన్ వైస్ కాన్సుల్ జనరల్ కత్రినా నాప్ పేర్కొన్నారు. మంగళవారం జరిగిన 'వీఐటీ-చెన్నై' యూనివర్సిటీ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కత్రినా నాప్ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాలో వున్న ఒక మిలియన్ భారతీయులు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. వారు దీర్ఘకాలిక ఆర్థిక స్థితిస్థాపకత, వృద్ధికి పునాది వేయడం ద్వారా ఇక్కడి శ్రామిక శక్తిని నైపుణ్యం చేయడం ద్వారా భారత్‌కు దోహదపడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె రెండు దేశాల మధ్య సహకారానికి సంబంధించిన వివిధ రంగాల గురించి ప్రస్తావించారు. వాటిల్లో 'సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా-ఇండియా రిలేషన్స్', ప్రభుత్వం, పరిశ్రమ, విద్య, సమాజం అంతటా ఆస్ట్రేలియన్ మిషన్ల సహకారంతో మద్దతు ఇవ్వడానికి, సులభతరం చేయడానికి ఒక వేదిక అని వివరించారు. 'మైత్రి' ద్వారా ఆస్ట్రేలియా 20 మిలియన్ డాలర్ల విలువైన ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు, పరిశోధనా గ్రాంట్‌ను ప్రకటించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ హ్యూమన్ రిసోర్సెస్ చీఫ్ ఆఫీసర్ సుదీప్ కన్నుమల్, వీఐటీ చెన్నై రిజిస్ట్రార్ డాక్టర్ వీకే మనోహరన్, ప్రొ-వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి 'విశ్వావసు' పంచాంగం విడుదల



పంచాంగం ఆవిష్కరణలో విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సీఎంవో ప్రసన్న రై తదితరులు

బెంగళూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ప్రతి ఏటా ఆంధ్రజ్యోతి పంచాంగం పుస్తకాన్ని పాఠకులకు అందిస్తోంది. ఈ సంవత్సరం ఆంధ్రజ్యోతి పంచాంగానికి విప్రో కంపెనీ వారి సంతూర్ సోప్ ప్రాయోజకత్వం వహించింది. ప్రస్తుతం 'విశ్వావసు' నామ సంవత్సర పంచాగంతోపాటు కొత్తగా విడుదల చేస్తున్న 'సంతూర్ లైమ్' సోప్‌ను శాంపిల్‌గా జత చేస్తున్నట్టు విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సీఎంవో ఎస్ ప్రసన్న రై తెలిపారు. సంతూర్ సోప్ ప్రాయోజకత్వంలో ఆదివారం లక్షలాదిమంది 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు పంచాంగంతో పాటు సోపులు చేరనున్నాయి. విప్రో కన్స్యూమర్ కేర్ ప్రధాన కార్యాలయం బెంగళూరులో మంగళవారం పంచాంగం పుస్తకాన్ని ప్రసన్న రై విడుదల చేశారు. ఆంధ్రజ్యోతి ద్వారా సంతూర్ సోప్ నూతన ఉత్పత్తి లైమ్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. నిమ్మ, అలోవెరా, మెంథాల్‌ల సువాసన గల ఈ సోప్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వినియోగదారులు ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. సంతూర్ బ్రాండ్ మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతితో విప్రో సంతూర్ అనుబంధం దశాబ్దాలుగా కొనసాగుతోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో విప్రో ప్రతినిధులు సుమన్‌పాల్, కావ్య, శౌనేందు చటర్జీ, ఆంధ్రజ్యోతి బెంగళూరు జీఎం శ్రీకాంత్, డీజీఎం సుధాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నాడు బూతులు తిట్టి..

నేడు లోకేశ్‌తో భేటీ



లోకేశ్‌తో కరచాలనం చేస్తున్న రవీంద్ర రెడ్డి ఇప్పాల

▸▸ మంత్రిని కలిసిన సిస్కో బృందంలో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు రవీంద్రరెడ్డి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలపై అసభ్యకరమైన పోస్టులతో చెలరేగిన ఇప్పాల రవీంద్రరెడ్డి.. మంత్రి నారా లోకేశ్‌ను కలవడం వివాదాస్పదమైంది. రాష్ట్రంలో ఐటీ, అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సిస్కోతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌ను కలిసిన సిస్కో బృందంలో ఆ కంపెనీ టెరిటరీ సేల్స్ మేనేజర్‌గా ఉన్న రవీంద్రరెడ్డి హాజరవడమే కాకుండా.. ఈ సమావేశ సమన్వయ బాధ్యతలను కూడా ఆయనే చూడడంపై వివాదం రేగింది. దీనిపై టీడీపీ కార్యకర్తలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సామాజిక మాధ్యమాల వేదికగా రవీంద్రరెడ్డి నిజస్వరూపాన్ని బయట పెడుతూ పోస్టులు పెట్టారు. కొందరు పార్టీ నేతలు ఈ విషయాన్ని కలెక్టర్ల సదస్సుల్లో ఉన్న మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే సిస్కో ప్రతినిధులతో మాట్లాడి, రవీంద్రరెడ్డి ఇకపై ఏపీకి సంబంధించిన ప్రాజెక్టుల్లో పాల్గొనకుండా చూడాలని తన పేషీ అధికారులను ఆదేశించారు.

50 వేల మందికి నైపుణ్య శిక్షణ

సిస్కోతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఐటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రముఖ ఐటీ సంస్థ సిస్కోతో ఒప్పందం చేసుకుంది. మంత్రి లోకేశ్ సమక్షంలో ఎంవోయూ జరిగింది. ఒప్పందంలో భాగంగా విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరింపజేసేందుకు నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర అంశాల్లో ఆ సంస్థ కంటెంట్ అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు కోన శశిధర్, జి.గణేష్‌కుమార్, కె.దినేష్‌కుమార్, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేద్రిచ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు

లోకేశ్ ఆదేశాలతో మంత్రి ఐటీ విభాగం ఓఎస్‌డీ సాయి చైతన్య సిస్కో యాజమాన్యానికి ఘాటు లేఖ రాశారు. గతంలో టీడీపీ నేతల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రవీంద్రరెడ్డి పెట్టిన అసభ్యకర పోస్టులు సేకరించి, దానికి జత చేశారు. సిస్కోతో ప్రయాణాన్ని తాము గౌరవిస్తామని చెబుతూనే.. రవీంద్రరెడ్డి నేపథ్యంపై విరుచుకుపడ్డారు. ఆయన గతంలో సామాజిక మాధ్యమాల్లో టీడీపీ నాయకులపై అసభ్యకర పోస్టులు పెట్టారని తెలిపారు. రాజకీయంగా వ్యక్తిగత అభిప్రాయాలను తాము గౌరవిస్తామని, కానీ మరీ దిగజారి ఎదుటి వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సహించరాని విషయమని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాంటి వ్యక్తికి ఏపీలో చేపట్టిన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం ఉందని తాము భావించడం లేదని, ఈ ప్రాజెక్టుతోపాటు ఏపీలో చేపట్టబోయే ఏ ప్రాజెక్టులోనూ అతన్ని భాగస్వామిగా చేయవద్దని కోరారు.

ఆ కాంట్రాక్టు వదులుకోండి

(మొదటి పేజీ తరువాయి)

దిగారు. కొత్తగా వర్క్ దక్కించుకున్న కాకినాడకు చెందిన రెండు బార్జి కంపెనీల యజమానులను 22న హైదరాబాద్‌లో ఓ హోటల్‌కు పిలిపించారు. తాను చెప్పిన కాంట్రాక్టర్‌కు వర్క్ అప్పగించేయాలంటూ అతడిని పక్కన పెట్టుకుని వార్నింగ్ ఇచ్చారు. వారు లొంగకపోవడంతో 'నెలకు 2లక్షల చొప్పున ఇస్తాం. వర్క్ అప్పగించండి' అని ఒత్తిడి చేశారు. కాకినాడ పోర్టు నుంచి క్లియరెన్స్ పత్రాలు రావాలంటే ఈ రెండు కంపెనీలు తమ బార్జిలను తనకు కావాల్సిన కాంట్రాక్టర్ నుంచి అద్దెకు తీసుకుంటున్నట్లు అంతర్గతంగా ఒప్పందం చేసుకోవాలని బెదరించారు. వారు వినకపోవడంతో ఆ కంపెనీలకు చెందిన ఆయిల్ బార్జిలను ఆ నాయకుడు కాకినాడ పోర్టులోనే నిలిపివేయించారు. పోర్టు అధికారిపై ఒత్తిడి తెచ్చి బార్జిలకు పోర్టు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఆపేయించారు. విశాఖలోని ఐవోసీకి 21లోగా అప్పగించాల్సిన బార్జిలు కదలకపోవడంతో ఆకంపెనీ కాంట్రాక్టు రద్దు హెచ్చరిక జారీచేయడంతో సదరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించాలని..

విశాఖ తూర్పు నౌకా దళానికి నిత్యం వేల లీటర్ల డీజిల్, బ్లాక్ ఆయిల్ అవసరం. సముద్రంలో గస్తీ దగ్గర నుంచి వివిధ విన్యాసాలు, కార్యకలాపాలకు నేవీ బోట్లు, నౌకలు, టగ్‌లకు కావాల్సిన ఆయిల్‌ను ఐవోసీ నుంచి సబ్సిడీ ధరలకు కొనుగోలు చేస్తుంటుంది. నౌకలకు ఆయిల్ సరఫరా కోసం ఐవోసీ ప్రైవేటు ఆయిల్ బార్జిలు(ఆయిల్ రవాణా బోట్లు) అద్దెకు తీసుకుంటుంది. ఇందులో భాగంగా 3బార్జిలు కావాలంటూ ఐవోసీ 2024 డిసెంబరులో కేంద్రానికి చెందిన జెమ్ పోర్టల్ ద్వారా 5కోట్ల విలువైన పనికి టెండర్లు పిలిచింది. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఒక పెద్ద కంపెనీతో పాటు కాకినాడకు చెందిన 2 చిన్న కంపెనీలను గతనెలలో ఎంపిక చేసింది. సుప్రీం మెరైన్ ఎల్1, కేసరి మెరైన్ ఎల్2, కేకే మెరైన్ ఎల్3గా ఎంపికయ్యాయి. వీటికి 50:30:20 నిష్పత్తిలో ఐవోసీ కార్గో కేటాయించింది. ఈ కంపెనీలు మార్చి 21 నాటికి బార్జిలను విశాఖ పోర్టులో అప్పగించాలని ఐవోసీ ఆదేశించింది. కాకినాడకు చెందిన రెండు కంపెనీలు తమ బార్జిలను కాకినాడ పోర్టు నుంచి తరలించడానికి సిద్ధమయ్యాయి. దీనికి పోర్టు క్లియరెన్స్(పీసీ) కోసం సదరు యజమానులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ పీసీ ఇవ్వకుండా అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని, సదరు నాయకుడు అడ్డుకున్నారని చెప్పినట్టు తెలుస్తోంది. తనకు పీసీ ఇవ్వకుండా అడ్డుకోవడంపై తాజాగా వర్క్ ఆర్డరు దక్కించుకున్న ఓ కంపెనీ యజమాని సోమవారం హైకోర్టును ఆశ్రయించారు.

కాగా, ఈ నెల 21నాటికి రెండు కాకినాడ బార్జిలు విశాఖ పోర్టుకు రాకపోవడంతో ఐవోసీ తీవ్రంగా పరిగణించింది. సకాలంలో బార్జిలు పంపకపోవడంతో కాంట్రాక్టు రద్దు చేసి కంపెనీలను ఎందుకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టకూడదో చెప్పాలని మెయిల్‌లో నోటీసులు పంపింది. దీంతో నష్టపోతామని బార్జి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీ చర్యలతో వ్యవస్థపై అపనమ్మకం

▸▸ వీడియో పోస్టు చేస్తే దోపిడీ కేసు ఎలా పెట్టారు?

▸▸ కర్నూలు త్రీటౌన్ సీఐ తీరుపై ధర్మాసనం ఆగ్రహం

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కేసుల నమోదు విషయంలో పోలీసులు చట్టనిబంధనలకు లోబడి వ్యవహరించకపోవడాన్ని హైకోర్టు మరోసారి తప్పుబట్టింది. కొందరు పోలీసుల వైఖరితో ఆ వ్యవస్థను నమ్మే పరిస్థితి లేకుండా పోతోందని వ్యాఖ్యానించింది. "హైకోర్టులో కూర్చునే న్యాయమూర్తులకు వీధుల్లో జరిగే విషయాలు ఏవీ తెలియవని అనుకోవద్దు" అని పోలీసులను హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యంగంగా విమర్శిస్తూ రికార్డు చేసిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసిన వారిని అరెస్ట్ చేసే పనైతే, అలాంటి సినిమాలు తీసే దర్శకులను, అందులో నటించే హీరోలను, విలన్లను కూడా అరెస్టు చేయాలని వ్యాఖ్యానించింది. వ్యంగ్యంగా వీడియో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన ప్రేమ్‌కుమార్‌పై దోపిడీ, బలవంతపు వసూళ్ల సెక్షన్ల కింద కేసు ఎలా నమోదు చేస్తారని నిలదీసింది. ఫిర్యాదు అందిన వెంటనే హడావుడిగా కర్నూలు నుంచి వచ్చి గుంటూరులో ఉన్న ప్రేమ్‌కుమార్‌ను తెల్లవారుజామునే అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని కర్నూలు త్రీటౌన్ పోలీసు స్టేషన్ సీఐని ప్రశ్నించింది. కేసుకి సంబంధించి పూర్తి రికార్డులను తమ ముందు ఉంచాలని సీఐ, సంబంధిత మెజిస్ట్రేట్‌ను ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 8కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

నాపై సీఐడీ కేసు కొట్టివేయండి

▸▸ హైకోర్టును ఆశ్రయించిన విక్రాంత్‌రెడ్డి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్ వ్యవహారంలో సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. కేసుకి సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ సీఐడీని ఆదేశించారు. విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి, ప్రాసిక్యూషన్ తరఫున మెండలక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసింది వైసీపీ నేతే

▸▸ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తింపు... అరెస్టు

నల్లజర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు చెప్పుల దండ వేసింది వైసీపీ నాయకుడేనని పోలీసులు నిర్ధారించారు. మంగళవారం ఆయన్ను అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలో ఉన్న అంబేడ్కర్, ముసుళ్లకుంటలోని ఎన్టీఆర్ విగ్రహాలకు గత శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేశారు. పుల్లలపాడు గ్రామం మాల సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకుడు బురుపుల బాబ్జీ రెండు విగ్రహాలకూ చెప్పుల దండ వేసినట్టు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు గుర్తించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.